తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
: fb.com/vaartha Digital
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 132 పేజీలు: 10+4 వెల: 6.50



విమాన ప్రమాదం వార్త వినగానే నా హృదయం ముక్కలైంది. అది మాటలకందని విషాదం

- ప్రధాని మోడీ

ఊహించని విధంగా కుప్పకూలిన విమానం 241 మంది ప్రయాణికులతో పాటు 20 మంది మెడికల్ విద్యార్థుల ప్రాణాలు హరించడం పెనువిషాదం. ఢిల్లీ-లండన్ వయా అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి టేకాఫ్ అయిన ఐదు నిముషాల్లోనే కూలిపోవడం మొత్తం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాదానికి కారణాలు తెలియవలసి ఉంది.

# ఘోర విషాదం

## కుప్పకూలి.. భగ్గుమన్న విమానం



గురువారం అహ్మదాబాద్‌లో మెడికల్ హాస్టల్ భవనంపై కూలిన విమానం





గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## విమానంలో 169 మంది భారతీయులు

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్ సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంనుంచి లండన్‌కు బయలుదేరిన కొన్ని సెకన్లలోనే ఎయిరిండియా విమానం ప్రమాదానికి లోనయింది. మొత్తం 242 మందిప్రయాణీకులతో వెళుతున్న విమానంలో సాంకేతిక సమస్య రావడంతో ఒక భవనంపై కూలిపోయింది. మొత్తంప్రయాణీకుల్లో 169 మంది భారతీయులున్నారు. 53 మంది బ్రిటన్‌పౌరులు, ఏడుగురు పోర్చుగల్ వాసులు, ఒకరు కెనడాకు చెందినవారు ఉన్నారు. 11 మంది చిన్నారులుంటే మరో ఇద్దరుపసికందులు కూడా ఉన్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. మరోవైపు విమానం బిజెమెడికల్‌కళాశాల హాస్టల్‌పై కూలడంతో విద్యార్థుల్లో కొందరు మృతిచెందారని వినిపిస్తోంది. ప్రమాదంపై దర్యాప్తునకు సంపూర్ణ సహకారం ఇస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణీకులకోసం 1800-5691-444 నంబరును అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. పౌరువిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హుటాహుటిన అహ్మదాబాద్‌చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకని ప్రధానికి నివేదించారు.



ఘటనా స్థలంలో మృతదేహాలను తరలిస్తున్న సహాయక సిబ్బంది



### కుమార్తెకోసం లండన్ బయలుదేరిన రూపానీ.. ప్రమాదానికి బలి

5



## మృత్యుంజయుడు ఒక్కడే

**అహ్మదాబాద్,జూన్ 12:** ఎయిరిండియా బోయింగ్ విమానప్రమాదం నుంచి ఏకైక ప్రయాణీకుడు మృత్యుంజయుడుగా బయటపడ్డాడు. అహ్మదాబాద్ పోలీస్ కమినర్ మాట్లాడుతూ 11ఎ సీటులో ఉన్న వ్యక్తి బయటపడ్డాడని, ప్రమాదం నుంచి నడుచుకుంటూ బయటకు వచ్చేసాడని, ఆ ప్రయాణీకుడిని రమేష్‌విశ్వాస్‌కుమార్(38)గా గుర్తించామని చెప్పారు. మరో ప్రయాణీకుడు ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు వస్తున్న

>>2

## అహ్మదాబాద్ విమానాశ్రయంలో పెను ప్రమాదం

### గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ సహా 241 మంది దుర్మరణం

### విమానం మెడికల్ హాస్టల్‌ను ఢీ కొనడంతో 20 మంది విద్యార్థుల మృతి

టేకాఫ్ అయిన ఐదు నిమిషాల్లోనే పతనం

ప్రధాని మోడీ దిగ్భ్రాంతి.. తక్షణ చర్యలకు ఆదేశం

సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించిన కేంద్ర మంత్రులు

అమిత్‌షా, రామ్మోహన్‌నాయుడు, ఉన్నతాధికారులు

దుర్ఘటనపై డిజిసిఎ దర్యాప్తు ఆరంభం

**అహ్మదాబాద్,జూన్ 12:** భారత పౌరవిమానయాన రంగంలో దుర్దినం. అత్యంత అనుభవం కలిగిన పైలట్లు నడిపినా విమానం గాల్లోకి ఎగిరినట్లే ఎగిరి కేవలం 825 అడుగుల ఎత్తులో ఉండగానే కుప్పకూలిపోయింది. సిబ్బందితోసహా 241 మంది అగ్నికి ఆహుతయిపోయారు. అహ్మదాబాద్ సర్దార్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిక్షణాలకే బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలి మంటల్లో ఆహుతయిపోయింది. మృతుల్లో తన కుటుంబాన్ని చూసేందుకు వెళుతున్న గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపానీ కూడా ఉన్నారు. ఇటీవలే వివాహం అయిన నవవధువు తన భర్తను కలిసేందుకు లండన్ వెళ్లేందుకు ఇదే విమానంలో వెళుతున్నారు. ప్రమాదంలో ఎయిర్‌హోస్టెస్‌లు

>>2

### మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

-టాటాసన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్‌విమాన ఘోరప్రమాదంలో మృతులకుటుంబాలకు ఒక్కొక్కరికి కోటిరూపాయలు పరిహారంగా చెల్లించనున్నట్లు టాటా గ్రూప్ ఎయిరిండియా ప్రకటించింది. అలాగే ప్రమాదంలో గాయపడిన వారి వైద్యఖర్చులను కూడా కంపెనీయే పూర్తిగా

>>2



### మంటల వల్లే సాయం ఆలస్యం

క్షతగాత్రులను పరామర్శించిన అమిత్‌షా

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్ నగరశివార్లలో కుప్పకూలిన ఎయిరిండియా విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, విమానం పేలిన వెంటనే మంటలు వ్యాపించాయని, మంటలు వ్యాపించడంవల్లనే ఎవ్వరినీ కాపాడేపరిస్థితి లేకుండాపోయిందని కేంద్ర

>>2

## సూపర్-6లో కీలకం 'తల్లికి వందనం'

### ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం

### ఎందరు పిల్లలుంటే అందరికీ పథకం: మంత్రి లోకేష్



**విజయవాడ,జూన్12.,ప్రభాతవార్తప్రతినిధి:** తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని ముందే చెప్పామని, అలా చెప్పినట్లుగానే అందరికీ ఇస్తున్నామని మానవ వనరులశాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. కూటమి ఏడాది పాలన సందర్భంగా సిఎం చంద్రబాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి నిధులు ఇవాళ్టి నుంచి తల్లుల ఖాతాలో జమ అవుతాయని వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఒక్కో విద్యార్థికి సంబంధించి మిగతా 2000 రూపాయలను పాఠశాలల నిర్వహణ నిధి కింద ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లుగా పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. 67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తున్నామని దానికి రూ.10,091 కోట్లుఖర్చు అవుతుంది వివరించారు. ఈ నిధుల నుంచి స్కూళ్ల డెవలప్‌మెంట్‌కు రూ.1,346 కోట్లు వెళ్తాయని అన్నారు.అమ్మ ఒడి మార్గదర్శకాలే పాటిస్తూ అదనంగా ఎంతమంది పిల్లలున్నా ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. గత ప్రభుత్వం 42,61,965 మందికి అమ్మ ఒడి ఇచ్చిందని కాని కూటమి ప్రభుత్వం 67,27,164 మందికి తల్లికి వందనం ఇస్తున్నామని వెల్లడించారు. అలానే ఈ పథకానికి గత ప్రభుత్వం రూ.5,540 కోట్లు ఖర్చుపెడితే తాను రూ.8,745 కోట్లు ఇస్తున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఒకే బిడ్డ ఉన్న తల్లులు 18,55,760, ఇద్దరు బిడ్డలు ఉన్న తల్లులు 14,55,322, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులు 2,10,684, నలుగురు పిల్లలు ఉన్న తల్లులు

>>2



## మోగిన బడి గంటలు

### తగ్గిన పుస్తకాల బరువు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో బడి గంటలు మోగాయి. వేసవి శెలువులు ముగియడంతో బడికి బిలబిలమంటూ చేరుకున్నారు. నూతన విద్యాసంస్కరణ, విద్యావిధానం,తగ్గిన పుస్తకాల బరువు ఇతర నూతన అంశాలతో 2025-26 విద్యా సంవత్సరం ఆరంభమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 35 లక్షల మంది విద్యార్థులకు నేటి నుంచే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. కిట్‌లోబ్యాగు, యూనిఫాం,బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టు, డిక్షనరీ ఉంటాయి. అలాగే పాఠశాలల్లో నేటి నుంచి సంసిద్ధత కార్యక్రమాలు చేపడతారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం అన్నం చోటు చేసుకుంది. విద్యాశాఖ సమాచారాన్ని అనుసరించి ఈ విద్యా సంవత్సరంలో 233 రోజులు బడులు నిర్వహిస్తారు. 83 రోజులు వివిధ రూపాల్లో సెల

>>2

# రాష్ట్ర ప్రగతిని ఆపలేరు..

### యేడాదిలో విధ్వంసంనుంచి వికాసం వైపు పయనం

### ఏ రాష్ట్రంలో లేని పెన్షన్లు ఇస్తున్నాం

### 2036 ఒలింపిక్స్ అమరావతిలో జరిపేలా టార్గెట్: కూటమి ప్రభుత్వ యేడాది పాలనపై మీడియాతో సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దులబండి వంటిదని అని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.కూటమి పాలన ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యా, మానవవనరుల మంత్రి నారా లోకేష్‌తో కలిసి మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాస్వామ్యంగెలిచి ప్రజాపాలన ఏర్పడి ఏడాది పూర్తిచేసుకుంటున్నాం. సుపరిపాలనలో తొలి అడుగు పడింది. విధ్వంస పాలన నుంచి ఏకంగా వికాసం వైపు మన ప్రభుత్వం ప్రయాణం ప్రారంభించింది. కేంద్రంలో ప్రధానమంత్రి సహకారంతో ఆంధ్ర రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. ఉద్యోగాల విషయంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తోంది. డిఎస్సీని ఎట్టిపరిస్థితుల్లో ఆపాలని ప్రతిపక్ష పార్టీ సుమారు 24 కేసులు వేసింది. ఈ రోజుతో 24వ కేసు కూడా సుప్రీం కోర్టులో డిస్మిస్ అయింది. అవన్నీ తట్టుకుని డిఎస్సీ ప్రక్రియను పూర్తిచేస్తున్నాం. గడచిన పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో తీసుకువచ్చాం. రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. డొమెస్టిక్ ఇన్వెస్ట్ మెంట్స్‌లో ఏపీ భారతదేశంలోనే నెంబర్ వన్‌గా ఉంది. 16శాతం పెట్టుబడులు ఎపికి వచ్చాయి.

ఇందులో భాగంగా టిసిఎస్, ఎల్జీ, ఎన్టీపిసి గ్రీన్, ఆర్సెల్లార్ మిట్టల్, బిపిసిఎల్, రిలయన్స్ రెన్యూ పవర్ లాంటి సంస్థలు ఈ రోజు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కనుకనే విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుకోగలిగాం. రైల్వేజోన్ సాధించాం. అంతేకాకుండా భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాంప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు రూ.వెయ్యిపెంచి రూ.4వేలుఅందిస్తున్నాం. వికలాంగులకు రూ.3వేలు

>>2



విరిగిపడిన విమాన టైర్లు



సహాయం కోసం సిద్ధంగా అంబులెన్సులు



మృతదేహాలను తరలిస్తున్న సహాయకులు



చెల్లాచెదురుగా పడిన విమాన శకలాలు

# ఘోర విషాదం

>> కూడా మరణించడంతో వారి కుటుంబాలు ఒక్కసారిగా బావురుమన్నాయి. గురువారం మధ్యాహ్నం 1.30 గంటలప్రాంతంలో గుజరాత్‌లోని పటేల్ ఎయిర్‌పోర్టులో 23వ రన్‌వేనుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా ఎఐ-171 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. టేకాఫ్‌కు అవసరమైనంత వేగం కూడా విమానం అందుకోలేకపోయిందని చెపుతున్నారు. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్‌ప్రాంతంలో విమానం సాంకేతిక సమస్యల కారణంగా కుప్పకూలిపోయింది. విమానం 625 అడుగుల ఎత్తులో ఉన్నపుడే సిగ్నల్స్ కోల్పోయింది. అత్యవసర పరిస్థితిని వివరిస్తూ ఎటిసికి పైలట్లు 'మేడే'కాల్ చేసారు. ఇదిజరిగిన కొద్ది క్షణాలకే విమానం కూలిపోయింది. టేకాఫ్ 1.30 గంటలకు కాగా 1.39 గంటలకే విమానం 625 అడుగుల ఎత్తునుంచి క్రమేపీ కిందికి దిగిపోతూ ఒక చెట్టును ఢీకొని ఆపై ఒక వైద్యకళాశాల హాస్టల్‌భవనాన్ని కూడా ఢీకొన్ని పడిపోయింది. ఒక్కసారిగా మంటలు అలుముకోవడంతో విమానం పైలట్లతోసహా క్రూసిబ్బంది మొత్తం 241 మంది చనిపోయినట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకించింది. ప్రమాదానికి గురయిన బోయింగ్ వైడ్‌బాడీ డ్రీమ్‌లైనర్ 707 విమానం 11 ఏళ్లగా ఎయిరిండియాలోపనిచేస్తోంది. సుదూరప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీ మొత్తంలోనే ఉంది. అందువల్లనేప్రమాద తీవ్రత మరింతపెరిగింది. వీరిలో 53 మంది బ్రిటన్‌వాసులు కాగా 169 మంది భారతీయులు. మృతుల్లో 11 మంది చిన్నారులుంటే మరో ఇద్దరు పసికందులు కూడా ఉన్నారు.

వ్యాపార ట్రిప్‌ల్లో వెళ్లే ప్రముఖులు, తమ వారిని కలిసేందుకు వెళ్లే కుటుంబీకులు వీరంతా ఒక్కసారిగా మంటల్లో అహుతయిపోయారు.

విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్‌లు వ్యవహరించారు. సమిత్‌కు ఎల్టీసీగా 8200గంటలు, కోపైలట్‌కు 1100 గంటల అనుభవం ఉందని డిజిసిఎ వెల్లడించింది. ఎటిసి సమాచారం మేరకు రన్‌వే 23నుంచే గాల్లోకి టేకాఫ్ అయిందని, కొద్దిసేపటికే ఎటిసికి మేడేకాల్ అంటే అత్యవసరకాల్ వచ్చిందని ఆ కాల్ వచ్చిన కొద్ది క్షణాలకే విమానం కూలిపోయిందని తెలిపింది. ఎమర్జెన్సీ సమయాల్లో పైలట్లు మూడుసార్లు మేడే పదాన్ని చెపుతారు. ఫ్రెంచ్‌పదం మైడేర్‌నుంచి వచ్చింది. సాయంచేయండి అని దీని అర్థం విమానాలు, నౌకల్లోకూడా మేడేకాల్ వినియోగిస్తారు. ప్రస్తుతం ఎయిరిండియా బోయింగ్ పైలట్లుకూడా ఇదే పదం వినియోగించారు.

**మెయింటెనెన్స్‌లోపాలు..!**

ప్రమాదం జరిగిన విమానానికి సకాలంలో ఓవర్‌హాలింగ్‌చేయ డంలో కూడా నిర్లక్ష్యం వహించినట్లు ఎయిర్‌ఇండియాపై ఆరోప ణలున్నాయి. పలుపర్యాయాలు ఈవిమానానికేసాంకే తికలో పాలు ఎదురయ్యాయి. గడచిన ఏడాది డిసెంబరులో కూడా ఇదే విమానంలో పొగలు వచ్చాయి. ఏడాదిలో రెండుసార్లు సాంకేతిక సమస్యలు రాగా జూన్, డిసెంబరు మాసాల్లో కూడా భారీ ప్రమాదాలు తప్పినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై డిజిసిఎ కూడా తన దర్యాప్తులో విమానం సాంకేతిక లోపాలేనని ప్రాథమికంగా గుర్తించింది. కాగా విమానంలో 10 మందిక్రూసిబ్బందితోపాటు మొత్తం 242 మంది ప్రయాణిస్తుండగా 241 మందిప్రాణాలు వదిలినట్లు తేలింది.

**ప్రమాదంనుంచి బయటపడిన మృత్యుంజయుడు**

కాగా ఎయిరిండియా బోయింగ్ విమానప్రమాదంనుంచి ఏకైక ప్రయాణీకుడు మృత్యుంజయుడుగా బయటపడ్డాడు. అహ్మదాబాద్ పోలీస్ కమినర్ మాట్లాడుతూ 11ఎ సీటులో ఉన్న వ్యక్తి బయటపడ్డాడని, ప్రమాదంనుంచి నడుచుకుంటూ బయటకు వచ్చేసాడని, ఆ ప్రయాణీకుడిని రమేష్ విశ్వాస్‌కుమార్(38)గా గుర్తించామని చెప్పారు. మరో ప్రయాణీకుడు ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు వస్తున్న సమయంలోనే విమానంలో సమస్యలున్నట్లు గుర్తించి వాటిని విడియోతీసి వైరల్‌చేసాడు. ఎసి, సీట్లు, పారిశుధ్యం వంటి వాటితోపాటు విమానంలో సాంకేతికసమస్యలు కూడా ఉండొచ్చని ట్వీట్‌చేసాడు. వీటన్నింటినీ గుర్తించి విమానం ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు చేరుకోగానే తాను దిగిపోయినట్లు ఆకాశ్‌అవస్థ అనే ప్రయాణీకుడు తన ట్వీట్‌తో వైరల్‌చేయడంతో విమానంలో సాంకేతికలోపాలు ఎక్కువగానే ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

## మంటల వల్లే సాయం ఆలస్యం

>> హోంమంత్రి అమిత్‌షా ఆవేదన వ్యక్తంచేసారు. ఎయిరిండియా బోయింగ్‌డ్రీమ్‌లైనర్ కుప్పకూలిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. అహ్మదాబాద్ ఆసుపత్రులకువెళ్లి ఆయన క్షతగాత్రులను పరామర్శించారు. అలాగే ఏకైకమృత్యుంజయుడు రమేష్ విశ్వాస్‌కుమార్‌ను కూడా ఆయన ఓదార్చారు. అతనికి అన్నివిధాలా అండగా ఉంటాం. మృతులను గుర్తించేందుకు డిఎన్ఎ పరీక్షలుచేస్తున్నామని పరీక్షలుచేసిన తర్వాతనే మృతుల వివరాలను వెల్లడిస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట పర్యటనలో కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, గుజరాత్‌సీఎం భూపేంద్రపటేల్ ఇతర మంత్రులు అధికారులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

>> భరిస్తుందని, వారికి అవసరమైన అన్ని సంరక్షణ దీర్ఘకాలిక అవసరాలకు అండగా నిలుస్తుందని టాటాసన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. కాగా ఈ విమానంలో 169 మంది భారతీయులుంటే పదిమంది సిబ్బంది. 53 మంది బ్రిటన్‌పౌరులు, ఏడుగురు పోర్చుగల్ జాతీయులు, ఒకరు కెనడా దేశస్తుడున్నారు. మృతుల్లో 217 మంది పెద్దలు, 11 మంది పిల్లలు, ఇద్దరు పసికందులున్నారని అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్ స్వయంగా ప్రకటించారు. విమానప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్నట్లు చెపుతున్న వైద్యకళాశాల భవనాన్ని టాటా సన్స్ పునర్‌నిర్మిస్తుందని చంద్రశేఖరన్ హామీ ఇచ్చారు.

## మృత్యుంజయుడు ఒక్కడే

>> సమయంలోనే విమానంలో సమస్యలున్నట్లు గుర్తించి వాటిని విడియోతీసి వైరల్‌చేసాడు. ఎసి, సీట్లు, పారిశుధ్యం వంటి వాటితోపాటు విమానంలో సాంకేతికసమస్యలు కూడా ఉండొచ్చని ట్వీట్‌చేసాడు. వీటన్నింటినీ గుర్తించి విమానం ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు చేరుకోగానే తాను దిగిపోయినట్లు ఆకాశ్‌అవస్థ అనే ప్రయాణీకుడు తన ట్వీట్‌తో వైరల్‌చేయడంతో విమానంలో సాంకేతికలోపాలు ఎక్కువగానే ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

## సూపర్-6లో కీలకం 'తల్లికి వందనం'

>> 2,053 మంది ఉన్నారని వారందరికీ తల్లికి వందనం ఇస్తున్నామని లోకేష్ తెలిపారు. తల్లి లేని పిల్లలకు తండ్రికి లేదా గార్డియన్ ఖాతాలో తల్లికి వందనం డబ్బులు జమ చేస్తామని అలానే అనాథ పిల్లలుంటే జిల్లా కలెక్టర్ నిర్ధారించిన ప్రకారం వారి ఖాతాలో నిధులు జమ చేస్తామని అన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి నిధులు ఇవాళ్టి నుంచి తల్లుల ఖాతాలో జమ అవుతాయని వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లోని 76,000 మందికి కూడా తల్లికి వందనం వర్తింపచేశామని తెలిపారు. తల్లికి వందనం జాబితా సచివాలయం, గ్రామ, వార్డు కార్యాలయాల్లోనూ ఉంచుతామని, ఇంకా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే తెలియజేస్తే పరిష్కారం చేస్తామని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు జూన్ 26 వరకు గడువు పెట్టామని జూన్ 30న తల్లికి వందనం తుదిజాబితా పెడతామని తెలిపారు.

## నేడు, రేపు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాల్లో కదలిక రానుంది. రెండు వారాల విరామం తర్వాత రుతుపవనాల్లో కదలిక ఆరంభమైందని వాతావరణ శాఖ చెబుతుంది. గత నెల 29వ తేదీ తర్వాత నిలిచిపోయిన నైరుతి రుతుపవనాలు ఒకటి, రెండు రోజుల్లో మళ్లీ పురోగమించే వాతావరణం నెలకొంది. రెండు, మూడు రోజుల్లో కర్ణాటక, కొంకణ్, గోవా, ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. తమిళనాడు, తెలంగాణ, ఎపిలో వర్షాలు పెరగనున్నాయి.

### సిఎం నేటి విశాఖ టూర్ రద్దు

**విజయవాడ జూన్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** నేడు విశాఖలో నిర్వహిస్తున్న న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ రీజనల్ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనాల్సి ఉంది. అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో విశాఖ కార్యక్రమం రద్దు అయింది. అలాగే ప్రమాదం కారణంగా రేపటికి వాయిదా పడిన సుపరిపాలనలో తొలి అడుగు పేరిట నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం కూడా రద్దు అయింది.

### ప్రభుత్వ విజయోత్సవ సభ నేటికి వాయిదా

**విజయవాడ.జూన్12,.ప్రభాతవార్తప్రతినిధి:** అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ సభను ఈ నెల 13 శుక్రవారానికి వాయిదా వేసింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం కారణంగా సభను వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

### వైఎస్సార్సీ నేత సజ్జలకు మహిళా కమిషన్ నోటీసులు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామ కృష్ణారెడ్డికి రాష్ట్ర మహిళా కమీషన్ నోటీసులు జారీ చేసింది. వీళ్లంతా పిశాచాలు, రాక్షసులు కలిసిన సంకర తెగ అంటూ రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సజ్జలపై ఆరోపణలతో కూడిన ఫిర్యాదుపై ఈ నోటీసులు జారీ చేసినట్లు మహిళా కమీషన్ చైర్‌పర్సన్ శైలజా రాయపాటి తెలిపారు. అంతేకాకుండా ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన వార్తలను మహిళా కమీషన్ సూమోటోగా తీసుకుందని వివరించారు. దీనిపై అమరావతి మహిళలు, రైతులు సైతం మహిళా కమీషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారనివివరించారు. ఈ నేపథ్యంలో ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఏ ఆధారాలతో ఇలాంటి వ్యాఖ్యలు చేశారో...ఈ నెల 18న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కమీషన్ స్పష్టం చేసింది.

### వారం - వర్జ్యం

తేది : 13-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
విదియ మ.3.16
పూర్వాషాఢ రా.11.18
వర్జ్యం ఉ.7.39-9.19
దు.ఉ.8.12-9.04, 2) మ.12.34-మ.1.26
శుభసమయం : ఉ.9.25-10.00, 2) సా.6.30-7.10
రాహుకాలం – ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం :** ఏపని చేపట్టినా విజయవంతంగా పూర్తిచేస్తారు. విలువైన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**వృషభం :** ఆరోగ్య, వాహనాల విషయాలలో మెలకువ చాలా అవసరం. ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు.

**మిథునం:** బంధువులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రుల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**సింహం:** జీవితభాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శుభవార్తలు వింటారు.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు. గృహ యోగం.

**తుల :** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. సోదరుల నుండి ధనలాభం పొందుతారు.

**వృశ్చికం:** పారిశ్రామిక, వైద్య రంగాలలోని వారికి విదేశీ పర్యటనలువుంటాయి. ఉద్యోగ యత్నాలు కలిసివస్తాయి.

**ధనుస్సు:** జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందిస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మకరం:** సంఘంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపందాలుస్తాయి.

**కుంభం:** వైద్య, విద్య రంగాలలో వారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు. మీ మాటకు విలువ పెరుగుతుంది.

**మీనం :** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం అహ్మదాబాద్‌లో ప్రమాదానికి గురైన ఎయిర్ ఇండియా విమానం దృశ్యం

## బ్లాక్‌బాక్స్ రికవరీలో అధికారులు నిమగ్నం!

### పక్షులు ఢీకొనడంవల్లే కూలిపోయిందా?

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా బోయింగ్‌డ్రీమ్‌లైనర్ విమానానికి సంబంధించి బ్లాక్‌బాక్స్‌ను రికవరీచేసేందుకు డిజిసిఎ అధికారులు కృషిచేస్తున్నారు. అటు సర్దార్‌పటేల్ ఎయిర్‌పోర్టు అధికారులతోపాటు, టాటా ఎయిరిండియా అధికారులు కూడా బ్లాక్‌బాక్స్ స్వాధీనం అయితే ప్రమాదానికి గల అసలు కారణాలు తెలుస్తాయని చెపుతున్నారు. బ్లాక్‌బాక్స్ అనేది విమానం పనితీరు, పైలట్లమధ్య సంభాషణలను రికార్డుచేసేందుకు ఈ బాక్స్ ఏర్పాటుచేస్తారు. ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ రెండు భాగాలను బ్లాక్‌బాక్స్‌గా పరిగణిస్తారు. ఫ్లైట్ డేటా రికార్డర్ విమానం ఎంత ఎత్తులో ఉంది. ఎంతవేగంతోప్రయాణిస్తోంది. ఫ్లైట్‌కంట్రోల్స్ పనితీరును రికార్డుచేస్తుం ది. ఫ్లైట్‌డేటా రికార్డర్ ఎత్తు వేగం ఇంజిన్‌థ్రస్ట్ ఫ్లైట్ పాత్ డేటాతోసహా మొత్తం ముఖ్యమైన టెక్నికల్ పారామీ టర్స్ అన్నీ నమోదుచేస్తుంది. ఇక కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ పైలట్లమధ్య సంభాషణలు ఎటిసినుంచి వచ్చే ఆదేశాలు సేకరిస్తుంది. ఈ బాక్స్ లబిస్తే విమానప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయి. ఈ బ్లాక్ బాక్సులు అత్యంత దృఢంగా ఉంటాయి. ఎలాంటి ప్రమాదం అయినా తట్టుకుంటాయి.



విమాన ప్రమాదంలో మరణించిన పైలట్లు

ప్రకాశవంతమైన నారింజరంగులో ఉంటే ఈ బాక్స్ పేలుళ్లు, మంటలు, నీటిపీడనం, హైస్పీడ్‌క్రాష్‌లను కూడా తట్టుకుంటుంది. 25 గంటల ఫ్లైయిట్ సమాచారాన్ని రికార్డుచేసి ఈ బ్లాక్‌బాక్స్ భద్రపరుచుకునే సామర్థ్యంతో ఉంటుంది. వైమానికరంగంలోపనిచేసిన సీనియర్ పైలట్ కెప్టెన్ సౌరభ్ భట్నాగర్ బహుశా పక్షులు ఢీకొనడంవల్ల రెండు ఇంజన్లు శక్తిని కోల్పోయి ఉంటాయన్న అనుమానం వ్యక్తంచేసారు. టేకాఫ్ బాగానే ఉందని, లానయండింగ్‌గేర్ పైకి లేవడానికి ముందే విమానం కిందకు దిగుతున్నట్లుకనిపించిందన్నారు. ఇది ఇంజిన్ వైఫల్యాన్ని సూచిస్తోందని, విమానానికి లిఫ్ట్ అయ్యేందుకు కావాల్సిన శక్తిలేకపోవడంవల్లే జరిగినట్లు కనిపిస్తున్నదన్నారు. టేకాఫ్ అసమానంగా జరిగిందని, నియంత్రణలేకుండా కిందకు వచ్చిందని అందువల్లనే పైలట్ మేడేకాల్‌చేసినట్లు స్పష్టం అవుతోందన్నారు. టేకాఫ్ సమయంలో పక్షులు ఢీకొట్టి ఉంటే, ఆరేడు నిమిషాల తర్వాత పడిపోవడం ప్రారంభం అయి ఉండవచ్చని అంచనావేసారు. ఇది చాలా కొత్త విమానం అని చెపుతూనే 11 ఏళ్ల విమానంకాబట్టి సాంకేతికసమస్యలు కూడా తక్కువగానే ఉండవచ్చని అంచనావేసారు.

## బిజె వైద్యకళాశాల హాస్టల్‌పై పడిన విమానశకలాలు

### 20 మందికి పైగా విద్యార్థులు మృతి

**అహ్మదాబాద్, జూన్ 12:** నగరంలోప్రమాదానికి గురయిన ఎయిర్‌ఇండియా విభాగం ఎఐ-171 జనావాసాల్లోపడింది. దీనితోని కొన్ని భాగాలుఅక్కడే ఉన్న బిజె మెడికల్ కళాశాల యూజి హాస్టల్‌భవనాలపై పడ్డాయి. ఇందులోనే మెడికల్‌కళాశాల యుజి విద్యార్థులు బసచేస్తున్నారు. అందరికీ భోజనవిరామసమయం కావడంతో అందరూ హాస్టల్‌లోనే ఉన్నట్లు తేలింది. శకలాలు భవనంపైపడి ఒకచోట భారీ స్థాయిలో మంటలు చెలరేగాయి. కనీసం 20మందికిపై విద్యార్థులు మృతిచెందినట్లు అధికారులు చెపుతున్నారు. ప్రమాదంజరిగిన నిమిషాల్లో సహాయక సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో పలువురిని సురక్షితంగా బయటకు తీసారు. ప్రస్తుతంమూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలుచేపట్టాయి. వదోదరనుంచి మరో రెండు బృందాలను అక్కడికి తరలిస్తున్నారు. ప్రమాదస్థలినుంచి అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రివరకూ గ్రీన్‌కారిడార్‌ను ఏర్పాటుచేసారు.

## బోయింగ్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు!

### పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు

**అహ్మదాబాద్,జూన్ 12:** సాంకేతికలోపంతో కుప్పకూలిన టాటా ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్‌ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విజయవాడలో ఉన్న కేంద్ర మంత్రి ప్రధానిమోడీ ఫోన్‌చేయడంతో హుటాహుటిన అక్కడినుంచే నేరుగా అహ్మదాబాద్‌కువెళ్లారు. అనంతరం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించిన తర్వాత మాట్లాడుతూ ప్రమాద ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ప్రధానిమోడీ ఫోన్‌చేసి ప్రమాదం గురించి ఆరాతీసారని, ప్రమాదం తెలిసినవెంటనే తాను నేరుగా ప్రమాదస్థలానికి వచ్చి పరిశీలించి మొత్తం వివరాలు ప్రధాని మోడీజీకి అందచేసానన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తుజరుగుతోందని, అన్ని కోణాల్లో లోతైన నిష్పాక్షికమైన దర్యాప్తుచేస్తామని చెప్పారు. అధికారులతో సమావేశం తర్వాత మరిన్ని వివరాలు అందిస్తామన్నారు.

## విమాన ప్రమాద ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. విమానం ప్రమాదానికి గురైన సమయంలో అందులో ఇద్దరు పైలట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బందితో సహా 242 మంది ఉన్నారు. అయితే ఈ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సిఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రార్థిస్తున్నానని అన్నారు. అహ్మదాబాద్ లో విమాన ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఘటనలో బాధితులైన వారి కోసం ప్రార్థిస్తున్నానని తెలిపారు.

**అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికరం: డి.సిఎం పవన్**

అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. 242 మందితో లండన్ బయలుదేరిన విమానం – టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోవడాన్ని ఊహించలేకున్నాము. వైద్య కళాశాల వసతి భవనాలపై కూలడంతో ఒక మహా విషాదంగా మిగిలింది. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు దేశం బాసటగా ఉండాల్సిన సమయం ఇదని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

**విజయవాడ నుంచి అహ్మదాబాద్ బయలుదేరిన రామ్మోహననాయుడు**

విమాన ప్రమాద ఘటన తెలియగానే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విజయవాడ నుంచి హుటాహుటిన అహ్మదాబాద్ బయలుదేరి వెళ్లారు. కాగా ఈ ఘటనపై రామ్మోహన్‌తో ప్రధాని మోడీ ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరాతీశారు. క్షేత్రస్థాయిలో సహాయ చర్యలు స్వయంగా పర్యవేక్షించేందుకు తాను అహ్మదాబాద్ వెళ్తున్నట్లు రామ్మోహన్ నాయుడు ప్రధానికి తెలిపారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూ, పరిస్థితిపై క్రమం తప్పకుండా సమాచారం అందించాలని ప్రధాని సూచించారు. సంబంధిత అన్ని సంస్థలను సమన్వయం చేసుకోవాలని ప్రధాని మోడీ ఆదేశించారు.

## మోగిన బడి గంటలు

>> వులు ఉంటాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ 2025-26 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు వేర్వేరుగా క్యాలెండర్లు రూపొందించింది. సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 10 వరకు దసరా సెలవులు, జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. సబ్జెక్టుల వెయిటేజీని పరిశీలిస్తే గణితం సబ్జెక్టుకు అత్యధికంగా 40 పీరియడ్లు కేటాయించారు. తెలుగుకు 30, హిందీకి 25, ఇంగ్లీష్‌కు 30, బయాలజీకి 30, ఫిజిక్స్‌కు 18, సోషల్‌కు 30 పీరియడ్లు కేటాయించాం. నవంబరు 10 నుంచి 19 వరకు సమ్మేటివ్ అసెసమెంట్1 పరీక్షలు, ఏప్రిల్ 6 నుంచి 15 వరకు సమ్మేటివ్ అసెసమెంట్ 2 పరీక్షలు జరుగుతాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రాథమిక తేదీలను ఈసారి ముందుగానే ప్రకటించారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగేలా షెడ్యూలు రూపొందించారు. మార్చి 2 నుంచి 12 వరకు టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు. పబ్లిక్ పరీక్షలకు ముందు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తారు.

## రాష్ట్ర ప్రగతిని ఆపలేరు..

>> పెంచి రూ.6వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి ప్రతినెలా రూ.15వేలు అందిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా 203 అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం జరిగింది. ఆగష్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం కూడా అమలుచేస్తున్నాం. దీపం పథకం ద్వారా ఇప్పటికే 2 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ప్రజా ప్రభుత్వం తెలుగింటి ఆడపడుచులకు అందించడం జరిగింది. గ్యాస్ పథకంలో సవరణలు తీసుకువచ్చి సదరు నగదును మహిళల బ్యాంక్ అకౌంట్లకే నేరుగా బదిలీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. బాబు సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం హామీ నిలబెట్టుకున్నాం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనం హామీ నిలబెట్టుకుంటున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలుచేస్తామని చెప్పాం. హామీ ఇచ్చిన విధంగా జీవో విడుదల చేయడం జరిగింది. ఈ రోజు నుంచి నగదు తల్లుల అకౌంట్లలో జమచేయడం జరుగుతుంది. రూ.13వేలు తల్లుల అకౌంట్లలో పడతాయి. రూ.2వేలు పాఠశాలల్లో మెయింటెన్స్ గ్రాంట్ కింద ఖర్చు చేయడం జరుగుతుంది. తల్లికి వందనం కింద దాదాపు 60శాతం కుటుంబాలు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్నారు. వారికి ఇద్దరుంటే రూ.26వేలు, ముగ్గురుంటే రూ.39వేలు వస్తాయి. వారి అకౌంట్ల లోనే నగదు జమచేయడం జరుగుతుందన్నారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌లో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మార్పుచేర్పులు చేస్తున్నామని సిఎం చంద్రబాబు చెప్పారు. అప్పట్లో స్పోర్ట్స్ సిటీ కావాలనుకున్నామని, ఈ ఐదేళ్లలో చాలా మార్పులు వచ్చాయన్నారు. స్పోర్ట్స్‌కోసం ప్రత్యేక నగరాలు ఏర్పాటవుతు న్నాయని, అమరావతిలో ఇప్పుడు కేవలం ఒక స్టేడియం సరిపోదని అభిప్రాయపడ్డారు. క్రికెట్ స్టేడియం, దానిచుట్టూ హోటళ్లు, నివాస ప్రాంతాలు, వివిధ ఈవెంట్ల నిర్వహణకు అవసరమైన ప్రాంగణాలను 500 నుంచి 1000 ఎకరాల్లో నిర్మిస్తామని అన్నారు. 2036లో ఒలింపిక్స్ నిర్వహించే అవకాశం భారత్‌కు వస్తుందని, వాటిని అమరావతిలోనే జరిగేలా టార్గెట్‌గా పెట్టుకున్నా మని పేర్కొన్నారు.

పోలవరం పనులను జగన్ మోహన్ రెడ్డి కక్షతో నిలిపేశారని, ఇంజినీర్లను, గుత్తేదారు సంస్థను మార్చారని చంద్రబాబు అన్నారు. రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రం వాల్ పర్యవేక్షణ లేక వరదల్లో ధ్వంసమైందని, ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పేవరకూ డయాఫ్రం వాల్ దెబ్బతిందని తెలియదని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతంలో పనిచేసిన ఏజెన్సీనే పిలిపించి రూ.1,000 కోట్లతో డయాఫ్రం వాల్ కడుతున్నామని చెప్పారు. పోలవరం బనకచర్ల అనుసంధానంతో రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వగలమని, ఇప్పుడు రూ.81,000 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు, ఐదేళ్ల తర్వాత చేపడితే రూ.1.60 లక్షల కోట్లు అవుతుందని చంద్రబాబు అన్నారు. గోదావరి నుంచి ఏటా 3,000 టీఎంసీల నీళ్లు సముద్రంలోకి పోతున్నాయని చంద్రబాబు వెల్లడించారు.

# కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో మరో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు భేటీ

**పామాయిల్ దిగుమతులపై సుంకం సవరించాలి**

**ఉపాధి హామీ బకాయిల సమస్య పరిష్కరించాలి**

**కందిదినుసుల సేకరణ గడువు పెంచాలని వినతి**

**విజయవాడ ,జూన్ 12,ప్రభాత వార్త ప్రతినిధి:** ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రాష్ట్ర రైతుల సమస్యలను చర్చించేందుకు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మూడు ప్రధాన అంశాల మీద ఇరువురి చర్చ జరిగింది. 2014-19 సంవత్సరాల మధ్య ఉపాధి పథకం కింద రాష్ట్రానికి చెల్లించాల్సిన బకాయిల సమస్యను త్వరితగతిన పరిష్కరించి నిధులు విడుదల చేయమని కోరారు. దేశం లోనే అత్యధిక పామాయిల్ ఉత్పత్తి చేసే రాష్ట్ర ఆంధ్రప్రదేశ్. కేంద్ర ప్రభుత్వం క్రూడ్ ఎడిబుల్ ఆయిల్‌పై దిగుమతి సుంకం 20 శాతం నుండి 10 శాతానికి తగ్గించడం వల్ల దేశీయంగా పంట ఉత్పత్తి చేస్తున్న రైతులు మార్కెట్ హెచ్చు తగ్గుల వల్ల నష్టపోతారని, ఆ సుంకాన్ని పాత రేటు ప్రకారం కొనసాగించాలని కోరారు. అలాగే జాతీయ వ్యవసాయ కార్పొరేషన్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ద్వారా సేకరించిన పప్పు దినుసులు ముఖ్యంగా రెడ్ గ్రామ్ గడువు ఈ నెల జూన్ 15తో ముగియనుందని రైతుల సౌకర్యార్థం సేకరణ గడువు మరింత పెంచాల్సిందిగా కోరారు.

వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ చౌహాన్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు కేంద్రమంత్రి తెలిపారు.



కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మంత్రి రామ్మోహన్‌నాయుడు భేటీ



జలవనరుల శాఖ మంత్రికి వినతి పత్రం అందిస్తున్న సుధీర్‌రెడ్డి

# కాళహస్తి అభివృద్ధికి నిధులిచ్చి సహకరించండి

## జలవనరుల మంత్రికి అభ్యర్థన సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయానికి పెట్టింది పేరు అని ఇక్కడ వ్యవసాయం కేవలం చెరువులు, బావులు, బోర్ల మీద ఆధారపడి సాగుతుందని అయితే రెండే రెండు ప్రాజెక్టులు ఉన్నాయని మల్లిమడుగు, స్వర్ణముఖి లని వాటికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంగా రాణిస్తుందని ఇక్కడి నియోజకవర్గంలో సుమారు 250 గ్రామాలున్నట్లు వివరించారు. ఓ వైపు స్వర్ణముఖి జీవనది తీరాన వ్యవసాయం సాగుతుందన్నారు. శ్రీకాళహస్తిని సస్యశ్యామలం చేసే ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆయన్ను కోరారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయటానికి గతంలో తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టును రూపకల్పన చేయించారని తెలుగుగంగ నీటిని ఎస్ ఎస్ కెనాల్‌లో అనుసంధానం చేసి సుమారు లక్ష ఎకరాలకు సాగునీటిని అదనంగా ఇవ్వటానికి మరో పంట పండించుకొనుటకు అవకాశం కల్పించారన్నారు. ఇందుకు ఏడు రిజర్వాయర్‌లను నిర్మించారు. కానీ అటవీశాఖ పేచితో ఎస్ ఎస్ కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అయితే ప్రతి ఏడాది బడ్జెట్‌లో కేటాయింపుచేస్తున్నారు కానీ కాలువ పూర్తి కాకుంటే నీరు ఎలా వస్తుందని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ కాలువ పూర్తి అయితే శ్రీకాళహస్తి ఏర్పేడు మండలాల్లో రైతులు ఒరెండు పంటలు పండించుకోవచ్చునని అంతేకాక తొండమనాడుచెరువు నుంచి స్వర్ణముఖి నదిలోకి నీటిని విడుదల చేయటంతో పరివాహక ప్రాంతాల్లో సాగునీటితో పాటు శ్రీకాళహస్తి ప్రజల దాహార్తిని తీర్చుటకు స్వర్ణముఖినదిలో భూగర్భ జలాలు పెరుగుతాయని రాబోవు రోజుల్లో ఇదో పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుటకు అలాగే హైదరాబాద్ ట్యాంక్ బండ్‌ను మరిపించే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని ఎంఎల్‌ఏ జలవనరులశాఖ మంత్రికి వివరించారు.

# జర్నలిస్టు కృష్ణంరాజుకు 14 రోజుల రిమాండ్

**సచివాలయం,జూన్12,ప్రభాతవార్త:** అమరావతి మహిళలను అనుచిత పదజాలంతో కించపరిచిన జర్నలిస్టు కృష్ణంరాజు పోలీసులు అరెస్ట్ చేసారు. ఈ నేపథ్యంలో గురువారం అతన్ని మంగళగిరి కోర్టుకు హాజరు పరిచారు. న్యాయస్థానం అతనికి 14 రోజుల రిమాండ్ విధించింది. దాంతో కృష్ణంరాజును పోలీస్ బందోబస్తుతో జిల్లా జైలుకు తరలించారు. ఓ ఛానల్ డిబేట్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన అనలిస్టు కృష్ణంరాజును తుళ్లూరు పోలీసులు విశాఖ దగ్గరల్లో అరెస్టు చేశారు. . అక్కడి నుండి గుంటూరు తీసుకువచ్చారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఆయనను మంగళగిరి కోర్టుకు లో హాజరపరిచారు. న్యాయమూర్తి జర్నలిస్ట్ కృష్ణంరాజుకు 14 డిమాండ్ విధించారు. రాజధాని మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని అమరావతి రాజధాని మహిళ నేత కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు మేరకు కృష్ణంరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన మొదటి ముద్దాయి కాగా రెండవ ముద్దాయి జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్ ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో వీరిపై పలు కేసులు నమోదు అయ్యాయి. కోర్టు వద్ద రైతులు నిరసకాగా కృష్ణంరాజును మంగళగిరి కోర్టుకు తీసుకువస్తున్నారన్న సమాచారంతో రాజధాని ప్రాంతాలనుండి జేఏసీ నేతలు మహిళలు ప్రజలు పెద్ద ఎత్తున కోర్టుకు వద్దకు చేరుకున్నారు. ఎట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితుని కోర్టు డిమాండ్ విధించి గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తున్న సమయంలో అమరావతి ప్రాంత రైతులు నేతలు మహిళలు పెద్ద ఎత్తున కోర్టు బయట నిలబడి కృష్ణంరాజుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

# రాష్ట్రంలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం సాయంత్రం విడుదలయ్యాయి. మొత్తంగా 1,23,477మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 76.14శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. బాలికల్లో 80.10శాతం, బాలురలో 73.55 శాతం ఉత్తీర్ణత నమోదైందని అన్నారు. విద్యార్థులు జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు రీకౌంటింగ్/ రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలను మే 19 నుండి 28వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించింది.

# అనంతపురం జిల్లా మీదుగా బళ్లారి-చిక్ జాజుర్ డబ్లింగ్ రైలు మార్గానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

**- ప్రాజెక్టు మొత్తం నిడివి 185కి.మీలు**
**- అంచనా వ్యయం రూ.3,342కోట్లు**




రైలు మార్గం ప్రాజెక్టు రూట్‌మ్యాప్

**గుంతకల్లు రైల్వే,జూన్ 12,ప్రభాత వార్త** అనంతపురం జిల్లా మీదుగా బళ్లారి-చిక్ జాజుర్‌ల మధ్య 185కి.మీల డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టును రూ.3,342కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు కేంద్రప్రభుత్వం ఆమోదించింది. న్యూఢిల్లీలో బుధవారం ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ రూ.3,342కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బళ్లారి-రాయదుర్గం- చిత్రదుర్గ-చిక్ జాజుర్‌ల మధ్య కొత్తగా నిర్మించనున్న డబ్లింగ్ రైలు మార్గంతో పాటు ఝార్ఖండ్ రాష్ట్రంలో కోడర్మ-బర్కకానా మధ్య చేపట్టనున్న మరో డబ్లింగ్ రైలు మార్గానికి సైతం కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. బళ్లారి-రాయదుర్గం- చిత్రదుర్గ-చిక్ జాజుర్ డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టు వివరాలు : ప్రాజెక్టు నిడివి 185కి.మీలు, అంచనా వ్యయం రూ.3342కోట్లు కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని బళ్లారి,అనంతపురం, చిత్రదుర్గ జిల్లాలలోని 470గ్రామాలలో నివసించే 13లక్షల మందికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. అలాగే ఇనుప ఖనిజం, బొగ్గు,స్టీల్,ఫర్టిలైజర్స్, ఆహార ఉత్పత్తుల,పెట్రోలియం వంటి సరుకు రవాణా అదనంగా 18.9మిలియన్ టన్నులు సరుకు రవాణా, ఆదాయం అదనంగా పెరుగుతుంది. 185కి.మీల ఈ ప్రాజెక్టులో 19స్టేషన్లు,29మేజర్ బ్రిడ్జిలు,230మైనర్ బ్రిడ్జిలు,21ఫ్లైఓవర్‌లు,85అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# ఐఎస్‌డబ్ల్యూ సిబ్బందికి యూనిఫాం అలవెన్స్ పెంపు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ నిఘా విభాగంలో అంతర్భాగమైన ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ రూ.11 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పోలీసు శాఖలో గ్రేహౌండ్స్, అక్టోపస్ విభాగాలకు ఇప్పటికే రూ.11వేలు అందుతుండగా ఐఎస్‌డబ్ల్యూ(వీఐపీల రక్షణ) సిబ్బందికి ప్రభుత్వం 8,750 మాత్రమే చెల్లిస్తోంది. నిఘా విభాగాధిపతి ప్రతిపాదనతో అలవెన్సు పెంచుతూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులిచ్చారు.

# 15న సిఎం చంద్రబాబుతో సినీ ప్రముఖుల భేటీ

## డిసిఎం పవన్ కూడా పాల్గొనే అవకాశం

**విజయవాడ.జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈనెల 15వ తేదీన అగ్ర నటులు, నిర్మాతలు, సినీ ప్రముఖులు భేటీ కానున్నారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో సాయంత్రం నాలుగు గంటలకు ఈ భేటీ జరగనుంది. ఇందుకు సంబంధించి, ప్రదేశంతోపాటు అపాయింట్‌మెంట్ ఖరారైంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ భేటీలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. అయితే ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమా చిత్రీకరణ జరుగుతున్నందున పవన్ కల్యాణ్ హాజరుపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. తెలుగు సినీరంగంలోని అగ్రనటులతోపాటు ఇతర ముఖ్యులకు కూడా సీఎం చంద్రబాబు నాయుడు అపాయింట్‌మెంట్‌కు చెందిన సమాచారం చేరింది. సినీరంగ ప్రముఖులు అంతా ఈనెల 15వ తేదీన కలిసి రావాలని, వారికి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి మార్కెట్ ఉంది, ఉంటుందని, అందరి సహకారం తీసుకుని సినీ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందిస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గతనెల 24వ తేదీన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినీపరిశ్రమ వ్యవహరిస్తోన్న తీరుపై ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని, అయినప్పటికీ తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని తెలుగు చలనచిత్ర మండలి, ఇతర ముఖ్యులు కనీసం ఒక్కసారి కూడా ఎందుకు మర్యాదపూర్వకంగా కలవలేకపోయారని ప్రశ్నించారు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రావడం లేదని, అంతా కలసి రావాలని గతంలో తాను సూచించినా వారెవరి నుంచీ సానుకూల స్పందన లేకపోవడం సరికాదని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తెలుగు సినిమా రంగంలోని అగ్ర నటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఇబ్బందులకు గురిచేసిందే మరచిపోయినట్లున్నాయనే భావనను పవన్ కల్యాణ్ వ్యక్తం చేశారు.

# మహిళలను చులకనగా మాట్లాడే వారిని పార్టీల నుండి బహిష్కరించాలి

**- భారత జాతీయ మహిళా సమాఖ్య నేత దుర్గాభవాని**

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల గురించి చులకనగా,అసభ్యంగా మాట్లాడే వారిని పార్టీల నుండి బహిష్కరించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని డిమాండ్ చేశారు. రాజకీయంశాల్లో ఉద్దేశపూర్వకంగా మహిళలపై అనుచిత విమర్శలు చేయడం సరికాదన్నారు. అమరావతి మహిళలపై ఓ ఛానల్‌లో జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఓ మ్యాగజైన్ ఎడిటర్ వీవీఆర్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ విజయవాడ ప్రెస్ క్లబ్‌లో వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజధాని మహిళలను కించపర్చడం దారుణమన్నారు. వైకాంగ్రెస్‌పార్టీలో కీలక స్థానంలో ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి అసభ్యంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు,వారి వారి మహిళా సంఘాల ద్వారా ఇలాంటి అంశాలపై సమగ్ర చర్చలు జరపాలని కోరారు. స్త్రీలను ఇటువంటి విమర్శలు వారి మనోభావాలతో ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలపై అసభ్య వ్యాఖ్యానాలు ఏంటన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ...సమాచార ప్రసార మాధ్యమాల్లో ప్రత్యర్థులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు,ప్రతినిధులు శ్రీదేవి, కె.వసుంధర, పి.సుహాసిని, పంచదార్ల దుర్గాంబ, పి.దివ్యలక్ష్మి, నార్ల మాలతి, ధనలక్ష్మి, అరుణ్‌కుమార్, గోళ్ళ నారాయణరావు, ఎ.మల్యాద్రి, షరీఫా, ఓర్సు భారతి పాల్గొన్నారు.

# ఆర్టీజీఎస్ కేంద్రాన్ని సందర్శించిన ఇథియోఫియా ప్రతినిధి బృందం

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ను ఇథియోఫియా దేశానికి చెందిన ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ఇథియోఫియా దేశ డిజిటల్ అగ్రికల్చర్ అండ్ ఫైనాన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ గిరుమ్ కెటెమా టెక్లెమారియం నేతృత్వంలో 10 మంది ప్రతినిధుల బృందం అమరావతిలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఈ బృందం ఆర్టీజీఎస్‌ను సందర్శించింది. ఈ బృందానికి ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి స్వాగతం పలికారు. ఆర్టీజీఎస్ పనితీరు గురించి ఆమె ఈ బృందానికి వివరించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సాంకేతిక వారధిలా ఆర్టీజీఎస్ పనిచేస్తున్న తీరు గురించి తెలిపారు. విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న ఆలోచనల నుంచి ఆర్టీజీఎస్ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. ఇలాంటి సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న మొట్టమొదటి రాష్ట్రంలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల డేటాను అనుసంధానిస్తూ ఒక పెద్ద డేటాలేక్‌ను రూపొందిస్తున్నామని, దీని ద్వారా పాలన మరింత సరళీతరం చేయడానికి వీలవుతుందన్నారు. ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి మొబైల్ ఫోన్లోనే ప్రజలకు అన్ని సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మన మిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం 455 రకాల సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు వెయ్యికి పైగా సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించాలన్నదే లక్ష్యమని చెప్పారు. ప్రజలకు వాతావారణ మార్పుల గురించి ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో అందించి వారిని అప్రమత్తం చేయడానికి వీలుగా అవేర్ హబ్ ఏర్పాటు చేశామన్నారు. ఇస్రో సహకారంతో వాతావరణాన్ని ఆర్టీజీఎస్ నిరంతరం పర్యవేక్షిస్తుంటుందని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి ప్రజలకు సత్వరం మెరుగైన సేవలందించడానికి వీలుగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఆర్టీజీఎస్‌లో ప్రత్యేకించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించడానికి కావాల్సిన సాంకేతిక సహకారాన్ని ఆయా ప్రభుత్వ శాఖలకు ఆర్టీజీఎస్ అందిస్తోందన్నారు. ఇథియోఫియా ప్రతినిధి బృంద సభ్యులు పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# జెన్‌కో పై పెరుగుతున్న బకాయిల భారం, రుణాల రీస్ట్రక్చరింగ్ దిశలో సంస్థ

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** జెన్‌కో పై బకాయిల భారం పెరుగుతున్న నేపథ్యంలో జెన్‌కో రుణాల రీస్ట్రక్చరింగ్‌కు సన్నద్ధమవు తుంది : థర్మల్ యూనిట్ల నిర్మాణానికి పీఎఫ్‌సీ,ఆర్ఈసీల నుంచి జెన్‌కో రుణాలు తీసుకుంది. ప్లాంటు జీవితకాలం సుమారు 15 ఏళ్ళుగా పరిగణించి ఆ సంస్థలు రుణాన్నిచ్చాయి. దీనివల్ల ప్రతి నెలా చెల్లించే వాయిదాల మొత్తం భారంగా మారింది. వాస్తవంగా ప్లాంట్ల జీవితకాలం 30 నుండి 40 ఏళ్ళ వరకు ఉంటోంది. ఏపీ జెన్‌కో...ఉత్పత్తి చేసిన థర్మల్ విద్యుత్తుకు ప్రతినెలా డిస్కంలు సుమారు రూ.1400 కోట్ల మేర చెల్లిస్తున్నాయి. ఆ మొత్తంలో సంస్థ తీసుకున్న రుణాలపై నెల వాయిదాలు,సిబ్బంది జీతాలకే సుమారు రూ.1300 కోట్లు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. మిగిలిన రూ.100 కోట్లు ఇతర అవసరాలకు వినియోగిస్తోంది. ఈ లెక్కన ప్రతి నెలా బొగ్గు సరఫరా చేసే సంస్థలకు పైసా చెల్లించే పరిస్థితి లేదు. జెన్‌కో థర్మల్ యూనిట్ల నిర్వహణ కోసం ఒడిశా లోని మహానది కోల్ ఫీల్డ్స్,సింగరేణి,కోల్‌కతా లోని ఈస్ట్రన్ కోల్ ఫీల్డ్‌ల నుండి సుమారు రూ.500 కోట్ల విలువైన బొగ్గును సంస్థ ప్రతి నెలా తీసుకుంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే బొగ్గు సరఫరా సంస్థలకు సుమారు రూ.1800 కోట్ల మేర జెన్‌కో బకాయిలు పెట్టింది. మహానదికి రూ.వెయ్యి కోట్లు,సింగరేణికి బిల్ డిస్కౌంట్ కింద రూ.600 కోట్లు,ఈస్ట్రన్ కోల్ ఫీల్డ్స్‌కు రూ.200 కోట్లు చెల్లించాలి. దీంతో పాటు వాషరీస్,బొగ్గురవాణా కాంట్రాక్టర్లకు మరో రూ.1200 కోట్లు బకాయిలున్నాయి. విజయవాడ వీటీపీఎస్ లోని మొదటి యూనిట్ సుమారు 40 ఏళ్ళుగా ఉత్పత్తిలో ఉంది. ఇదే విషయాన్ని రుణ మంజూరు సంస్థలకు వివరించి...అందుకనుగుణంగా రుణాన్ని రీస్ట్రక్చరింగ్ చేసే త్రపిపాదనపై అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. యూనిట్ జీవితకాలాన్ని 30 ఏళ్ళుగా పరిగణించేందుకు రుణ మంజూరు సంస్థలు అంగీకరించిప అవకాశం ఉందని సమాచారం. దీనివల్ల రుణ చెల్లింపు వ్యవధి పెరిగి...ప్రస్తుతం చెల్లించే నెల వాయిదా మొత్తంలో కనీసం 50 శాతం తగ్గే అవకాశం ఉంది.

# తిరుమల సమాచారం

## యోగాతో శారీరక అలసట ఉండదు

**- తిరుమలలో యోగాసనాల్లో పోలీసులు**



**తిరుమల,జూన్ 12ప్రభాత వార్తప్రతి నిధి:** యోగాతో పోలీసులకు శారీరక అలసట ఉండదని, మనస్సు ఏకాగ్రత కలుగుతుందని తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ తెలిపారు. ప్రతిరోజూ యోగాతో పోలీసులు ప్రశాంతంగా విధులు నిర్వహించగల రన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం తిరుమల ట్రాఫిక్, క్రైమ్ పోలీసులు ఎస్వీ హైస్కూల్‌లో యోగా ఆసనాలు చేశారు. ఉదయం 6గటంల నుండి 7గంటల వరకు ఈ ఆసనాలు చేసి, ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచారు.

## సంక్షేమం, అభివృద్ధి దిశగా సిఎం పాలన

**- ఆగస్ట్ 15నుండి మహిళలకు ఉచిత బస్సుప్రయాణం :మంత్రి మండిపల్లి**



**తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడాదికాలంలో ఆంధ్రప్రదేశ్‌ను సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులువేయించి ,ఆ దిశగా కృషి చేస్తున్నారని రాష్ట్రరవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సరిగ్గా ఏడాదిక్రిందట ఇదేరోజు సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేశారన్నారు. ఏడాదిలో సూపర్‌సిక్స్ పథకాలు అమలుచేయడం ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. గురువారం రాష్ట్రంలో తెరచుకున్న పాఠశాలలు,కళాశాలల విద్యార్థుల తల్లులకు సంతోషకరమైన విషయంగా ఈ రోజు ఉదయం తల్లికివందనం నిధులు మంజూరుచేశారన్నారు. ఇంకా రైతన్నలకు నిధులు జమచేసి ఆదుకుంటామన్నారు. ఇదే స్ఫూర్తితో ఆగస్ట్ 15నుండి మహిళలకు ఉచిత బస్సుప్రయాణం అమలుచేస్తామని మంత్రి ప్రకటించారు. రానున్న నాలుగేళ్ళలో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా పూర్తిగా అభివృద్ధి చెందడానికి కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరానన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. గురువారం ఉదయం ఎంతో ముఖ్యమైన రోజుగా ఏడాదిపాలక పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుమలేశుని దర్శించుకున్నట్లు తెలిపారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానంలో విద్య, వైద్యరంగాలకు ఇతోధిక సేవలందించేందుకు విరాళాలు సేకరిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఉన్న ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు కూడా దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. గురువారం ఉదయం తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పోతిరెడ్డి లోకేశ్ ఎస్వీ ప్రాణదానట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు విరాళాన్ని అందించారు. తిరుమలలోని అదనపు ఇఒ కార్యాలయంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి డిడిని అందజేశారు.

## తిరుమల ఘాట్‌రోడ్ల మరమ్మతులు షురూ!

**వాహనాలను అప్రమత్తంగా నడపాలని టిటిడి విజ్ఞప్తి**



**తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల-తిరుపతి, తిరుపతి-తిరుమలకు రాకపోకలుసాగించే మొదటి, రెండో ఘాట్‌రోడ్లను పూర్తిస్థాయిలో వాహనాల ప్రయాణానికి పటిష్టం చేయడంలో భాగంగా తారురోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ పనులు ఇటీవల మొదలయ్యాయి. పనులు జరుగుతుండటంతో వాహనదారులు మరింత అప్రమత్తంగా వాహనాలను నడపాలని టిటిడి ఇంజనీరింగ్ విభాగం విజ్ఞప్తి చేసింది. సాధారణంగా తిరుమల ఘాట్‌రోడ్లను ప్రతి రెండేళ్ళకోసారి మరమ్మతులు చేయడం, అవసరమైతే పూర్తిగా బిటి తారురోడ్డునిర్మాణం పనులు చేపడుతుంది. ఈ పనులు తిరుమలకు వచ్చే భక్తుల వేసవిరద్దీ తగ్గిన సమయంలోగానీ, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ముందుగానీ చేపట్టడం పరిపాటి. ప్రస్తుతం ఘాట్‌రోడ్లకు ఇరువైపులా రక్షణగోడలు నిర్మాణ పనులు చేపట్టడం, అక్కడక్కడా ఇప్పటికే ఘాట్‌రోడ్లు పాక్షికంగా దెబ్బతినడం జరిగింది. వేకువజామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు దీంతో రోజువారీగా తిరుమలకు వస్తున్న యాత్రికుల వాహనాలు ఎక్కువయ్యాయి. యాత్రికుల సురక్షిత ప్రయాణానికి ఘాట్‌రోడ్లను పటిష్టంగా నిర్మించాలని భావించారు. ఇందుకోసం ఇటీవలే కాంట్రాక్టు పనులకు పాలకమండలి అనుమతించింది. ప్రస్తుతం గత రెండురోజులుగా 18కిలోమీటర్లు వరకు ఉన్న మొదటి,రెండో ఘాట్‌రోడ్లపై బిటిరోడ్ల నిర్మాణపనులు జరుగుతుండటంతో శ్రీవారి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు. యాత్రికులకు ఇబ్బంది లేకుండా, ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఘాట్‌రోడ్లను మూసివేయకుండా నిర్ధేశించిన సమయంలో మరమ్మతు పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టిరు. భక్తులు తమ తిరుమల ప్రయాణాన్ని ప్రణాళికాబద్ధంగా మార్చుకుని గంటముందే ప్రారంభించాలని టిటిడి తెలిపింది. మరమ్మతుల కారణంగా వాహనాల ప్రయాణానికి అక్కడక్కడా నెమ్మదిగా ఆగి ఆ తరువాత ప్రయాణించాల్సి వస్తోంది. ఈ విషయంతో భక్తులు మరింత సులభంగా, సౌకర్యంగా ప్రయాణించేందుకు ఈ మరమ్మతులు పనులు చేపట్టింది. దేశంలోని నలు మూలల నుండి విదేశాల నుండి తిరుమలకు చేరుకునే రేణిగుంట విమానాశ్రయం, తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండు ప్రాంతాలనుండి విచ్చేసే వాహనదారులు తమ ప్రయాణం గంటముందుగానే చేసుకోవాలని టిటిడి సూచించింది. ఘాట్‌రోడ్లు మరమ్మతు పనులు చేయడానికి ప్రతి విభాగంఅప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అత్యవసర సేవలకు టిటిడి టోల్‌ఫ్రీనంబర్ 155257కు సంప్రదించాలని టిటిడి అధికారులు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో ప్రజావంచన పాలన సాగుతోంది: పిసిసి ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

**తిరుపతి,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రంలో,రాష్ట్రంలో ప్రజావంచన పాలన సాగుతోందని పిసిసి ప్రధాన కార్యదర్శి ఈదసుధాకర్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పేరుతో కూటమి అధికారంలోకి వచ్చి ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందన్నారు. తిరుపతి నగరకాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేరచిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం ఉదయం మీడియాతో మాట్లాడారు. తిరుపతినగరంలో ప్రజా సమస్యలు పెరిగిపోయాయని ,సమస్యలను ఎవరికీ చెప్పుకోవాలో అర్థకాక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.

ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పోరాటాలు చేసే కాంగ్రెస్‌పార్టీని ప్రజలు ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పిసిసి అధినేత్రి వైఎస్ షర్మిలారెడ్డి ప్రజల కోసం పనిచేస్తున్నారన్నారు.

వార్త

నిరాశానిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం కొనసాగిస్తే మనం ఏ పనైనా సాధించగలం.

-షేక్‌స్పియర్

# పారని పాచిక!

ఓటమి పరంపరలో ముచ్చటగా మూడోసారి భారత్‌ను ఎదురించి గెలవలేమని అర్థమయ్యాక పాకిస్థాన్ మరో పిచ్చి ప్రయత్నానికి తెర తీసింది. విషయం ఊహాజనితమనదే అయిన చైనాతో జతకట్టి వ్యూహాత్మకంగా ముందుకు కదిలేందుకు అడుగులేస్తోంది. సాధ్యాసాధ్యాల మాటలాఉన్నా ప్రయత్నమైతే చెయ్యాలిగా! అనే ధోరణిలో ఓ ఊహాజనిత ప్రణాళికకు రూపకల్పన చేసిందనిపిస్తుంది. సింధు ఒప్పందం రద్దుచేస్తూ భారత్ నిర్ణయించాక సింధునీటి హక్కులపై అంతర్జాతీయ కోర్టులో తేల్చుకుంటామని ఇస్లాంబాద్ నుంచి సవాల్ ఎదురైంది. సరికదా! ఆ విషయంలో ఒక అడుగు ముందు కదలలేదు. పాకిస్థాన్ మరో పక్కదారి వెతుక్కుంది. చైనా బాసటగా భారత్‌ను ఎదుర్కొనే ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగానే నిజానికి ఈ వ్యూహంలో చైనా అంగీకరిస్తేనే పాక్ పాచిక పారుతుంది. చైనా ఈ విషయంలో భారత్‌తో తెగబడేందుకు సిద్ధంగా లేదు. మిత్రదేశానికి కష్టనష్టాలు వాటిల్లితే సహాయంచేయాలనే ఆలోచన మంచిదే. కానీ ఇతరుల ప్రయోజనాల కోసం తమ ప్రయోజనాలను తాకట్టుపెడితే ఏమి జరుగుతుందో చైనాకు తెలియనిది కాదు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్కు సింధు జలాలనుసరఫరా కాకుండా నిలిపి వేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంతో పాక్ అల్లాడుతోంది. అనలే నీటికొరతతో అల్లాడిపోతున్న పాకిస్థాన్కు భారత్ నిర్ణయంతో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. నీటి సరఫరా నిలిపి వేయడాన్ని పాకిస్థాన్ తీవ్రంగా తప్పుబట్టింది. నీటిని నిలిపివేయటం యుద్ధానికి కాలు దువ్వటమే అంటూ మండిపడింది. మొత్తానికి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించింది. అయితే, గత కొద్దిరోజుల నుంచి నీటి సరఫరా లేకపోవటంతో పాకిస్థాన్లోని చాలా ప్రాంతాల్లో కరువు పరిస్థితి ఏర్పడింది. తాగడానికి కూడా నీళ్ల లేకుండా అక్కడి జనం అల్లాడుతున్నారు. సింధు జలాల నిలిపివేత నిర్ణయం పాక్‌లోతీవ్ర నీటి సంక్షోభానికి ఎదుర్కొంటుందని వార్తలు వస్తున్నాయి. సింధూ నదీలో నీరు ప్రవహించకపోతే పాక్ ప్రత్యర్థుల రక్తం పారుతుందంటూ పాక్ విపక్ష నేతబిలావల్ నోరు పారేసుకున్నారు. సింధూ నాగరికత పరిరక్షకులం తామే అంటూ భారత్కు హెచ్చరికలు జారీ చేశారు. సింధూనది మాదే. ఎప్పటికీ మాదే. నదిలో నీరైనా పారుతుంది లేదా వారి రక్తమైనా పారుతుంది. వేల ఏళ్ల నాటి సింధూ నాగరికతకు తాము వారసులమని మోదీ అంటున్నా, మేమే ఈ సంస్కృతీ పరిరక్షణకు వారసులమని ప్రకటించుకున్నారు. కానీ ఈ సంస్కృతికి పరిరక్షకులము మేమే. ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని అంటూ ఓర్యాలీలో ప్రగల్భాలు పలికారు. భారత్ ఉద్రిక్తతలు మరింత ముదిరేలా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారు. అంతకు మునుపు, పాక్ రక్షణ శాఖ మంత్రి కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్ మధ్య సింధూ, దాని ఉపనదుల జలాల పంపిణీ కోసం 1960లో ఈ ఒప్పందం కుదిరింది. సింధు జలాల ఒప్పందం రద్దుని యుద్ధ చర్యగా పాకిస్థాన్ అభివర్ణించింది. పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత పాకిస్థాన్ లోలోపల భయపడుతూనే, భారత ప్రతీకారాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది. భారతదేశంతో సరాసరి ఎదుర్కోలేక సమయం వచ్చినప్పుడల్లా, పాకిస్థాన్ తరచుగా తన మిత్రదేశాల మద్దతు కోరుతూ లేదా బెదిరింపుల ముసుగు వెనుక దాక్కుంటూ కనిపిస్తుంది. ఒకరిపై ఒకరు చర్చలు జరిపే నైతిక హక్కు లేకపోవడంతో, అది తరచుగా టర్కీ లేదా చైనా వంటి దేశాలపై ఆధారపడుతోంది. మరోసారి, ఇస్లామాబాద్ అదే వ్యూహాన్ని ఆశ్రయించింది. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సలహాదారు రాణా ఎహ్సాన్ అఫ్జల్ ఇటీవల భారతదేశం సింధు జలాలను అడ్డుకుంటే, బ్రహ్మపుత్ర నది విషయంలో కూడా చైనా అదే విధంగా ప్రతీకారం తీర్చుకోగలదని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు ప్రపంచ యుద్ధానికిదారి తీస్తాయంటూ పరోక్షంగా ఆయన అన్నారు. దీనిపై అస్సాం ముఖ్య మంత్రి హిమంత బిస్వాశర్మ గట్టిగా స్పందిస్తూ, పాక్ వాదనను తిప్పికొట్టారు, బ్రహ్మపుత్ర నీటి ప్రవాహంపై చైనా నియంత్రణ వాస్తవ పరిమితులను బహిర్గతం చేశారు. ముఖ్యంగా, చైనా అలాంటి ప్రకటన చేయడానికి సాహసించలేదు. భారత్‌లోకి రాకుండా బ్రహ్మపుత్ర ప్రవాహాన్ని చైనా ఏమాత్రం ఆపలేదు. బ్రహ్మపుత్ర నదీ పరీవా హక ప్రాంతంలో నీటి ప్రవాహంలో 20 శాతం నుంచి30 శాతం మాత్రమే చైనా టిబెటన్ ప్రాంతం నుండివస్తుంది. ఈశాన్య భారతమే బ్రహ్మపుత్రను బలోపేతం చేస్తుంది. అందుకే ఇక్కడ ప్రవాహవడి వేగంగా ఉంటుంది. దాదాపు చైనాకు సమానం, అయినప్పటికీ నదిలో 6.7శాతం మాత్రమే దానిభూభాగం గుండా ప్రవహిస్తుంది. నది భౌగోళిక విస్తీర్ణంలో భారత దేశం 34.2 శాతం వాటా కలిగి ఉన్నా, దాని నీటిలో 39 శాతం ఆధిపత్యాన్ని కలిగిఉంది. మన దేశంలోకి ప్రవేశించే ముందు నదీ ప్రవాహం కేవలం 14శాతం మాత్రమే. అత్యధిక వర్షపాతంతో ఈశాన్యాన్ని దాటిన తర్వాత ఇది 86శాతానికి పెరుగుతుంది. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది ప్రవాహాన్ని నిరోధించడం ద్వారా చైనా ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉందని హెచ్చరించిన తర్వాత పలు విశ్లేషణలు వెలువడ్డాయి. అన్నిటి సారాంశం ఒకటే. ఏ పరిస్థితుల్లోనూ బ్రహ్మపుత్ర నీటిని చైనా నిరోధింప జాలదు. దౌత్య పరంగా సానుకూల వాతావరణంలో పరిష్కరించుకోవలసిన వ్యవహారాలను బెదిరింపుల ద్వారానో, ఇతరత్రా పొరుగు దేశాలను రెచ్చగొట్టడం ద్వారానో ఫలితం సాధించాలనుకునే వారికి పర్యవసానం ఎలా ఉంటుందో రాబోయే రోజులే సమాధానమిస్తాయి.

ఒక ఎదురుదెబ్బ తగిలినంత మాత్రాన సాధించదలచుకున్న ప్రయోజనం నుంచి వెనుకంజ వేయవద్దు.




అబ్రహాంలింకన్

చాతుర్యం వల్ల కష్టాలను అధిగమించవచ్చు. సోమరితనం కష్టాలను కొని తెస్తుంది.



ఐ.జాన్సన్

## ప్రజావాక్కు



### ఇప్పటికైనా రెగ్యులర్ రైళ్లను పెంచండి

సామాన్య ప్రయాణికులకు అందుబాటులేని టికెట్స్ ధరలతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, బుల్లెట్ రైళ్ల పేరుతో హడావుడి చేయడం మినహా సాధారణ ప్రయాణికుల రద్దీకితగినట్టుగా రెగ్యులర్ రైళ్లను నడపకపోవడం, కొన్ని పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడం పలువురి ప్రాణాలను బలిగొంటోంది. దీనికి ఉదాహరణగా ముంబైలోని ముంబ్రా సమీపంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్ కు వెళుతున్న కిక్కిరిసిన రైలు నుంచి జారిపడి నలుగురు ప్రయాణికులు ప్రాణాలను కోల్పోగా తొమ్మిది మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ముందు ముందు జరగకుండా రైల్వే శాఖ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### సన్న బియ్యంతో బడి భోజనం

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడనున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కిందవిద్యార్థులకు పాఠశాలల్లోనే మధ్యాహ్నభోజనం అందిస్తున్నారు. ఈ పథకం కింద సరఫరా చేసే బియ్యంతో వండిన అన్నం ముద్దగా ఉండడంతో కొందరు ఇళ్లనుంచి తెచ్చుకుని తినేవారు. మరికొందరుతిన్నామంటే తిన్నామని చిరుతిండ్లతో కడుపు నింపుకునేవారు. ఏపిప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం సరఫరా చేస్తుంది. దీంతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య భారీగా పెరగనుంది.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

### ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

ఆంధ్రప్రదేశ్లో స్కూళ్లు ప్రారంభంఅయ్యాయి. ఈ సందర్భంగా ప్రతిఒక్క విద్యార్థి కూడా కొత్త విద్యాసంవత్సరంలో వేళుతున్నారు. కనుక ఒక మొక్క నాటినట్లయితే వాళ్ల విద్యా సంస్థలతో పాటు ఆ మొక్క కూడా పెరుగుతుంది. సంవత్సరంలోఆ మొక్క ఎంత పెరిగింది, ఎలా కాపాడుకోవాలని విద్యార్థి కూడా తాపత్రయపడి ఆ మొక్కను పెంచుతాడు. కనుక ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలి.

- కె.రాఘవేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్

### ఉచిత వైద్యం కల్పించాలి

కేంద్రప్రభుత్వం సుమారు ఏడాది క్రితం ఘనంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ కార్డులు తెలంగాణా రాష్ట్రంలో అయితే ఇంతవరకు జారీ కాలేదు. మీ సేవ వారికి కూడా ఏ విధమైన సమాచారం లేదు. ఆధార్ కార్డు ద్వారా కె.వై.సి. తీసుకుంటే హాస్పిటల్ వాళ్లు దానిని వైద్యానికి ఒప్పుకుంటారని అంటున్నారు. ఇంతవరకు ఆపత్రాలను చూపించివైద్యం చేయించుకున్న వాళ్లెవరు తారస పడలేదు. మరొక విషయ మేమంటే ఈఆరోగ్యపథకం ఎమర్జెన్సీ లో హాస్పిటల్‌లో చేర్చుకున్న వారికే వర్తింస్తుందట. అవుట్ పేషంట్లకు ఈ పథకం పనికి రాదట. 70 సంవత్సరాలు నిండిన కోట్ల మందిలో ఎంతమందికి ఈ పథకం సహాయ పడుతుంది?ఆపైన ఈ 5లక్షల పథకం ఏడాదికి భార్యాభర్తలకు కలిపి ఉంటుందట. కేవలం ఆధార్ కార్డు ద్వారా 70 ఏళ్లు దాటిన వారందరికి ఏ అడ్డంకులు లేకుండా సూచించిన వైద్యశాలల్లో ఉచిత వైద్యం కల్పిస్తే ఏ గందరగోళం ఉండదు కదా! ఏమిటో ప్రస్తుత పథకం పూర్తిగా ఎవరికి అర్థం కావడం లేదు. ఉచిత వైద్యం అందిరికి లభించేలా ఉండాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### నైతిక విద్యను బోధించాలి

నేడు విద్యారంగం వేగంగా మారుతూ విద్యార్థులను సాంకేతికంగా, అకడమిక్‌గా ముందుకు తీసుకెళ్తున్నప్పటికీ, మానవీయవిలువల బోధనలో పెద్దఎత్తున లోటు కనిపిస్తోంది. మంచి మార్కులు, ప్రవేశ పరీక్షల ఫలితాలు, ఉద్యోగ అవకాశాలు వంటి వాటికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల, విద్యార్థుల్లో నైతికత, సమాజంపట్ల బాధ్యత, మంచిప్రవర్తన వంటి గుణాలు నెమ్మదిగా నశిస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయం. చదువుతోపాటు విద్యార్థులు మంచితనం, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత వంటి నైతిక విలువలతో పెరుగుతుంటేనే సమాజానికి వారు ఆస్తిగా మారగలుగుతారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పరిశోధన సీట్లు పెంచాలి

తెలంగాణ రాష్ట్రంలోఉన్న వివిధ యూనివర్సిటీలలో పరిశోధన చేయడానికిగాను మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ ( ఎంఫిల్ )డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పిహెచ్‌డి)పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ (పిడిఎఫ్) ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యూనివర్సిటీ గ్రాంట్‌కమిషన్(యుజిసి)పరిశోధనలను పెంచడానికి యూనివర్సిటీలను ప్రోత్సహించాలి. సీట్ల సంఖ్యపెంచాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మన వివి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డిజిటల్ మోసాలపై నియంత్రణ ఏదీ?

**కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీ వంటి రంగాలలో, మోసపూరిత పద్ధతులకు కొత్త మార్గాలను సృష్టిస్తాయి. దీనికి అనుగుణంగా నిబంధనలను నిరంతరం మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ లావాదేవీల సంక్లిష్టతలు నియంత్రణకు అదనపు కష్టాన్ని కలిగిస్తాయి. చివరగా నిబంధనలు ఉన్నప్పటికీ, వినియోగదారులలో విస్తృత అవగాహన పెంపొందించడం చాలా ముఖ్యం. తమ హక్కుల గురించి, మోసపూరిత పద్ధతులను ఎలా గుర్తించాలో తెలుసుకోవడం ద్వారా ప్రజలు సాధికారత పొందుతారు. వినియోగదారులు ఆన్‌లైన్ క్లెయిమ్‌లను విమర్శనాత్మకంగా అంచనా వేయడం, సమీక్షలను నిశితంగా పరిశీలించడం, తొందరపాటు నిర్ణయాలకు ఒత్తిడి చేసే పద్ధతుల పట్ల అప్రమత్తంగా ఉండటం నేర్చుకోవాలి.**

డి జె మోహన రావు

అరచేతిలో ఇమిడిపోయిన డిజిటల్ ప్రపంచం అపారమైన సౌలభ్యాన్ని అందిస్తుంది. ఇంటిపట్టునే కూర్చుని, వర్చువల్ దుకాణాలను పలకరించవచ్చు, ధరలు పోల్చవచ్చు, వస్తువులు క్షణాల్లో గుమ్మం ముందుకు వచ్చి వాలిపోతాయి. ఈకామర్స్ మన జీవితాలను ఊహించనంతగా మార్చేసింది. అయితే, ఈ తక్షణ సంతృప్తి, అనంతమైన ఎంపికల వెనుక ఒక క్లిష్టమైన కథనం దాగి ఉంది. ఇక్కడ నిజమైన విలువకు, మోసపూరిత వంచనకు మధ్య తేడా అస్పష్టంగా మారుతుంది. ఈ సవాలును దృష్టిలో ఉంచుకునే సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు మూడు నెలల్లోపు తమ ప్రకటనలను, వెబ్‌సైట్ డిజైన్‌లను స్వయంగా తనిఖీ చేసుకుని, అందులో ఉన్న మోసపూరిత 'డార్క్ ప్యాటర్న్‌లను' తొలగించాలని స్పష్టంగా సూచించింది. మన డిజిటల్ కొనుగోలు అనుభవంలో పారదర్శకత, విశ్వసనీయత ఎంత అవసరమో ఈ చర్య కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. మన తెరలపై మెరిసే వ్యక్తిగతీకరించిన ప్రకటనలు మొదట చూసినప్పుడు ఏదో మాయలా అనిపిస్తాయి. 'నేను ఇప్పుడే కొత్త గ్యాడ్జెట్ గురించి ఆలోచిస్తున్నానని వీళ్లకెలా తెలిసింది?' అనిపిస్తుంది. ఈ కచ్చితత్వం వెనుక, మన బ్రౌజింగ్ అలవాట్లను, కొనుగోళ్లను, కనీసం మనం వెతికిన పదాలను కూడా నిశితంగా విశ్లేషించే అధునాతన అల్గారిథమ్‌ల శ్రమదాగి ఉంది. ఈ వ్యక్తిగతీకరణ నిజంగా పారదర్శకంగా, నైతికంగా జరిగినప్పుడు, ఇది మన కొనుగోలు అనుభవాన్ని మెరుగుపరుస్తుంది, మనకు కావాల్సిన వస్తువులను మన ముందుకు తీసుకువచ్చి, సమయాన్ని ఆదా చేస్తుంది. ఇది డిజిటల్ యుగం అందించిన నిజమైన సౌలభ్యం. అంతేకాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ధరలను పోల్చడం సులభతరం చేస్తాయి. ఆకర్షణీయమైన ఆఫర్‌లు, డిస్కౌంట్‌లు అందిస్తాయి. ఇవి నిజంగా వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటాయి. అయితే, ఈ అల్గారిథమ్‌ల నృత్యం ఒక్కోసారి మోసపూరిత వ్యూహాల లోతులకు నెట్టివేయగలదు. ఉదాహరణకు, మనం చూసే 'పరిమిత కాల ఆఫర్‌లు' ఎప్పటికీ ముగియవు, లేదా ఐదు నక్షత్రాల రేటింగ్‌లతో మెరిసిపోయే వస్తువులు సహజత్వం లేకుండా కనిపిస్తాయి. ఇక్కడే డిజిటల్ దుకాణ వీధి తన మోసపూరిత కోణాన్ని బయటపెడుతుంది. నిపుణులు 'డార్క్ ప్యాటర్న్‌లు' అని పిలిచే సూక్ష్మమైన, తరచుగా నమ్మశక్యం కాని డిజైన్ ఎంపికలను ఉపయోగించి మనకు తెలియకుండానే కొన్ని చర్యలు తీసుకునేలా ప్రోత్సహిస్తాయి. డిజిటల్ ప్రపంచం ఎంత గొప్పదైనప్పటికీ, అది అబద్ధాలకు, మోసపూరిత పద్ధతులకు నిలయం. ఇవి తరచుగా 'డార్క్ ప్యాటర్న్‌లు' లేదా తప్పుదోవ పట్టించే ప్రకటనల రూపంలో వస్తుంటాయి. ఉదాహరణకు, మీరు చూడకుండానే కార్ట్‌లో అదనపు వస్తువులు చేర్చడం (బాస్కెట్ స్నీకింగ్), లేదా మీ నిర్ణయాన్ని మార్చడానికి అపరాధ భావంతో కూడినభాషను ఉపయోగించడం (కన్ఫర్మ్‌షేమింగ్) వంటివి సర్వసాధారణం. ఉత్పత్తుల లక్షణాలను అతిశయోక్తి చేయడం లేదా మార్చబడిన చిత్రాలను ఉపయోగించి తప్పుదోవ పట్టించే ఉత్పత్తి క్లెయిమ్‌లు కూడా మనం తరచుగా చూస్తుంటాం. అలాగే, కృత్రిమంగా సానుకూల అభిప్రాయాలను సృష్టించి, నకిలీ సమీక్షలు, టెస్టిమోనియల్స్ ద్వారా కొనుగోలుదారులను మోసగించడం జరుగుతుంది. మరో సాధారణ పద్ధతి దాగి ఉన్న రుసుములు లేదా డ్రిప్ ప్రైసింగ్, ఇక్కడ ప్రారంభ ధర తక్కువగా చూపించి చెల్లింపు దశలో షిప్పింగ్ లేదా ప్రాసెసింగ్ ఛార్జీలు వంటి అదనపు రుసుములు జోడిస్తారు. 'చివరికి 2 వస్తువులు మాత్రమే!'



లేదా 'పరిమిత కాల ఆఫర్!' వంటి ప్రకటనలతో తప్పుడు ఆవశ్యకత లేదా కొరతను సృష్టించి వినియోగదారులను తొందరపాటు కొనుగోళ్లకు ప్రేరేపిస్తారు. సబ్‌స్క్రిప్షన్ ట్రాప్‌లు కూడా ఒక పెద్ద సమస్య. ఇక్కడ ఉచిత ట్రయల్ తర్వాత సబ్‌స్క్రిప్షన్‌లను రద్దు చేయడం కష్టం. కొన్నిసార్లు తక్కువ ధర వస్తువును ప్రకటించి అది అందుబాటులో లేదని చెప్పి ఖరీదైన ప్రత్యామ్నాయాన్ని అంటగట్టే బైట్‌అండ్‌స్విచ్ పద్ధతులు కూడా ఉన్నాయి. చివరగా డబ్బు తీసుకుని చేసే ప్రమోషన్లను నిజమైన సిఫార్సులుగా చూపించే ప్రకటించని ఎండార్స్‌మెంట్లు కూడా వినియోగదారుల నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. ఈ పెరుగుతున్న ఆందోళనలను గుర్తించి, భారత దేశంలో నియంత్రణ సంస్థలు తప్పుదోవ పట్టించే ఈ కామర్స్ ప్రకటనలను, డార్క్ ప్యాటర్న్‌లను అరికట్టడానికి తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశాయి. ఈ దిశగా అనేక చట్టాలు, మార్గదర్శకాలు అమలులో ఉన్నాయి. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్, 2019ని సిసిపిఎ రూపొందించింది. ఇది వినియోగదారుల హక్కులకు ప్రధాన రక్షకునిగా నిలుస్తుంది. సిసిపిఎ 'డార్క్ ప్యాటర్న్‌ల నివారణ నియంత్రణకు మార్గదర్శకాలు, 2023' వంటి చారిత్రాత్మక ఆదేశాలను జారీ చేసి 13 నిర్దిష్ట డార్క్ ప్యాటర్న్‌లను నిషేధించింది. ముఖ్యంగా, జూన్ 2025లో సిసిపిఎ జారీ చేసిన సలహా ప్రకారం, ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు మూడు నెలల్లోపు స్వీయఆడిట్‌లు నిర్వహించి, మోసపూరిత పద్ధతులను తొలగించాలని ఆదేశించారు. ఇది ప్లాట్‌ఫామ్‌లు తమ డిజిటల్ స్టోర్‌లను శుభ్రపరచుకోవడానికి బాధ్యత వహించేలా చేస్తుంది. సిసిపిఎ తన చర్యలను, అంచనాలను క్రమం తప్పకుండా వివరిస్తూ నివేదికలు, సలహాలు, పత్రికా ప్రకటనలను జారీ చేస్తుంది. కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఈకామర్స్) రూల్స్, 2020 ప్రత్యేకంగా ఈకామర్స్ సంస్థలు, విక్రేతలను పాలిస్తాయి. ఈ నియమాలు, ప్రకటనలు వాస్తవ ఉత్పత్తి లక్షణాలు, అందుబాటు, వినియోగానికి అనుగుణంగా ఉండాలని నిర్దేశిస్తాయి. ఉత్పత్తి ధర, వాపసు విధానాలు, ఫిర్యాదుల పరిష్కార విధానాలలో పారదర్శకతను నిర్ధారిస్తాయి. నకిలీ సమీక్షలను, తప్పుదోవ పట్టించే ప్రకటనలను స్పష్టంగా నిషేధిస్తాయి. ముఖ్యంగా, కొనుగోళ్ల కోసం వినియోగదారుల స్పష్టమైన సమ్మతిని ఇవి తప్పనిసరి చేస్తాయి. ప్రభుత్వసంస్థ కానప్పటికీ, అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కీలకమైన స్వీయ నియంత్రణ పాత్రను పోషిస్తుంది. ఇది ప్రకటనదారుల కోసం ఒక నియమావళిని అమలు చేస్తుంది. తప్పుదోవ పట్టించే ప్రకటనలపై వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరిస్తుంది. దీని మార్గదర్శకాలు తరచుగా ప్రకటనల పద్ధతులను ప్రభావితం చేస్తాయి. ఈ అన్నిటికీ మూలంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 2000 ఆన్‌లైన్ లావాదేవీలు సైబర్ సెక్యూరిటీని నియంత్రిస్తుంది. అలాగే, నూతనమైన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023చాలా కీలకమైనది. ఇది వ్యక్తిగత డేటా సేకరణ, ప్రాసెసింగ్ నిల్వను నియంత్రించే ఒక చారిత్రాత్మక చట్టం. ప్రకటనల ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను ఉపయోగించే ముందు స్పష్టమైన డేటా విధానాలు, ఖచ్చితమైన సమ్మతిని ఇది నిర్దేశిస్తుంది. ఈ పటిష్టమైన నియంత్రణలు ఉన్నప్పటికీ సవాళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. లెక్కలేనన్ని ప్లాట్‌ఫామ్‌లు, విక్రేతలతో కూడిన డిజిటల్ ప్రపంచం అపారమైన పరిధి, వేగం, నియంత్రణా సంస్థలకు అమలు ఒక నిరంతర పోరాటంగా మారుస్తుంది. సాంకేతిక పరిజ్ఞానంలో వేగవంతమైన పురోగతులు, ముఖ్యంగా కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీ వంటి రంగాలలో, మోసపూరిత పద్ధతులకు కొత్త మార్గాలను సృష్టిస్తాయి. దీనికి అనుగుణంగా నిబంధనలను నిరంతరం మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ లావాదేవీల సంక్లిష్టతలు నియంత్రణకు అదనపు కష్టాన్ని కలిగిస్తాయి. చివరగా నిబంధనలు ఉన్నప్పటికీ, వినియోగదారులలో విస్తృత అవగాహన పెంపొందించడం చాలా ముఖ్యం. తమ హక్కుల గురించి, మోసపూరిత పద్ధతులను ఎలా గుర్తించాలో తెలుసుకోవడం ద్వారా ప్రజలు సాధికారత పొందుతారు. వినియోగదారులు ఆన్‌లైన్ క్లెయిమ్‌లను విమర్శనాత్మకంగా అంచనా వేయడం, సమీక్షలను నిశితంగా పరిశీలించడం, తొందరపాటు నిర్ణయాలకు ఒత్తిడి చేసే పద్ధతుల పట్ల అప్రమత్తంగా ఉండటం నేర్చుకోవాలి. •

# భారత్, కెనడా సంబంధాలు తిరిగి చిగురించేనా?

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్

కెనడా రాజధాని ఒట్టావాలో చాలా రోజుల ఊహాగానాల తర్వాత, కెనడా ప్రధాని మార్క్ కార్నీ రాబోయే జీ7 సదస్సుకు మోదీని ఆహ్వానించారు. భారత్ ప్రపంచ సరఫరా గొలుసులో ఇతర ముఖ్యమైన భౌగోళిక రాజకీయ విషయాలలో కీలకపాత్ర పోషిస్తుందని కార్నీ చెప్పారు. ట్రూడో హయాంలో అస్తవ్యస్తంగా ఉన్న భారత్, కెనడా సంబంధాలు ఇప్పుడైనా సరైన దారిలోకి వస్తాయని అనిపిస్తోంది. అయితే, ఒట్టావా సమావేశంలో సభ్యదేశాలు నిజాలు తెలుసుకోవాలి. ఖలిస్థానీ సమూహాలు భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్న విషయం తెలిసిందే. కనీసం ఈ సందర్భంలోనైనా వాస్తవాలు గ్రహించి తగిన చర్యలు తీసుకుంటేనే ఈ సంబంధాలు పూర్తిగా సుహృద్భావంగా మారతాయి. గతంలో భారత్ ఎన్ని వివరణలు ఇచ్చినా ట్రూడో ఈ సమస్యను గుర్తించడానికి నిరాకరించాడు. దీనికి ప్రధాన కారణం అతని కూటమి భాగస్వామి. ఖలిస్థాన్ అనుకూల జగ్‌మీత్ సింగ్, హర్దీప్ సింగ్ నిజ్జర్ మరణానికి భారత ప్రభుత్వ ఏజెంట్లు కారణం అంటూ కెనడా పార్లమెంటులో ఎలాంటి ఆధారం చూపకుండా ట్రూడో చేసిన అసంబద్ధ ఆరోపణలు భారత్, కెనడా సంబంధాలను దిగజార్చాయి. అదృష్టవశాత్తూ, కార్నీ ఇప్పుడు రెండు దేశాల మధ్య సంభాషణలు తిరిగి ప్రారంభమయ్యాయని చెప్పారు. ఇది మంచి పరిణామం. కానీ, కెనడాలో ఖలిస్థానీలు రెండు ప్రధాన రాజకీయ పార్టీలపై ప్రభావం చూపుతున్నందున, భారత్ న్యాయమైన ఆందోళనలపై సునిశిత లోపించే ప్రమాదం ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి అలాగే ఆపరేషన్‌సిందూర్ తర్వాత, భారత్ ఉగ్రవాదంపై కఠినమైన వైఖరిని స్పష్టం



చేసింది. ఇది చర్చకు తావులేని విషయం. ఖలిస్థానీ సమూహాలు పాకిస్థాన్‌కు మద్దతు ఇచ్చే ఉగ్రవాద సంస్థలతో సమన్వయం చేస్తున్నాయని తగిన ఆధారాలున్నాయి. 2021లో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం, పాకిస్థాన్ నుండి నిధులు, మద్దతు, సైనిక శిక్షణ పొందే ఖలిస్థానీ కాశ్మీరీ సమూహాల సంబంధాన్ని హైలైట్ చేసింది. కాబట్టి, భారత భద్రతకు సంబంధించిన తీవ్రమైన ఆందోళనలు ఇప్పటికీ తాజాగా అలాగే ఉన్నాయి. కెనడాకు, ట్రూడో పరిపాలన వాషింగ్టన్ ఒట్టావా సంబంధాలను అస్తవ్యస్తం చేసిన నేపథ్యంలో, భారత్‌తో పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలు ఇప్పుడు ముఖ్యం. ట్రంప్ సుంకాలను ఆయుధంగా ఉపయోగించే ధోరణి కూడా ఈ సహకారానికి కారణం. కెనడా సహజ వనరుల శక్తి కేంద్రం. భారత్‌కు ఆ వనరులు అవసరం. అలాగే, ఆర్కిటిక్‌లో వనరుల కోసం వ్యూహాత్మక పోటీ జరుగుతున్న నేపథ్యంలో రెండు దేశాలు కీలకపాత్ర పోషించగలవు. జీ7 అధ్యక్ష దేశంగా, కెనడా తన స్వప్రయోజనాల కోసం మోడీని 2019 నుండి ఆహ్వానిస్తోంది. భారతీయ డయాస్పోరా కారణంగా రెండు దేశాల మధ్య ప్రజల సం బంధం ఇప్పటికే బలంగా ఉంది. ఇప్పుడు వ్యూహాత్మక సం బంధాన్ని సరిచేయడానికి సమయం ఆసన్నమైంది. భారత విద్యార్థులకు రక్షణ, ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలను కెనడా పునరుద్ధరణ చేయాలి. తిరిగి అపోహలు, అపార్థాలు తొలగి అన్ని విషయాలలోనూ పరస్పర నమ్మకం, సహకారం పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరగాలి. పూర్వం వలే ఇరు దేశాల మధ్య సంబంధాలు సజావుగా సాగేందుకు ప్రస్తుత కెనడా నూతన ప్రధాని మార్క్‌కార్నీ అన్ని విధాలా చర్యలు తీసుకోవాలి. భారత్ ఖలిస్థానీ ఉగ్రవాద చర్యలను ఎప్పుడూ క్షమించదు. ఇంకా కెనడా వారితో సంబంధాలు తెగతెంపు లు చేసుకోకపోతే భారత ప్రభుత్వ ప్రతిస్పందన కరువుగానే ఉంటుంది. •

# న్యాయవ్యవస్థపై నమ్మకం పెరగాలంటే..

భాస్కర్ యలకంటి

గత మార్చి నెలలో ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్‌యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీ స్థాయిలో కాలిపోయిన నోట్ల కట్టల ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ దృశ్యాలన్నీ ప్రముఖ టీవీఛానల్లలో ప్రసారమవ్వడమే కాకుండా అన్ని పత్రికలు పతాకశీర్షికన ఆ వార్తను ప్రచురించడంతో న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై నీలినీడలు కమ్ముకున్నాయని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక అపనమ్మకం కలిగించే ఇలాంటి సంఘటనల గురించి ప్రజలు పలు విధాలుగా చర్చించుకునేందుకు తావివ్వడంతో పాటు ఇలాంటి సంఘటనలు అన్ని వ్యవస్థల్ని అసంతృప్తికి గురిచేస్తాయని వారు వాపోతున్నారు. సగటు పౌరుని అనుమానాన్ని నివృత్తిచేయడం ద్వారా న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోంది. దానికోసం వడివడిగా అడుగులు వేస్తోంది. అందుబాటులో ఉన్న అన్నిఅస్త్రాలను సంధించి జస్టిస్ వర్మను సాగనంపడానికి సిద్ధపడుతోంది. జస్టిస్ వర్మ ఇంట్లోకి ఆ నోట్లకట్టలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అనే దానిపై విచారణ చేపట్టడానికి కోర్టులు అనుమతించలేదు. ఎఫ్ఐఆర్ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. సుప్రీంకోర్టు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనప్పటికీ సుప్రీంకోర్టే చొరవ తీసుకుని ఇన్‌హౌస్ కమిటీని వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వర్మకు కీలక సూచనలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు జస్టిస్ వర్మను ఢిల్లీ నుండి అలహాబాద్ కోర్టుకు బదిలీ చేసింది. ఆయన అలహాబాద్‌కు వస్తే బహిష్కరిస్తామని అక్కడి బార్‌కౌన్సిల్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన రావడం రిపోర్టు చేయడం జరిగిపోయినప్పటికీ కేసులు అసైన్ చేయలేదు. అలా చేయడం న్యాయవ్యవస్థపై ప్రజల మనసులలో తొలుస్తున్న అనుమానాలకు సమాధానం కాదని పలువురు న్యాయకోవిదులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే అంశంపై ఉప రాష్ట్రపతి జగదీప్ దన్ ఖడ్ కూడా రెండోసారి వ్యాఖ్యానించడం ఈ సంఘటన ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నదో అవగతం అవుతున్నది. వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచాలనే ఉద్దేశంతోనే అభిశంసన తీర్మానమనేది రాజ్యాంగ ప్రక్రియ. ఈ అభిశంసన అనేది హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు, ఆరోపణలు తలెత్తినప్పుడు వారిని తొలగించేందుకు చేపట్టే ప్రక్రియ. ఇది చట్టపరంగా పార్లమెంటుకు ఉన్న ప్రత్యేకమైన వెసులుబాటు. ఈ ప్రక్రియను జడ్జెస్‌ఎంక్వయిరీ యాక్ట్ 1968 ద్వారా చేపడతారు. లోక్‌సభలో అయితే కనీసం 100 మంది, రాజ్యసభ అయితే 50 మంది సభ్యులు ఈ తీర్మానం మీద సంతకం చేయాలి. రాజ్యసభ చైర్మన్ లేదా లోక్‌సభ స్పీకర్ చేత నియమించబడ్డ విచారణ కమిటీ



ద్వారా నివేదిక ఇవ్వబడుతుంది. ఆ నివేదిక ద్వారా న్యాయమూర్తి దోషిగా తేలితే దానిని పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టబడి మూడింట రెండో వంతు మెజారిటీతో ఆమోదించబడితే రాష్ట్రపతి సదరు న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఆ మెజారిటీ సాధించడం అధికార పక్షానికి పెద్ద కష్టమేమీకాదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. విపక్షాలపై ఆధారపడకుండానే అభిశంసన ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉన్నప్పటికీ వర్మ తీరును విపక్షాలు సైతం తప్పుపడుతుండడంతో అభిశంసనకు మరింత బలం చేకూరడం తథ్యమని విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు. యశ్వంత్ వర్మ కేసు విషయంలో సుప్రీంకోర్టు నియమించిన ఇన్‌హౌస్ కమిటీ నివేదికలో భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టల ఆధారాన్ని బలంగా పేర్కొనడంతో అభిశంసనకు మరింత మద్దతు పెరగడం ఖాయమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అభిశంసన ప్రక్రియలు చాలా అరుదుగానే జరిగాయి. 1991లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నజస్టిస్ వి.రామస్వామిపై ఆర్థిక అవకతవకల ఆరోపణలతో లోక్‌సభలో 108 మంది సభ్యులచే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెస్ గైర్హాజరు కావడంతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆయన పూర్తికాలం కొనసాగినప్పటికీ ఆయనకు కేసులు మాత్రం అసైన్ చేయలేదు. ఇక 2011లో కోల్‌కత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ పై ఆర్థిక అవకతవకలపై రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. లోక్‌సభలో ఓటింగ్‌కు ముందే ఆయన రాజీనామా చేయడంతో ఆవివాదంఅంతటితో ముగిసిపోయింది. 2017లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున్ రెడ్డిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబడినప్పటికీ కొంతమంది ఎంపీలు తమ సంతకాలను ఉపసంహరించడంతో అది కూడా వీగిపోయింది. 2018లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై రాజ్యసభలో విపక్షాలన్నీ ఏకమై రాజకీయపరమైన అభిప్రాయాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ చైర్మన్ దాన్ని ప్రాథమిక దశలోని తిరస్కరించడంతో తీర్మానం ముందుకు పోలేదు. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమేనని చీకట్లో ఇంకా ఎన్ని ఉన్నాయోనని ప్రజాస్వామికవాదులు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగ పరమైన అంశాలపై ఇటీవల దాఖలైన పలు పిటిషన్లను నామమాత్రమైనా పరిశీలించకుండానే ఆదిలోనే కొట్టివేయడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే పార్లమెంటును సైతం న్యాయమూర్తుల నియామకంలో భాగస్వామ్యం చేయకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క స్వయం ప్రతిపత్తి అనే పేరున న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేపట్టడంవల్ల పారదర్శకత లోపిస్తున్నదని, జవాబుదారీతనం అడుగంటుతుండడమేకాక 'అంకుల్ జడ్జ్ సిండ్రోమ్' వల్ల తమ అనుయాయులకే పెద్దపీట వేసే అవకాశంఉన్నదని న్యాయ కోవిదులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకువచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌తరహాలో సరికొత్త కమిషన్‌ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సైతం కోరుతున్నారు. మొత్తం మీద పూర్తిస్థాయిలో వ్యవస్థనుప్రక్షాళనచేసి సగటు భారతీయునిలో న్యాయవ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంపొందించేవిధంగా అడుగులుపడతాయని ఆశిద్దాం! •

# ఘోర విమాన ప్రమాదాలు ఎన్నెన్నో..



## బోయింగ్‌ప్రమాదంపై బ్రిటన్‌ప్రధాని దిగ్భ్రాంతి

**లండన్, జూన్ 12:** లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం అహ్మదాబాద్ నగరంలో కూలిపోయిన ఘటనపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన గురించి తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతోందని ఆయన తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్నవారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఈ విమానం కుప్పకూలింది. ఇందులో 242 మంది ఉండగా, వారిలో 53 మంది బ్రిటన్ పౌరులే. ఈఘటనపై కీర్ స్టార్మర్ 'ఎక్స్' ద్వారా స్పందించారు. అహ్మదాబాద్ నగరంలో, లండన్ బయల్దేరిన విమానం కూలిపోయిన దృశ్యాలు హృదయ విదారకంగాఉన్నాయి. ఆ విమానంలో అనేక మంది బ్రిటిష్ జాతీయులు కూడా ఉన్నారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు నాకు వివరిస్తున్నారు. ఈ తీవ్ర మనోవేదన కలిగించే సమయంలో ప్రయాణికులు మరియు వారి కుటుంబ సభ్యులకు నా ప్రార్థనలు అండగా ఉంటాయని తన పోస్టులో పేర్కొన్నారు.

**న్యూఢిల్లీ,జూన్ 12:** విమానప్రమాదాలు తరచూ సాంకేతిక సమస్యలు, సకాలంలో ఓవర్‌హాలింగ్ జరక్కపోవడం వల్ల కొన్ని జరుగుతుంటే వాతావరణ పరిస్థితులు, గగనతలంలో ఎదురవుతున్న పరిణామాలకారణంగా కొన్ని జరుగుతున్నాయి. మరికొన్ని హటాత్తుగా వచ్చిన సాంకేతిక సమస్యలు కూడా ఒక కారణమే. ఈ ప్రమాదాలు ఒక్క భారత్‌కే పరిమితం కాదు. వివిధ దేశాల్లోకూడా ఘోరమైన ప్రమాదాలు జరిగాయి. 1977 మార్చి 27న స్పెయిన్‌లోని లాస్ రోడియోస్‌లో ఉన్న టెనెరైఫ్ నార్త్ ఎయిర్‌పోర్ట్ వద్ద హాలండ్‌కు చెందిన కేఎల్‌ఎం ఫ్లైట్ 4085, గ్రీస్‌కు చెందిన పాన్ ఏఎం ప్లేన్1736 ఢీకొన్నాయి. ఈ రెండు విమానాలనూ లాస్ రోడియోస్ ఎయిర్‌పోర్టుకు దారిమళ్లించారు. పాన్ ఏఎం ఫ్లైట్ 1736 విమానం లాస్ రోడియోస్ ఎయిర్‌పోర్టు వైపుగా వస్తోంది. ఇదే సమయంలో కేఎల్‌ఎం విమానం క్లియరెన్స్ తీసుకోకుండానే టేకాఫ్ తీసుకుంది. ఇవి రెండూ గగనతలంలో ఎదురుపడ్డాయి. దట్టమైన పొగమంచు వల్ల పైలట్లు ఎదురుగా ఏముందో గుర్తించలేకపోయారు. ఈ ప్రమాదంలో 583 మంది చనిపోయారు. ఇవి రెండూ బోయింగ్ 747 విమానాలే.1985 ఆగస్టు 12న జపాన్ ఎయిర్ లైన్స్ విమానం 123 టోక్యో నుంచి ఒసాకాకు బయలుదేరింది. ఈ ఘటనలో విమానంలోని 524 మందిలో 520 మంది చనిపోయారు. విమానం తోక భాగాన్ని బోయింగ్ టెక్నీషియన్లు సరిగ్గా రిపేర్ చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గుర్తించారు. 1974 మార్చి 3న ఇస్తాంబుల్ నుంచి లండన్‌కు బయలుదేరిన విమానం ఫ్రాన్స్‌లోని ప్యారిస్ శివార్లలో ఉన్న ఎర్మెనో విల్లే అడవుల్లో కూలింది. విమానంలోని 346 మంది చనిపోయారు.1980 ఆగస్టు 19న సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఉన్న ఎయిర్‌పోర్టు రన్‌వేపై లఖీద్ మార్టిన్ ఎల్1011 విమానం ఉంది. అయితే అకస్మాత్తుగా విమానంలో పొగలు వ్యాపించాయి. ఆ పొగను పీల్చుకొని విమానంలోని మొత్తం 301 మంది చనిపోయారు. 1979 మే 25న మధ్యాహ్నం డీసీ10 విమానం అమెరికాలోని చికాగోలో ఉన్న ఓహేర్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. అయితే ఈ విమానంలోని ఎడమ ఇంజిన్,



రెక్క భాగం నుంచి తెగిపోయి కింద పడింది. దీంతో విమానం అదుపుతప్పి గింగిరాలు తిరిగింది. చివరకు రన్ వే నుంచి ఒక మైలు దూరంలో విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 272 మంది చనిపోయారు.

2018 ఏప్రిల్ 11న అల్జీరియాలో రష్యాకు చెందిన ఇల్యూషిన్ రకం సైనిక రవాణా విమానం కూలింది. బౌఫారిక్ విమానాశ్రయానికి సమీపంలోని ఒక పొలంలో విమానం పడిపోయింది. ఈ ఘటనలో 257 మంది చనిపోయారు. మలేషియా ఎయిర్ లైన్స్ విమానం 2014 మార్చి 8న మలేషియాలోని కౌలలంపూర్ నుంచి చైనాలోని బీజింగ్‌కు బయలుదేరింది. అయితే ఈ విమానం రాడార్ తెర నుంచి మాయమైంది. బోయింగ్ 777 రకానికి చెందిన ఈ విమాన ప్రమాదంలో 239

### సాంకేతిక సమస్యలే ఎక్కువ కారణం..

### స్పెయిన్‌లో 1977 మార్చి 27న రెండు విమానాలు ఢీ, 583 మంది మృతి

### అడవుల్లో కూలిన విమానాలు కూడా అనేకం

మంది చనిపోయారని ప్రకటించారు. 1998 సెప్టెంబరు 2న స్విట్జర్లాండ్‌కు చెందిన స్విస్ ఎయిర్ ఫ్లైట్ 111 అమెరికాలోని న్యూయార్క్ నుంచి స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు బయలుదేరింది. విమానం తోక భాగం నుంచి పొగ వాసన వస్తుండటాన్ని తొలుత గుర్తించారు. 65 మైళ్ల దూరంలో కెనడాలోని నోవా స్కాటియాలో ఉన్న హాలీ ఫ్యాక్స్‌కు విమానాన్ని తీసుకెళ్లి దింపాలని పైలట్లు భావించారు. పైలట్లు తీవ్రంగా శ్రమించి విమానాన్ని నోవా స్కాటియాకు 5 మైళ్ల దూరం వరకు తీసుకెళ్లారు. ఇంకొన్ని నిమిషాలైతే హాలీ ఫ్యాక్స్‌లో విమానాన్ని దింపొచ్చని భావించారు. అయితే అప్పటికే విమానంలో వేగంగా మంటలు వ్యాపించాయి. దీంతో మార్గం మధ్యలో అట్లాంటిక్ సముద్రంలో విమానం కూలిపోయింది. అందులోని 229 మంది ప్రాణాలు కోల్పోయారు. 2009 జూన్ 1న ఎయిర్ ఫ్రాన్స్ ఎయిర్‌లైన్స్ 447 బ్రెజిల్‌లోని రియో డీ జెనీరియో నుంచి ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌కు బయలుదేరింది. మార్గం మధ్యలో విమానానికి తీవ్ర పిడుగుపాట్లు ఎదురయ్యాయి. వాటి బారి నుంచి తప్పించుకునేందుకు పైలట్లు విమానాన్ని దాదాపు 38వేల అడుగుల ఎత్తుకు తీసుకెళ్లారు. మరీ అంత ఎత్తుకు చేరాక విమానంలోని ఏరో డైనమిక్ వ్యవస్థ దెబ్బతింది. చివరకు విమానం దక్షిణ అట్లాంటిక్ సముద్రంలో కూలింది. దీంతో అందులోని 228 మంది చనిపోయారు.

## బోయింగ్ ప్రమాదంపై సినీ ప్రముఖుల సంతాపాలు

**అహ్మదాబాద్, జూన్ 12:** అహ్మదాబాద్ ఎయిర్ పోర్టునుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్లలోనే కుప్పకూలింది. ఈ ఘటనపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, రాఘవ్‌ఛద్దా, సోనూ సూద్, ఖుష్బూతోపాటు పలువురురాజకీయ సినీప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేసారు. ఈఘటన తమను ఎంతగానో కలిచివేస్తోందని సోషల్‌మీడియా వేదికగా పోస్టులుపెట్టారు. ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్‌లీగ్ ఈవెంట్‌ను బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ రద్దుచేసుకున్నారు. అహ్మదాబాద్‌నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్‌ఇండియా విమానం ప్రమాదానికి గురికావడం అత్యంత విషాదకరం. బాధి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. మరింత సమాచారం సత్వరమే అందచేస్తామని ఎయిరిండియా ఛైర్మన్ చంద్రశేఖరన్ తెలిపారు. బాలివుడ్‌నటి జాన్వీకపూర్, అక్షయ్‌కుమార్, అనుపమ్‌ఖేర్, టాలివుడ్ నటులు ఎన్టీఆర్, మంచువిష్ణు, అల్లు అర్జున్, నటి దిశాపటాని తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

## భారత్‌లోనూ విమాన దుర్ఘటనలు ఎక్కువే..!



**న్యూఢిల్లీ, జూన్ 12:** గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టునుంచి గురువారం లండన్ బయలుదేరిన విమానం నెంబరు ఎఐ171 ఘోరప్రమాదానికి గురయింది. విమానంలో 242 మందిప్రయాణీకులు, ఇద్దరు పైలెట్లు, సిబ్బంది ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గత ఐదేళ్లలో భారత్‌లో జరిగిన విమానప్రమాదాలో ఇది భారీస్థాయి ప్రమాదం అని నిపుణులు చెపుతున్నారు. 2020 కరోనా మహమ్మారి సమయంలో విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లోభాగంగా బోయింగ్ 737-800విమానం దుబాయ్‌నుంచి కేరళలోని కోయ్‌కోడ్‌కు బయలుదేరింది. అదే సమయంలో భారీ వర్షం వల్ల ప్రమాదంజరగడంతో 30 అడుగుల లోయలోపడి విమానం రెండుగా చీలిపోయింది. ఈప్రమాదంలో ఇద్దరుపైలట్లతోసహా 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 100 మందికిపైగా గాయపడ్డారు. 2010మేలో కూడా మంగుళూరు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్ 812 కుప్పకూలింది. అత్యంత భారీ ప్రమాదం.166మంది ప్రవాసభారతీయులు ఉన్న ఈవిమానం దుబాయ్‌నుంచి మంగళూరుకు వచ్చింది. సకాలంలో రన్‌వేపై ఆగలేకపోయింది. రన్‌వేదాటి లోయలోకి వెళ్లింది. మంటలు చెలరేగి 158 మంది మృతిచెందారు. వీరిలో 8 మంది మాత్రమే ప్రాణాలతో మిగిలారు. 1998జులైలో అలయన్స్ ఎయిర్ విమానం బోయింగ్ 737-2ఎ8 విమానం ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పింది. జనాలు ఉన్న ప్రాంతంలోకి దూసుకుపోయింది. బీహార్‌లోని పాట్నా ఎయిర్‌పోర్టు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో 55 మంది ప్రయాణీకులు మరణించగా మరో ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయారు.

హరియానాలో కూడా మరోప్రమాదం జరిగింది. సౌదీ అరేబియా ఎయిర్‌లైన్స్ విమానం 763 కజకిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానం 1907లు ఢీకొన్నాయి. సమాచార లోపం కారణంగా ఈప్రమాదం జరిగింది. రెండు విమానాల్లో 340కిపైగా ప్రయాణీకులు సిబ్బంది మృతిచెందారు. 1993 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఎయిర్‌పోర్టునుంచి బయలుదేరని ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ సమయంలో ప్రమాదానికి గురయింది. రన్‌వేపైకివచ్చిన ట్రక్కును ఢీ కొట్టింది. దీనితో విమానంలో మంటలు చెలరేగాయి. ఈప్రమాదంలో 118 మంది ప్రయాణీకులు 55 మంది సిబ్బందితోకలిసి చనిపోయారు. బెంగళూరు ఎయిర్ పోర్టులో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం 605 కుప్పకూలింది. రన్‌వేను తీవ్రస్థాయిలో తాకడంతో ఈప్రమాదం జరిగింది. ఈ ఘటన 1990లో జరిగితే ఈ ప్రమాదంలో 146 మంది ప్రయాణీకులు 92 మంది సిబ్బందిచనిపోయారు. 1972 జూన్‌నెలలోజపాన్ ఎయిర్‌లైన్స్ డిసి-8 విమానం ఢిల్లీలో పాలం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా మంటల్లో చిక్కుకుంది. విమానంలోని మొత్తం 89 మందిలో 83 మంది చనిపోయారు.

## కుమార్తె కోసం లండన్ బయల్దేరిన రూపానీ.. ప్రమాదానికి బలి



**అహ్మదాబాద్, జూన్ 12:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోజరిగిన ఘోరవిమాన ప్రమాదంలో విజయ్‌రూపానీ కూడా చిక్కుకున్నారు. లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిక్షణాలకే కుప్పకూలింది. ఇదే విమానంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. విమానప్రమాదం మంటల్లో చిక్కుకుని దుర్మరణం పాలయ్యారు. ఈ విమానంలో ఆయనపేరుతో ఒక టికెట్ తొలుత నెట్టింట వైరల్ అయింది. అందులో బోర్డింగ్ సమయం 12.10గంటలుగా ఉంది. ఆయన విమానం ఎక్కినట్లు నిర్ధారించిన ప్యాసింజర్ జాబితాలోనూ రూపానీ పేరు ఉంది. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు విజయ్‌రూపానీ ఈ విమానంలో ప్రయాణానికి బుక్‌చేసుకున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. చివరకు కుప్పకూలిన విమానం మంటల్లో చిక్కుకోవడంతో విజయ్‌రూపానీ కూడా మృతిచెందారు. బిజెపికి చెందిన విజయ్‌రామ్‌నిక్‌లాల్‌భాయ్ రూపానీ 2016 నుంచి 2021వరకూ రెండుసార్లు గుజరాత్ సిఎంగా పనిచేసారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తెకాగా చిన్న కుమారుడు పూజిత్ ఒక ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు.

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టునుంచి గురువారం మధ్యాహ్నం 1.30 గంటలప్రాంతంలో లండన్ బయలుదేరి ఎయిరిండియా ఎఐ171 విమానం కాసేపటికే కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో 242 మందిప్రయాణీకులు సిబ్బంది ఉన్నారు.

## ముందు చెట్టును ఢీకొని ఆపై భవనంపై కూలిన విమానం

**అహ్మదాబాద్,జూన్ 12:** నగరంలోని పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టునుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా ఎఐ171 విమానం టేకాఫ్ అయిన కొద్దిక్షణాలకే కుప్పకూలిపోయింది. అక్కడికి సెకన్ల వ్యవధిలోనే చెట్టును ఢీకొట్టి ఒక భవనంపై కూలిపోయింది. సాంకేతిక సమస్య తలెత్తిన సమయానికి విమానం 825 అడుగుల ఎత్తునఉంది. ఫ్లైట్‌రాడార్ 24ప్రకారం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. క్రమంగా కిందికి కూలుతూ చెట్టును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న విమానాశ్రయ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యలుచేపట్టారు. ప్రమాదానికి గురైన విమానంలో 242 మందిప్రయాణీకులుంటే వారిలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్‌పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతోపాటు ఒక కెనడా వాసి కూడా ఉన్నారు. బాధిత కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు వీలుగా హాట్‌లైన్‌నంబరు 1800-5691-444ను ఏర్పాటుచేసారు.

## దేశంలోనే తొలిసారి చెన్నైలో 8 అంతస్థుల భవనంలో మెట్రో రైలు

**చెన్నై, జూన్ 12:** దేశంలోనే మొట్టమొదటిసారిగా తొమ్మిది అంతస్థుల భవన సముదాయంలో నిర్మించే రైలు పట్టాలపై మెట్రోరైలు పరుగులు తీయనుంది. ఈ అద్భుత దృశ్యం తిరుమంగళం మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఆవిష్కృతం కాబోతోంది. రాజధాని నగరం చెన్నైలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టులో భాగంగా తిరుమంగళం వద్ద షాపింగ్‌మాల్స్‌తో కూడిన బహుళ అంతస్థుల భవన సముదాయం మధ్య నుంచి వెళ్లేలా మెట్రోరైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ కొత్త రైలు మార్గానికి సంబంధించిన తొమ్మిది అంతస్థుల భవన సముదాయం, టవర్ల ఊహాచిత్రాలను చెన్నై మెట్రో రైల్వే (సిఎంఆర్ఎల్) బుధవారం విడుదల చేసింది. నగరంలో రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టును 116.1 కి.మీ. వరకు మూడు మార్గాల్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వీటిలో మాధవరం-షోళింగనల్లూరు మార్గంలోని తిరుమంగళం జంక్షన్ వద్ద మెట్రో రైల్వేస్టేషన్‌తోపాటు షాపింగ్‌మాల్స్‌తో 9 అంతస్థులతో ఎ, బి, సి పేర్లతో మూడు భవనాలు నిర్మించనున్నారు.



ఈ భవన సముదాయంలో రెండంతస్థుల రైల్వే స్టేషన్ కూడా నిర్మితమవుతుంది. ఈ భవన సముదాయాలతో కూడిన మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులకు సంబంధించి త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నారు. కొత్తగా నిర్మించబోయే ఈ భవనంలో పలు కార్యాలయాలు, చిల్లర దుకాణాలు, మూడు సొరంగమార్గాల పార్కింగ్ స్థలాలుంటాయి. భారత దేశంలోనే వాణిజ్య సముదాయాలు కలిగిన భవనంలో ప్రయాణించేలా మెట్రో రైలు మార్గాన్ని నిర్మించడం ఇదే ప్రప్రథమనని మెట్రో రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ప్రస్తుతం జపాన్, చైనా దేశాల్లోనే భవన సముదాయాల మధ్య నుంచి రెళ్లు వెళుతున్నాయని, ఆ రీతిలోనే నగరంలోనూ బహుళ అంతస్థుల భవన సముదాయంలోకి మెట్రో రైళ్లు దూసుకెళతాయని తెలిపారు. ఈ భవన సముదాయంలోని నాలుగో అంతస్థులో మెట్రో రైళ్లు ప్రయాణిస్తాయని, మూడో అంతస్థులో ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్ ఉంటాయని పేర్కొన్నారు.

## గుడ్‌బై టు ఇండియా..

### కన్నీళ్లు పెట్టిస్తున్న ఇద్దరు బ్రిటిషర్ల సెల్ఫీ


**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుసమీపంలో జరిగిన ఘోరవిమానప్రమాదంలో ఇద్దరు బ్రిటిషర్లు తీసుకున్న సెల్ఫీ కన్నీళ్లుపెట్టిస్తోంది. ఎలా బయటకు వచ్చిందో కానీ వారు చెపుతున్న మాటలుకూడా వైరల్ అయ్యాయి. విమానం ఎక్కేముందే వీరు సెల్ఫీతీసుకున్నట్లుతెలుస్తోంది. ఇండియా నుంచి ఇంగ్లండ్ వెళ్లిపోతున్నాం. మరికొద్దిసేపట్లో విమానంఎక్కేస్తాం. గుడ్‌బైటు ఇండియా చాలా సంతోషంగా ఉంది ఇంగ్లండ్ తిరిగి వెళుతున్నందుకు అంటూవీరు చెప్పిన విడియో ఇపుడు వైరల్ అయింది. దురదృష్టం కొద్దీ వారి సంతోషం కొద్దిసేపటికే గాలిలో కలిసిపోయింది. ఈ ఇద్దరూ కూడా ప్రమాదంలో మరణించారు. అంతకు కొద్దినిమిషాలముందు ఎంతో సంతోషంగా ఉన్న వీరిద్దరూ అంతలోనే అగ్నికి ఆహుతి కావడం వైరల్ అవుతున్న వీరిద్దరి విడియోనుచూసి నెటిజన్లు ఉద్వేగభరితం అయ్యారు.

**భర్తను కలుస్తానన్న సంతోషం ఆవిరైపోయింది...!**

లండన్ వెళుతున్న ఎయిరిండియా ఎఐ171 విమానంలో కుష్బూరాజ్‌పురోహిత్ అనే కొత్త పెళ్లికూతురు కూడా ప్రయాణిస్తోంది. ఇటీవలే వారికి పెళ్లికావడం ఆపై ఇదే విమానంలో ఆమె లండన్‌లో తన భర్తను కలిసేందుకు విమానం ఎక్కడం. అంతలోనే ప్రాణాలు వదిలేయడం వంటి ఘటన చూస్తే అందరికీ కన్నీటి పర్యంతం అయింది. రాజస్థాన్‌లోని బాలోతారా జిల్లాలోని అరబా గ్రామానికిచెందిన కుష్బూ మన్‌ఫూల్‌సింగ్‌ను ఈ ఏడాదిజనవరిలోనే పెళ్లాడింది. తనభర్త లండన్‌లో విద్యార్థికాగా ఆతడిని కలిసేందుకు మొదటిసారి ఆమె లండన్‌కు బయలుదేరింది. తల్లితండ్రులు మదన్‌సింగ్‌రాజ్‌పురోహిత్ దంపతులు ఎంతో సంతోషంగా కుమార్తెను సాగనంపారు. అంతలోనే తమ కుమార్తె మరణ వార్త వినాల్సి వచ్చింది. కుష్బూ తన భర్తను కలుస్తానన్న సంతోషం కూడా విమానప్రమాదంలో మంటల్లో ఆవిరైపోయింది. ఇదే విమానంలో కుష్బూతోపాటు మొత్తం 11 మంది రాజస్థానీయులు మరణించినట్లు తెలుస్తోంది. వీరిలో ఇద్దరు యుకెలో చెఫ్‌లుగా వెళుతున్నారు.

## మంగళసూత్రమే సోనమ్‌ను పట్టించింది

### మేఘాలయ డిజిపి




**షిల్లాంగ్,జూన్ 12:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసు కీలక విషయాలు వెలుగులో వస్తున్నాయి. హోమ్‌స్టేలోని సూట్‌కేస్‌లో దొరికిన మంగళసూత్రమే సోనమ్‌ను పట్టించిందని మేఘాలయ డిజిపి వెల్లడించారు. రాజా రఘువంశీసోనమ్ దంపతులు ఉన్న హోటల్ రూమ్‌లో పోలీసులు సోదా చేస్తుండగా అక్కడ సూట్‌కేస్ దొరికింది. అందులో మంగళసూత్రం, ఒక ఉంగరం ఉన్నాయి. అయితే కొత్తగా పెళ్లి అయిన మహిళ రూమ్‌లోనే తాళిని, సూట్‌కేస్‌లో ఉంగరాన్ని పెట్టి వెళ్లడం మాకు కొత్త అనుమానాలను కలిగించింది. హిందూ సంప్రదాయంలో మంగళసూత్రాన్ని స్త్రీ వైవాహిక జీవితానికి పవిత్ర చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన వారు దానిని దాదాపుగా తీయరు. ఈ కోణంలోనే దర్యాప్తును ముమ్మరం చేశారు. అప్పుడే నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరాన్ని అంగీకరించారని డిజిపి వెల్లడించారు. హనీమూన్ కోసం మేఘాలయకు వచ్చిన సోనమ్, రఘువంశీ మే 22న సోహ్రాలో ఓ హోమ్‌స్టేకు వెళ్లారు. అయితే అక్కడ గది అందుబాటులో లేకపోవడం వల్ల తమ సూట్‌కేస్‌ను అక్కడే ఉంచి, నాంగ్రియాట్ గ్రామానికి ట్రెక్కింగ్‌కు వెళ్లారు.

ఆ రాత్రి నాంగ్రియాట్‌లోని మరో హోమ్‌స్టేలో బస చేసి, మే 23న ఉదయాన్నే అక్కడి నుంచి బయలుదేరారు. అనంతరం సోహ్రాకు తిరిగివచ్చి, తమ స్కూటర్‌ను తీసుకుని వీసాడాంగ్ జలపాతం వైపు వెళ్లారు. అక్కడే రాజా రఘువంశీ హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. ఇక ఈ కేసులో రాజా రఘువంశీని తానే హత్య చేసినట్లు సోనమ్ ఒప్పుకున్నట్లు మేఘాలయ పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహా సమక్షంలో సోనమ్‌ను ప్రశ్నించగా, తన భర్త హత్యకు చేసిన కుట్రలో తన ప్రమేయం ఉన్నట్లు ఆమె అంగీకరించిందని పోలీసులు తెలిపారు. మరోవైపు తన చెల్లెలు ఆమె భర్తను చంపించిందని వందశాతం నమ్ముతున్నట్టు సోనమ్ సోదరుడు గోవింద్ స్పష్టం చేశారు. నేరం రుజువైతే ఆమెను ఉరి తీయాలని ఆయన అన్నారు.

## లింగసమానత్వంలో భారత్‌కు 131వ ర్యాంకు

### ఐస్‌ల్యాండ్ ఫస్ట్, న్యూజిలాండ్ టాప్ 5



**న్యూఢిల్లీ,జూన్ 12:** మహిళ, పురుష సమానత్వం విషయంలో భారత్ అట్టడుగున 131వ స్థానంలో నిలిచింది. ప్రపంచంలోని 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2025'ను ప్రపంచ ఆర్థికవేదిక (డబ్ల్యూఇఎఫ్) గురువారం విడుదల చేసింది. 2024తో పోలిస్తే ఈ ఏడాదిలో భారత ర్యాంకింగ్ రెండు స్థానాలు దిగజారింది. గతేడాది 129వ స్థానంలో నిలిచిన భారత్ ఈసారి 131వ ర్యాంకుకు చేరింది. మహిళ, పురుషుల జనసంఖ్యకు సంబంధించిన 'ప్యారిటీ స్కోర్' విషయంలోనూ భారత్ అట్టడుగున ఉండిపోయింది. భారత్‌కు 64.1 శాతం 'సమానత్వస్కోర్' వచ్చిందని డబ్ల్యూఇఎఫ్ వెల్లడించింది. వరుసగా 16వ సారి ఈ జాబితాలో తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. 2వ స్థానంలో ఫిన్‌లాండ్, 3వస్థానంలో నార్వే, 4వ స్థానంలో యూకే, 5వ స్థానంలో న్యూజిలాండ్ నిలిచాయి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు మునుపటి కంటే బాగా మెరుగుపడింది. దీంతో ఆర్థిక వ్యవహారాల విభాగంలో అదనంగా 0.3 పాయింట్లను భారత్ సాధించింది. మహిళ, పురుషుల ఆర్థిక భాగస్వామ్యం పెరగడంతో అదనంగా 0.9 పాయింట్లతో 'ఆర్థిక భాగస్వామ్యం అవకాశాల' కేటగిరీలో మొత్తం 40.7 శాతం ప్యారిటీ స్కోర్‌ను సాధించింది. భారత్‌లోని మహిళ, పురుషుల ఆదాయ అంచనాల తేడా స్కోర్ 28.6 శాతం నుంచి 29.9 శాతానికి పెరిగింది. భారత్‌లోని వివిధ ఉపాధి కార్యకలాపాల్లో మహిళ, పురుష కార్మికుల భాగస్వామ్యం అనేది గతేడాది స్థాయిలోనే 45.9 శాతంగా కొనసాగుతోంది. అయితే విద్యాపరమైన కేటగిరిలో భారత్‌కు అత్యధికంగా 97.1 శాతం సమానత్వ స్కోర్ వచ్చింది. దేశంలోని మహిళ, పురుష జనాభా నిష్పత్తి, మహిళ, పురుషుల ఆరోగ్యకర ఆయుర్దాయాల్లో పెరుగుదల ఏటా జన్మిస్తున్న ఆడ, మగ పిల్లలు వంటి విభాగాల్లో భారత్ సమానత్వస్కోరు మెరుగుపడింది. రాజకీయ సాధికారతపరంగా భారత పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం అనేది 14.7 శాతం నుంచి 13.8 శాతానికి తగ్గింది. 2023 నాటి స్థాయితో పోలిస్తే గత రెండేళ్లుగా ఈవిభాగంలో భారతదేశ ప్యారిటీ స్కోరు తగ్గుతూనే ఉంది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 6.5 శాతం నుంచి 5.6 శాతానికి డౌన్ అయింది. ఈ విభాగంలో ప్యారిటీ స్కోర్ 5.9 శాతంగా నమోదైంది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను సాధించింది.

**24వ ర్యాంకుకు బంగ్లాదేశ్ ఒకేసారి 75 ర్యాంకులు జంప్**

'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2025'లో అనూహ్యంగా బంగ్లాదేశ్ ర్యాంకింగ్ మెరుగుపడింది. రాజకీయ సాధికారత, ఆర్థిక భాగస్వామ్యం వంటి విభాగాల్లో దక్షిణాసియాలోనే అత్యంత మెరుగ్గా బంగ్లాదేశ్ రాణించింది. ఒకేసారి ఏకంగా 75 ర్యాంకులు జంప్ చేసి ప్రపంచంలో 24వ ర్యాంకుకు చేరింది. భారత్ పొరుగుదేశాలైన పాకిస్థాన్ 148, మాల్దీవులు 138, శ్రీలంక 130, నేపాల్ 125, భూటాన్ 119 స్థానాల్లో నిలిచాయి.

# పట్టణంలో రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు

## నూజివీడును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా :మంత్రి కొలుసు పార్థసారధి

**ఏలూరు ప్రభాతవార్త** నూజివీడు పట్టణంలో రూ,5 కోట్ల తో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం భూమి పూజ చేశారు. పట్టణ 26 వార్డు లో సి, సి. రోడ్డు,మరికొన్ని రోడ్లకు శంకుస్థాపన చేశారు.,అనంతరం పెద్ద గాంధీ సెంటర్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకొని సంబరాలు జరిపారు. తెలుగుదేశం కుటుంబ సభ్యులు విశేషంగా పాల్గొన్నారు ,అనంతరం మంత్రి మాట్లాడుతూ ఏడాది పాలనలోనే ఎన్నో విజయాలు సాధించామని పార్థసారధి అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. నూజివీడు నియోజకవర్గంలో జెడ్పి పరిధిలో రూ. 3.55 కోట్ల తో రహదారులు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ. 30 కోట్లతో గుంతలు పూడ్చేందుకు ఖర్చుచేశామన్నారు. పంచాయితీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ. 5 కోట్లు కేటాయించామన్నారు. సంక్షేమంలో భాగంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్దమొత్తంలో పెన్షన్లు ఇస్తున్నామన్నారు. నూజివీడు నియోజవర్గం లో ఏడాది కాలంలో రూ.170 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి పేదల ఆకలి తీర్చిన ఖ్యాతి కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నేటి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వం పై నమ్మకం తో ప్రపంచ దిగ్గజ సంస్థలు మన రాష్ట్రంలో ఇప్పటికే రూ 10 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాయని తద్వారా యువతకు సుమారు 5 లక్షల ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు, మహిళకు ఉచిత బసు, ఉచిత గ్యాస్,తల్లికి వందనం, ద్వారా చదువుకుంటున్న ప్రతీ విద్యార్థికి రూ,15 వేలు ఈ రోజు అందించమన్నారు, పేద వాడికి అన్నం పెట్టే అన్నా క్యాంటీన్, పింఛన్లు రూ,4 వేలు పెంపు, వికలాంగులకు రూ,6 వేలు,అందిస్తున్నామన్నారు, రైతులకు త్వరలో రైతు భరోసా రూ,20 వేలు అందిస్తామన్నారు గత ప్రభుత్వం అందించిన పథకాలు అన్నీ కలిసి కూటమి ప్రభుత్వం అందించే పింఛన్ తో సమానం అన్నారు, గత ప్రభుత్వం 5 సంవత్సరాల్లో అందించే సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ఏడాది లో అందించిందన్నారు.

ఎప్పటినుంచో పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో భాగంగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి పరీక్షలు కూడా నిర్వహించడం జరుగుతున్నదన్నారు.

కార్యక్రమంలో పలువురు అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



# పేదలసేవ నుండి తల్లికివందనం వరకు కూటమి యేడాది పాలన

## - తిరుపతిలో నేతల సంబరాలు

**తిరుపతి,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తూ ఏడాదికాలం పూర్తిచేసుకుందని రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ తెలిపారు. ఏడాదిపాలన పూర్తయిన సందర్భంగా గురువారం ఉదయం తిరుపతిలోని టౌన్‌క్లబ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి అభిషేకాలుచేసి,పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 365రోజులు ప్రాంతంలో ని విజయోత్సవ కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో ఏడాదిపాలన విజయవంతంగా పూర్తిచేసుకుని, సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనతో రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా మన్నారు. ప్రజల ఆకాంక్షలను నెర వేర్చడం కోసం ప్రతి రోజూ శక్తివంచనలేకుండా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. ఏడాదికాలంలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి ,తిరుపతికి ఆర్థికంగా చేయూత వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు సూరా సుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతి యాదవ్, దంపూరి భాస్కర్, డాక్టర్ సంజయ్, టిడిపి రాష్ట్రమీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, తిరుపతి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ; డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, అన్నా సంధ్యాయాదవ్, నాయకులు ఊట్ల సురేంద్రనాయుడు, మన్నెం శ్రీనివాసులు, బిజి కృష్ణయాదవ్ ఉన్నారు.

# రూ. 125 కోట్లతో రామచంద్రపురం అభివృద్ధి

## కూటమి యేడాది పాలనపై మంత్రి సుభాష్ సంతృప్తి

**కోనసీమ బ్యూరో, జూన్ 12( ప్రభాతవార్త):** గడచిన ఏడాది కాలంలో రామచంద్రపురం నియోజవర్గాన్ని రూ.125 కోట్లతో పలు అభివృద్ధి చేసామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రామచంద్ర పురంలో విజయోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది కూటమిపాలన అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగిందన్నారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకొని కూటమి ప్రభుత్వం జన రంజక పాలన అందిస్తుందన్నారు. ప్రజలందరి ఆకాంక్షల మేరకు పని చేస్తూ ప్రజా ప్రభుత్వంగా, మంచి ప్రభుత్వంగా మన్ననలు పొందుకున్నామని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజవర్గాన్ని ప్రత్యేకంగా తీసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నా న్నారు.రూ. 125 కోట్ల రూపాయల నిధులు నియోజకవర్గానికి మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ద్రాక్షారామంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం కోసం 11.5 కోట్లు, వెల్ల గ్రామం వద్ద సబ్ స్టేషన్ నిర్మాణానికి 3.3 కోట్లు, రామచంద్రపురం డిగ్రీ కళాశాలకు 5 కోట్లు, నాబార్డు ద్వారా మేజర్ కనెక్టింగ్ రోడ్లు 9 కోట్లు, ఆర్ అండ్ బి ద్వారా గుంతల రోడ్డు నిర్మాణానికి 8 కోట్లు, గొల్లపాలెం కుయ్యేరు రోడ్డుకు 32 కోట్లు, రామచంద్రపురం పురపాలక సంఘం ద్వారా అభివృద్ధి పనులు 16.19 కోట్లు, ఎంపీ లాడ్స్ ద్వారా 60 లక్షలు, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా 19.35 కోట్లు, సిసి రోడ్లు, డ్రైలు నిర్మాణానికి 17.22 కోట్లు, పిఎం కిసాన్ ద్వారా 3 కోట్లు, అంగన్వాడి నిధులు 4 కోట్లు, ఇరిగేషన్ పనుల కోసం 8 కోట్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 90 లక్షలు, పశుసంవర్ధక ద్వారా 2.5 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేపట్టమన్నారు. ప్రభుత్వ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా మహిళలకు, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. 30 జాబ్ మేళాలు నిర్వహించి 2 వేలకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా రామచంద్రపురంలో ఒక ఆసుపత్రి నిర్మించి అన్ని రకాల వైద్య సేవలు, భవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే 4 ఫ్రీజర్ బాక్సులు, 2 వాటర్ ట్యాంకులు సమకూర్చామన్నారు. గత ప్రభుత్వం కార్మికుల సంక్షేమం గాలికొదిలి వేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తున్నామన్నారు. డూప్లికేషన్ పేరుతో ఆపిన పథకాలు మళ్లీ పునరుద్ధరించి అమలు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

# సీమ మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య బై వీక్లీ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,జూన్ 12,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06539ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుండి 29వరకు ప్రతి శుక్ర,ఆదివారాల్లో బెంగళూరు నుండి రాత్రి 9.15గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.30గంటలకు బీదర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో బీదర్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 06540బై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16నుంచి 29వరకు ప్రతి శని,సోమవారాల్లో బీదర్ నుంచి మధ్యాహ్నం 1గంటకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో లోయలహంక,హిందూపురం,ధర్మవరం,అనంతపురం,గుంతకల్లు,ఆదోని,మంత్రాలయం రోడ్,రాయచూర్,క్రిష్ణా,యాద్గీర్,వాడి,షాహాబాద్,గుల్బర్గా,హోమ్నాబాద్ స్టేషన్లలో నిలుస్తాయి.

# చరిత్రపుటల్లో నిలిచేలా కుప్పం అభివృద్ధి

## - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

### - ఘనంగా సుపరిపాలన - స్వర్ణాంధ్ర విజయోత్సవాలు!

**కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో చరిత్ర పుటల్లో నిలిచేలా ఇకపై కుప్పం అభివృద్ధి ముందుకుసాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు నాలుగోసారి సిఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాదైన సందర్భంగా కుప్పం తెదేపా కార్యాలయంలో సుపరిపాలన, స్వర్ణాంధ్ర విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి ఆయన కార్యకర్తలు, నేతలకు పంచిపెట్టారు. అనంతరం ఆయమన మాట్లాడుతూ కుప్పం మున్సిపల్ అభివృద్ధికి గాను అమరావతి నగరంకు డిజైన్ చేసిన సింగపూర్ బృందంచే మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతోందన్నారు. కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూసర్వే, భూముల సేకరణకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియంకు టెండర్లు పూర్తయ్యాయని త్వరలో పనులు మొదలుపెడతామన్నారు. ఎవరూ ఊహించని రీతిలో కుప్పంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కుప్పంలో అండర్ గ్రౌండ్ డ్రైన్లు, ప్రధాన రహదారి విస్తరణ, వివిధ కంపెనీలతో ఒప్పందాలు జరుగుతాయన్నారు. కుప్పం ప్రజలు అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి నేతలు, కార్యకర్తలు తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలకు అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా అందర్నీ కలుపుకుని పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా చేసేందుకు సిఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, కడ సభ్యులు సుగుణమ్మ, సతీష్, రామచంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్, రాజగోపాల్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం,రవి, ఎవి రవి, ప్రతాప్, చెక్కునత్తం మణి, హర్ష ధర్మతేజ, జయరాంనాయుడు, వసంతమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దళిత బిడ్డకు అన్యాయం జరిగితే సిఎం చంద్రబాబు స్పందించలేదు..

## అత్యాచారానికి గురైన బాలికను పరామర్శించడానికి వెళ్లకుండా అడ్డుకోవడమేమిటి?: గవర్నర్‌ను కలుస్తాం :మాజీ మంత్రి మేరుగ నాగార్జున, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**అనంతపురం, జూన్ 12, (ప్రభాతవార్త బ్యూరో)** శ్రీ సత్య సాయి జిల్లాలో ఒక దళిత బిడ్డ పైన అత్యాచారం జరిగితే ఇంతవరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించకపోవడం దారుణం అని, అత్యాచారానికి గురైన బాలికను రామగిరి మండలం ఏడుగురాళ్లపల్లిలో అత్యాచారానికి గురైన దళిత బాలికకు తక్షణమే న్యాయం చేయాలని వైసీపీ నేత,మాజీ మంత్రి మెరుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక దళిత బాలిక అత్యాచారానికి గురైతే.. అక్కడ పరామర్శకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. మేము ఏమైనా టెర్రరిస్టులమా అంటూ ఆయన నిలదీశారు. అనంతపురం నగరంలో గిరిజన బాలికను దారుణంగా హత్య చేశారని.. ఈ జిల్లాలో ఇటీవల ఇలాంటి ఆకృత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వెంటనే వీటన్నింటి మీద గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామని నాగార్జున అన్నారు. దళిత బాలికపై అత్యాచారం చేసిన వారి మీద ఎస్సీ ఎస్టీ ప్రకారం చర్యలు తీసుకోవడమే కాకుండా.. ఆ చట్టం ప్రకారమే బాధితురాలు కుటుంబానికి పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కుటుంబానికి భద్రత కూడా కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రామగిరి మండలానికి వెళ్లాలంటే ఏమైనా ప్రత్యేకంగా వీసాలు, పాస్ పోర్టులు ఉండాలా అని ప్రశ్నించారు. ఇవాళ శ్రీ సత్య జిల్లా రామగిరి మండలం పేరూరు పర్యటనకు వెళ్తుండగా వైసిపి నాయకులను అడ్డుకోవడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక అమాయక దళిత బాలికపై దారుణంగా అత్యాచారం జరిగితే... దానిని ఖండిస్తూ పేరూరు పర్యటనకు వెళితే ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. పైగా తెలుగుదేశం పార్టీ అల్లరిమూకలు అలాగే అత్యాచారం చేసిన వ్యక్తుల బంధువులు, మండల కన్వీనర్ ఇలా అందరూ కర్రలు పట్టుకుని విధ్వంసం సృష్టించారన్నారు. వాహనాలను కూడా ధ్వంసం చేశారన్నారు. అసలు ఇదంతా ఏ రాజ్యాంగంలో రాశారని ప్రశ్నించారు. రామగిరి మండలంలో బయటకు వచ్చినవి కొన్నేనని.. వెలుగులోకి రానివి ఇంకా ఎన్నో దారుణాలు జరిగాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలను దారుణంగా హింసిస్తూ ఇక్కడ పాలన సాగుతోందన్నారు. ఏడు గుర్రాల పల్లిలో జరిగిన సంఘటన మీద వెంటనే డీజీపీని, గవర్నర్ ను కలుస్తామని ప్రకాష్ రెడ్డి అన్నారు... ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు రామగిరి మండలం ఏడుగురాళ్ల పల్లెకి వెళ్లామన్నారు.

# ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకుంటున్న డి సిఎం పవన్‌కళ్యాణ్

## యేడాది పాలన సందర్భంగా ప్రత్యేక వీడియో హాల్‌చల్

**విజయవాడ,జూన్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాత్ర రోజు రోజుకీ మరింత బలంగా, ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకుంటూ ముందుకు సాగుతోంది. డిప్యూటీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి గురువారంతో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జనసేన పార్టీ ఓ ఆసక్తికరమైన ప్రత్యేక వీడియో సోషల్ మీడియాలో విడుదల చేసింది. "కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను" అనే వ్యాఖ్యతో ప్రారంభమయ్యే ఈ వీడియో ప్రస్తుతం పార్టీ శ్రేణుల్లో ఆసక్తికర చర్చనీయాంశంగా మారింది.జనసేన పాలనలో సాధించిన విజయాలు: ఈ వీడియోలో పవన్ కల్యాణ్ నాయకత్వంలో గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను హైలైట్ చేశారు. ముఖ్యంగా ప్రతి ఇంటికీ మంచినీటి పంపిణీ, 55 గిరిజన గ్రామాలకు 39 కిలోమీటర్ల రోడ్లు వేయడం, కుంకీ ఏనుగులను కర్ణాటక నుంచి ఆంధ్రాకి తీసుకురావడం, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌లకు సేఫ్టీ కిట్స్ అందించడం వంటి తదితర అంశాలను స్టేటస్ వీడియోలో చూపించారు.రాజకీయ ప్రస్థానంలో గేమ్ ఛేంజర్‌గా పవన్: పార్టీ శ్రేణుల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్న ఈ ప్రత్యేక వీడియో, పవన్ ఒక సాధారణ రాజకీయ నేత స్థాయి నుంచి "గేమ్ ఛేంజర్"గా ఎలా ఎదిగారో కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. పిఠాపురంలో ఆయన సాధించిన తొలి ఎన్నికల విజయం ఆ ప్రాంతంలో పార్టీకి 100 శాతం స్ట్రైక్ రేట్ అందించిన తీరు, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను ఆయన తిరగరాసిన విధానం వంటి అంశాలను వీడియోలో ప్రముఖంగా ప్రస్తావించారు. పవన్ కల్యాణ్ సహనం,



పట్టుదల, వ్యూహాత్మక పొత్తుల ద్వారా జనసేనను రాష్ట్ర రాజకీయాల్లో అగ్రస్థానానికి చేర్చినట్లు వివరించారు.పార్టీ శ్రేణులకు స్ఫూర్తి ప్రజలకు భరోసా: ఈ వీడియో ద్వారా జనసేన పార్టీ తన శ్రేణులకు ఒక కొత్త ఉత్సాహాన్ని అందించడమే కాక, రాష్ట్ర ప్రజలకు తమ పాలన లక్ష్యాలను మరోసారి గుర్తు చేసింది.

# ఆక్వా పరిశ్రమకు మంచిరోజులు

## - ఉపసభాపతి రఘురామ వెల్లడి

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆక్వా రంగం సవాళ్ళు అధిగమించి,స్థిరత్వం సాధించడానికి స్వల్ప,మధ్య,దీర్ఘకాలిక వ్యూహాలు అమలు చేయాలని ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ సిఫార్సు చేసిందని శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. రాష్ట్రమత్స్య శాఖ కార్యాలయంలో ఆనం వెంకట రమణారెడ్డి, బిజెపి ఎంఎల్ఏ కామినేని శ్రీనివాస్‌లతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పదెకరాల నిబంధనతో సంబంధం లేకుండా ఆక్వా రైతులకు రూ.1.60కే విద్యుత్ ఇచ్చే నిర్ణయంపై సిఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఆక్వా ఉత్పత్తుల స్థానిక వినియోగం పెంచేందుకు జీఎస్టీ మినహాయింపు అంశాన్ని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

## రాష్ట్ర కళా, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలి : మంత్రి కందుల దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 12( ప్రభాతవార్త):** కళలకు కాణాచి అయిన సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలోని ఆనం కళాక్షేత్రంలో జరిగే కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలను ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. గురువారం రాజమహేంద్రవరం ఆనం కళాక్షేత్రం నందుఈ నెల 12 నుండి 15 వరకు శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం వారిచే నిర్వహించబడుతోన్న 43వ కళా సమ్మేళనం-2025 కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

# కూటమి యేడాదిపాలనపై నేతల్లో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు

**జగ్గయ్యపేట, జూన్ 12, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వ సంవత్సర పరిపాలన విజయవంతంగా కొనసాగిందని, సూపర్‌సిక్స్ పథకాలు కూడా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కార్యరూపం దాల్చాయని కూటమి ప్రభుత్వ పాలకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనేసేన, భారతీయ జనతాపార్టీ నాయకులు సంతోషం వ్యక్తంచేశారు. ఈమేరకు ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణంలో ఏడాది విజయోత్సవ ర్యాలీని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహ కూడలివద్దకు ర్యాలీగా చేరుకుని కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్‌తో కలిసి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందోత్సాహాలను ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో సాధించిన ప్రగతి, ప్రజలకు చేసిన ఉపకారం, ఒకపక్క సంక్షేమ పథకాల అమలుతోపాటు మరోపక్క అభివృద్ధి పనులను కొనసాగించటం సిఎం చంద్రబాబు ప్రత్యేకతగా వర్ణించారు. గత ఐదేండ్ల వైఎస్‌ఆర్సీపి పరిపాలనలో భ్రష్టుపట్టిన వ్యవస్థలను సరిదిద్దటం, సుపరిపాలనను అందించటం, ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవటం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలంటూ నేతలు రఘురామ్, రాజగోపాల్ వివరించారు. కాగా కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీమున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, బిసి నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు, మాజీమున్సిపల్ వైస్‌ఛైర్మన్ నూకల కుమారరాజ, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జివిజె జెడ్‌పి బాలుర హైస్కూలులో విద్యాకిట్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

## చిత్తూరులో దారుణం - తండ్రిని హత్య చేసిన కుమారుడు

**చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త:** చిత్తూరు నగరంలో గురువారం దారుణం జరిగింది. చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ తండ్రి అతని కుమారుడి చేసిలో దారుణ హత్యకు గురయ్యాడు. చిత్తూరు లెనిన్‌నగర్‌కు చెందిన టి.వెంకటరెడ్డి(50)ని అతని కుమారుడు సోమశేఖర్‌రెడ్డి(21) కత్తితో దాడి చేసి హత్య చేశాడు. వెంకటంరెడ్డి నివాసం వున్న ఇంట్లోనే ఈ ఘటన చోటు జరుగడంతో కుటుంబ వ్యవహారాల్లో ఏం జరిగిందో! తండ్రిని కుమారుడు ఎందుకు హత్య చేస్తాడు! తండ్రి ఏం చేయకుంటే కుమారుడు ఇలా చేస్తాడు! అని స్థానికుల్లో చర్చ ప్రారంభమైంది. చిత్తూరు టుటౌన్ ఇన్‌ఛార్జీ ఇన్స్‌పెక్టర్, వన్‌టౌన్ సిఐ మహేశ్వర్ వెల్లడించిన వివరాల మేరకు లెనిన్ నగర్‌లో టి.వెంకటరెడ్డి కుటుంబం నివాసం వుంటుంది. వెంకటరెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ఖరీఫ్ 2025 సీజన్ నుండి వ్యవసాయ శాఖ పూర్తి డిజిటలైజేషన్

**న చివాలయం,జూన్ 12,ప్రభాతవార్తప్రతి::** ఇథియోపియాకు చెందిన అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపట్టిన ఆధునిక డిజిటల్ పథకాల అధ్యయనం నిమిత్తం రాష్ట్రాన్ని సందర్శించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ 2.0అమలుపై వారు అవగాహన పొందారు.ఈ బృందం ఆర్టీజీఎస్ రాష్ట్ర కేంద్రాన్ని సందర్శించి, ఇన్‌పుట్ పంపిణీ, ఈ మార్కెట్ ప్లేస్ సమన్వయం వరకు జరిగే పూర్తి స్థాయి డిజిటల్ సేవల వ్యవస్థపై వివరాలను తెలుసుకున్నారు. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్నారు. ఈథియోపియా బృందానికి డిజిటల్ అగ్రికల్చర్ ఫైనాన్స్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీ గిరుమ్ కెటెమా టెక్లెమరియం నేతృత్వం వహించగా, మొత్తం 10 మంది సీనియర్ అధికారులు ఇందులో పాల్గొన్నారు.

# విధ్వంసం నుంచి.. వికాసంవైపు

## ఐటీ,విద్యాశాఖ మంత్రి నారాలోకేష్

**విజయవాడ,జూన్ 12,ప్రభాతవార్త బ్యూరో:** విధ్వంసం నుంచి వికాసం వైపునకు, రాష్ట్ర సర్కారు ప్రయాణం ప్రారంభించిందని, ఏడాది సుపరిపాలనతో అన్నింటా ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని,ఐటీ విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్రమోడీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో.. డబుల్ ఇంజన్ సర్కాం ఏడాదిగా అనేక విజయాలు సాధించిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనకు, ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రిలోకేష్ ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ప్రసంగించారు.

"పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో సాధించడం, కూటమి ప్రభుత్వ విజయంగా పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్ల పంపిణీ మన రాష్ట్రంలో జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథాకాల్లో భాగంగా, పాఠశాలలు ప్రాంరభించిన వెంటనే తల్లికి వందనం హామీ నిలబెట్టుకున్నామన్నారు. సమగ్ర సంక్షేమం,సంపూర్ణ అభివృద్ధి..అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. విధ్వంసక పాలననుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిందని, ప్రజాస్వామం గెలిచి రాష్ట్రమంతటా పండగ వాతావరణం ఉందన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపుకు రాష్ట్రం ప్రగతి ప్రయాణం సాగుతుందన్నారు. యువతకు ఉపాధి కల్పన రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యమన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తోందని మంత్రి తెలిపారు. డీఎస్సీని ఎట్టిపరిస్థితుల్లోనైనా ఆపాలని ప్రతిపక్ష పార్టీ సుమారు 24 కేసులు వేసిందన్నారు. గురువార నాటితో చివరి కేసు కూడా సుప్రీంకోర్టులో డిస్మిస్ అయిందని మంత్రి తెలిపారు. యువత ఉపాధి అవకాశాల మెరుగుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు వివిధ పారిశ్రామిక సంస్థలో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. డొమెస్టిక్ ఇన్వెస్ట్ మెంట్స్ లో ఏపీ భారతదేశంలోనే నెంబర్ వన్ గా ఉందని మంత్రి లోకేష్ చెప్పారు. ఆమేరకు 16శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయని, ఇందులో భాగంగా టీసీఎస్, ఎల్జీ, ఎన్టీపీసీ గ్రీన్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్, రిలయన్స్ రెన్యూ పవర్ లాంటి సంస్థలు ఈ రోజు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు.

# పశుసంవర్ధక శాఖలో బదలీల ప్రక్రియపై పునఃసమీక్ష చేయాలి:

## ఆంధ్రప్రదేశ్ యానిమల్ హస్బండరీ గెజిటెడ్ ఆఫీసర్స్ జెఎసి

**విజయవాడ, జూన్ 12, ప్రభాతవార్త :** పశుసంవర్ధక శాఖలో జరుగుతున్న బదిలీ ప్రక్రియను పునఃసమీక్ష చేయాలని, ఏపి యానిమల్ హస్బండరీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఏపి పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న తన భార్య డా పద్మలీలకు అన్యాయం చేశారని వివరించడానికి వచ్చిన డా సురేష్‌పై పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర నాయుడు యొక్క దురుసు ప్రవర్తన ను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ యానిమల్ హ్బాండ్రి గెజెటెడ్ ఆఫీసర్స్ జెఎసి తెలిపింది. జిఓ 23 ప్రకారం జరగాల్సిన బదిలీలు నిబంధనలు తుంగలో తొక్కి అడ్డదారిలో రాజకీయ నాయకుల సిఫార్సు లెటర్లున్న వారికి మాత్రమే అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. తాము ఎన్నిసార్లు బదిలీల ప్రక్రియ పారదర్శకంగా వుండాలని వినతి చేసుకున్నా ప్రయోజనం లేదంటూ వాపోయారు. పైగా తమను టార్గెట్ చేస్తామని డైరెక్టర్ దామోదర్ నాయుడు బెదిరింపులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. బదిలీ చేయడానికి కావాల్సిన ఏళ్ళు పూర్తవకుండానే తనను వర్కింగ్‌ప్లేస్ నుండి తీసేశారని విశాఖలో పనిచేస్తున్న డా పద్మలీల తన భర్త డా సురేష్‌తో కలిసి విజయవాడలోని డైరెక్టర్ దామోదరనాయుడు కు వివరించే సమయంలో దామోదరనాయుడు డా సురేష్‌పై చేయిచేసుకోడానికి పయత్నించారని, అభ్యర్ధనలు వినకపోగా తమపై చేయిచేసుకోడానికి ప్రయత్నిండాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## కాస్మటిక్ చార్జీలు నేరుగా విద్యార్థుల అకౌంట్‌లోకి

## 4 నెలల అద్దె బకాయిలు విడుదల

## వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా బిసి గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల భవితను ఉన్నతంగా తీర్చిదిద్దాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కాస్మటిక్ చార్జీలు నేరుగా విద్యార్థుల అకౌంట్‌లోకి వేయనున్నట్టు తెలిపిన మంత్రి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం, వసతి అందించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధనుపెట్టి.. హెల్త్ ప్రొఫైల్ తయారుచేయాలన్నారు. బిసి సంక్షేమ శాఖ అధికారులతో మంద్రి పొన్నం ప్రభాకర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఎంజెపి సెక్రటరీ బడుగు సైదులు, ఎంబిసి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సిఇవో అలోక్ కుమార్, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ ఇందిర పాల్గొన్నారు. గురువారం నుంచి 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి నాణ్యమైన విద్యతో పాటు ఆరో గ్యకరమైన ఆహారం, వసతి సదు పాయాలు కల్పిం చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాల విద్యను అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన సూచించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన, విద్యాబోధనలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డన్స్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ విద్యార్థుల భవితవ్యం కోసం శాయశక్తుల కృషి చేయాలన్నారు. దేశం గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. రేపటి భవిష్యత్ నేటి విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, బిసి సంక్షేమ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగునెలల అద్దె బకాయిలు విడుదల చేసిందని.. భవనాల యజమానులతో సంప్రదించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాలలో, హాస్టల్‌లో పరిశుభ్రత పాటించాలని, దోమల నుంచి రక్షణ కోసం నెట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, వసతి సామాగ్రి వెంటనే అందించాలని మంత్రి సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు వారి కాస్మటిక్ చార్జీలు నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని.. ఇందుకు సంబంధించి విద్యార్థులు అందరికి బ్యాంక్ అకౌంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ.. వారి నెలవారి ఆరోగ్య పట్టికను సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో బిసి గురుకులాలు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఫస్ట్ ప్లేస్‌లో ఉండేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# నేడు దోస్త్-2025 రెండో విడత సీట్ల కేటాయింపు

## 35,954 మంది రిజిస్టర్.. 46,886 మంది వెబ్‌ఆప్షన్లు

## 18లోపుగా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) -2025లో రెండో విడత సీట్ల కేటాయింపు నేడు(శుక్రవారం) చేయనున్నారు. ఇప్పటికే మొదటి విడత సీట్ల కేటాయింపు చేయగా.. అందులో 41,285 మంది కాలేజీల్లో చేరడానికి సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. రెండో విడతలో రిజిస్ట్రేషన్స్ కి అవకాశం ఇవ్వగా.. వారిలో ఫీజు చెల్లించిన వారు వెబ్ ఆప్షన్లను ఇచ్చిన వారిని నేడు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. రెండో విడతలో 35,954 మంది రిజిస్టర్ చేసుకోగా వారిలో 33,409 మంది ఫీజును చెల్లించారు. 34,276 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. రెండో విడతలో 46,886 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వారికి నేడు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన వారు ఈ నెల 18 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. మూడో విడత రిజిస్ట్రేషన్లను ఈ నెల 13 నుంచి 19 వరకు అవకాశం కల్పించారు దోస్త్ అధికారులు. దరఖాస్తు సమయంలోనే వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈనెల 23న సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన వారు ఈ నెల 23 నుంచి 28 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అన్ని ఫేజుల్లో సీట్లు పొందిన వారు ఈ నెల 24 నుంచి 28 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూన్ 30 నుంచి సెమిస్టర్-1 క్లాసులను ప్రారంభించనున్నారు. మొదటివిడతలో 89,468 మంది రిజిస్టర్ చేసుకోగా .. వారిలో 83,119 మంది ఫీజు చెల్లించారు. అందులో 77,012 మంది దరఖాస్తు చేశారు. వారిలో 65,190 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. అందులో 60,428 మందికి సీట్ల కేటాయింపు చేశారు. కాలేజీల్లో సీటు అలాట్ అయిన వారిలో మంగళవారం మధ్యాహ్నం వరకు 41,285 మంది సెల్ఫ్ రిపోరింగ్ చేశారు.

# ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాల్సిందే

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌తో మున్నూరుకాపు నేతల భేటీ

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తను ఎప్పుడు ఏ పదవులు ఇచ్చి ఉపయోగించుకోవాలో.. అప్పుడు వారికి అవకాశాలు ఇచ్చి వారి సేవలు తీసుకొంటుందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సామాజిక న్యాయం కోసం పాదయాత్ర చేయడమేకాదు తెలంగాణలో కులగణన చేసి దేశంలో కులగణన జరపడానికి మార్గదర్శిగా నిలిచారని, అన్ని సామాజికవర్గాల రాజకీయ అభ్యున్నతి కోసం మన నాయకుడు పాటు పడుతున్నారని అన్నారు.

గురువారం 33 జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన మున్నూరు కాపు సంఘం నాయకులు మున్నూరకాపు సామాజికవర్గానికి చెందిన ఆదిశ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గాంధీభవన్ వచ్చిన నాయకులతో ఆయన సమావేశయ్యారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంచి భవిష్యత్ ఉందని అధినాయకత్వం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొంటుందని మహేష్‌కుమార్ మున్నూరు కాపులను సముదాయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ మీనాక్షినటరాజన్‌కు, ఎఐసిసి చీఫ్ మల్లి కార్జునఖర్గే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామిచ్చారు.

# సెరికల్చర్‌పై గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అందని కేంద్ర నిధులు

## నియామకాలతో పట్టుపురుగుల సాగు బలోపేతం

## రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** సెరికల్చర్‌పై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారించడంతో సెంట్రల్ ప్రభుత్వం నుంచి నిధులు పొందలేక పోయామని రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచడానికి ఎంతగానో తోడ్పాటు నిచ్చే ఈ సాగును ప్రోత్సహిస్తామని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. గురువారం బిఆర్కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీరెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్ తో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమావేశమయ్యారు. సెరికల్చర్ డిపార్టు మెంట్‌లో త్వరగా నియమాకాలు చేపట్టేందుకు ప్రభుత్వంకు సూచిస్తామని ఆయన వివరించారు. గత పదేండ్ల కాలంలో సెరికల్చర్ డిపార్ట్ మెంట్ నిర్లక్ష్యానికి గురైందని, నియామకాలు చేపట్టకపోవడం, నిధులు కేటాయించక పోవడంతో సెరికల్చర్ విభాగం నిర్వీర్య పరిస్థితికి వచ్చిందని అధికారులు కమి షన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇక గత ప్రభుత్వంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో సెరికల్చర్‌ను కలపడం వల్ల సెరికల్చర్ మనుగడకే ప్రమాదంగా మారిందని వివరించారు. జిల్లా స్థాయిలో కూడా అధికారుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో పట్టుపురుగుల సాగులో మంచి లాభాలున్నా.. పట్టించుకోలేదని, పట్టు పరుగుల సాగుతో రైతులు లాభపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కమిషన్ చైర్మన్, సభ్యులకు సెరికల్చర్ అధికార యంత్రాంగం వివరించింది. ముఖ్యంగా సెరికల్చర్ డిపార్ట్ మెంట్‌లో గత కొన్నేళ్లుగా నియామకాలు చేపట్ట లేదని, రాష్ట్రవ్యాప్తంగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల సంఖ్య 60 మందే వున్నారని తెలి పారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా పట్టు పురుగుల సాగుకు నిధులు కూడా తీసుకోవచ్చని, తెలంగాణలో సిల్క్ దుస్తువుల డిమాండ్ ఉందని తెలిపారు. సెరికల్చర్ అధికారులు తెలిపిన వివరాలను విన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్.. సెరికల్చర్ డిపార్మెంట్ లో పేరుకుపోయిన సమస్యలు, అభివృద్ధి చేయడానికి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు.



అభివాదం చేస్తున్న రాజారాంయాదవ్, మేకల రాములుయాదవ్, తదితరులు

# యాదవ, కురుమలకు మంత్రి పదవి ఇవ్వాలి

## లేకుంటే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తాం

## యాదవ కురుమ సంఘాల జెఎసి

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** యాదవకురుమలకు మంత్రి పదవి కేటాయించకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి. రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో యాదవకురుమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించిన యాదవుకురుమలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపించిందని ఆరోపించారు. ప్రభుత్వ పదవులను పక్కన పెడితే కనీసం నామినేటెడ్ పదవుల్లోనూ యాదవ కురుమలకు స్థానం కల్పించకుండా యాదవ కురుమలను అవమానించారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకొని ఇప్పటివరకు యాదవ కురుమలు మంత్రిగా లేని క్యాబినెట్ లేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరోవైపు యాదవకురుమలకు మంత్రి పదవి కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దలు దిగి రాకపోతే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈనెల 27న ఇందిరాపార్కు దగ్గర నిర్వహిస్తున్న యాదవకురుమల ఆత్మగౌరవ సభకు జెండాలు, అజెండాలు పక్కనపెట్టి సంఘాలకు అతీతంగా హైదరాబాద్ కు యాదవ కురుమలు పెద్ద ఎత్తున తరలిరావాలని రాములు యాదవ్ విజ్ఞప్తి చేశారు. యాదవులు పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని యాదవులను ఆదరిస్తే కాంగ్రెస్ పార్టీని అక్కున చేర్చుకుంటారని అన్నారు.

# ఆటో మీటర్‌చార్జీలు పెంచడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ఆటో మీటర్‌చార్జీలు, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డుతోపాటు ఇతర పెండింగ్ లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్యెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ పరిధిలో కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ జిఓ జారీ చేసేందుకు కృషి చేసిన కూనంనేని సాంబశివ రావుకు తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు సిహెచ్ జంగయ్య, ఎండి ఒమర్ ఖాన్, ఎస్కె లతీఫ్, ఎం శ్రీనివాస్ (ఎఐటియుసి), వి ప్రవీణ్, లింగం (టియుసిఐ), వి మారయ్య, మహేష్ (బిఆర్‌టియు,) పి శ్రీకాంత్, అజయ్‌బాబు (సిఐటియు), పి యాదగిరి (టీఎస్టీయూసీ) పాల్గొన్నారు. జేఏసీ కన్వీనర్ బి వెంకటేశం ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ఆటో మీటర్‌చార్జీలు పెంచడం, ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ రూ.12.000 ఆర్థిక సహాయం, ఆటో రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఓలా, ఊబర్, రాపిడోల నుండి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించడం వంటివి తక్షణమే పరిష్కరించడానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో చేర్చించి పరిష్కరానికి కృషి చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై కూనంనేని తీవ్ర దిగ్భ్రాంతి**

గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. విమానం పడిన భవనంలో నివసిస్తున్న మెడికల్ విద్యార్థు సైతం చనిపోవడం తీవ్రంగా కలచి వేసిందన్నారు. . చనిపోయిన ప్రయాణికులకు, విద్యార్థులకు, సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కూనంనేని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా దేశ పౌర విమానయాన శాఖ కట్టుదిట్టమైన నిర్వహణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పంచాయతీ ట్రాక్టర్లకు సైతం డీజిల్ లేని దుస్థితి

## పంచాయతీలకు 16 నెలలుగా నిధులు అందడం లేదు: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 12:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గ్రామ పంచాయతీలకు గత 16 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కావడం లేదని హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. నిధుల కొరత కారణంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను నడిపేందుకు కూడా డీజిల్ లేని దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలను ఉన్నతాధికారులకు అప్పగించేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మారితే మార్పు వస్తుందని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, అయితే ఇప్పుడు గ్రామాల్లో కనిపిస్తున్న ఈ దుస్థితేనా ఆ మార్పు? అని హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

'ఇది మార్పు కాదు, ఏమార్పు' అంటూ ఆయన తన పోస్టులో ఎద్దేవా చేశారు. గ్రామ స్వరాజ్యానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మాత్రం గ్రామాలకు నిధుల కటకట ఏర్పడిందని హరీశ్ రావు ఆరోపించారు. ఈ నిధుల కొరత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కర్షకుల ప్రయోజనార్థం కొత్త వ్యూహాలు అమలు చేయాలి



వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, పాత్రికేయుడు పాశం యాదగిరి, మాజీ ఐఎఎస్ వి. నాగిరెడ్డి, పూర్వ ఉపకులపతి రఘువర్ధన్‌రెడ్డి తదితరులు

## వ్యవసాయ విశ్వవిద్యాలయం 61వ వ్యవస్థాపక దినోత్సవంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**హైదరాబాద్ అత్తాపూర్) జూన్ 12, ప్రభాతవార్త :** వ్యవసాయ విశ్వవిద్యాలయం 61వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం రాజేంద్రనగర్‌లోని విశ్వ విద్యా లయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతి థిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం 'అద్భుతమైన వార సత్వం, భవిష్యత్తు సవాళ్లు'పై ఆయన ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చాక దేశ ఆహార అవసరాలు తీర్చే ఉద్దేశంతో అన్ని రాష్ట్రాల్లోనూ వ్యవసాయ విశ్వవిద్యా లయాలు ఏర్పడ్డాయని, అందులో భాగంగానే హైదరాబాద్‌లోనూ 1964లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైందారు. ఆ విశ్వవిద్యాలయం రూపొం దించిన ఎన్నో వంగడాలు దేశ వ్యాప్తంగా ఆదరణ పొందాయన్నారు. దేశంలో అమలుచేసిన భూసంస్కరణలు, హరిత విప్లవాలు సత్ఫలితాలు ఇచ్చినప్పటికీ కొన్ని అసమానతలకు కారణం అయ్యాయని కోదండరాం వివరించారు. ప్రత్యేక తెలంగాణ సహకార మైనందున సన్న, చిన్నకారు రైతాంగ సమస్యలపై ప్రత్యేకదృష్టి పెట్టా లని ఆయన విశ్వవిద్యాలయానికి సూచించారు. సన్న, చిన్నకారు రైతాంగానికి ప్రయోజనకరమైన నూతన వ్యూహాల్ని అనుసరించాలని కోదండరాం సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ మధ్య నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కోదండరాం అభినందించారు. వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయం తీవ్రమైన మార్పు లకు లోను కానుందని ప్రముఖ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. నేడు నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు కుదేలవుతున్నారని, భూసారం క్షీణిస్తుందన్నారు. విశ్వవిద్యాలయం తెలంగాణ సాంప్రదాయ పంటలు, చిరుధాన్యాలపై పరిశోధనలు చేసి రైతాంగానికి ఉపయోగపడాలని పాశం యాదగిరి సూచించారు. రైతు, వ్యవసాయం సుభిక్షంగా ఉండాలంటే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఐఏఎస్ వి. నాగిరెడ్డి అన్నారు. తెలంగాణ పరిస్థితుల నేపథ్యంలో సమర్ధ నీటి యాజమాన్యం అత్యవసరం అని విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి డాక్టర్ రఘువర్ధన్ రెడ్డి అన్నారు. దేశంలో ఏర్పాటైన రెండవ వ్యవసాయ విశ్వవిద్యాలయ 61వ వ్యవస్థాపక దినోత్సవం తన హయాంలో నిర్వహించడం తనకు చాలా సంతోషాన్నిస్తుందని పిజెటిఎయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. తాను ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వ్యవస్థల్ని పునర్ వ్యవస్థీకరిస్తూ కొత్త విభాగాల్ని ఏర్పాటు చేశానన్నారు. ఈ సందర్భంగా 60 యేళ్ల విశ్వవిద్యాలయం ప్రస్థానానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అలాగే ఒక విడియోను ప్రదర్శించారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత

## పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి నైతిక బాధ్యతగా భావించాలని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచబాల కార్మిక దినోత్సవం స్ఫూర్తితో బాల బంగరు భవిష్యత్‌కు పునరంకితం కావాలని ఆయన కోరారు. బాల కార్మిక వ్యవస్థను శాశ్వతంగా అంతం చేయాలంటే చట్టాలతో పాటు సామాజిక చైతన్యం అవసరమని అన్నారు. విద్యాసంస్థల పనివేళలలో 18ఏళ్ళ వరకు ప్రతి బాలబాలికలు,యుక్తవయస్సు పిల్లలు బడిలో,కాలేజిలో విద్యాభ్యాసం కోసం ఉండాలని పనిలో ఉండకూడదని ఆయన అన్నారు. బాలల భవిష్యత్ కాపాడడం మన అందరి సామాజిక బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. బడీడుపిల్లలతో ఎవరు కూడా కూలీ పనులు చేయించకూడదని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రఫుల్ రామ్‌రెడ్డి

# 'గద్దర్ ఫిలిం అవార్డులను ఆంధ్ర సినిమాలకు ఇవ్వొద్దు'

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 12, ప్రభాతవార్త:** ప్రజాగాయకుడు గద్దర్ పేరిట ఇచ్చే గద్దర్ ఫిలిం అవార్డులను ఆంధ్ర సినిమాలకు ఇవ్వరాదని తెలంగాణ సినిమా వేదిక (టిసివి) డిమాండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, కోర్టుకు శుక్రవారం తమ వాదనలను వినిపించ బోతున్నామని, కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందనే తాము భావిస్తున్నామని వేదిక ప్రతినిధులు అశాభావం వ్యక్తం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, కన్వీనర్ లారా, కో-కన్వీనర్ మోహన్‌బైరాగి మాట్లాడుతూ తెలంగాణ వచ్చి 12 సంవత్సరాలు అవుతున్నా, సినిమా రంగంలో ఆంధ్ర సినీపెద్దల ఆధిపత్యం ఇంకా కొన సాగుతున్నదని, ఎపి సిఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఏకమై తెలంగాణ సినిమా రంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపిం చారు.

# కెటిఆర్, కౌశిక్‌రెడ్డిపై సైబర్ పోలీసులకు కాంగ్రెస్ ఫిర్యాదు

## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం తప్పదు

## సిఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశా రని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సెక్రటరీకి కూడా కెటిఆర్,కౌశిక్‌రెడ్డిలపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే,ప్రజలే ఆయనకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని సామాజిక మాధ్యమాల్లో కౌశిక్‌రెడ్డి అనుచిత పోస్టులు పెట్టారని ఫిర్యాదు చేశామని వివరించారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వీరిద్దరి చర్యలు ఉన్నాయని ఆయన అభ్యంతరం తెలిపారు. రాజకీయాల్లో సున్నితంగా ఉండే వాతవార్ణం దెబ్బతీసేందుకు కెటిఆర్‌కు ఉబలాటం ఎక్కువగా ఉందని ఆరోపించారు. కెటిఆర్ చేసిన తప్పులకు జైలు కు వెళ్ళే రోజు వస్తుందని జోస్యం చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ ప్రభుత్వం లెక్కా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదని ఆయన అన్నారు. జరిగిన తప్పులపై చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కెటిఆర్ గత ప్రభుత్వ అసెంబ్లీలో సంస్కారం గురించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ను తిట్టొద్దని నీతులు చెప్పాడని గతంను గుర్తుచేసుకున్నారు.మరి ఇవాళ నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై నువ్వు మాట్లాడుతున్నా భాష ఎలాంటిదో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు.ఆనాడు నీతులు చెప్పిన కేటీఆర్ ఇప్పుడు, రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని తిడుతున్న మాటలకు సమాధానం చెప్పాలి. తెలంగాణను దోచుకున్న దోపిడిదొంగల కుటుంబం, కల్వకుంట్ల కుటుంబ అని ఆయన అభివర్ణించారు. రేవంత్ రెడ్డి రైతు బిడ్డ, ప్రజల పక్షాన ప్రతిపక్ష నేతగా పోరాటం చేసి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. కెటిఆర్ నువ్వు ఇలాగే మాట్లాడితే నిన్ను రోడ్లమీద బట్టలు ఊడదీసి కొడతారని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.కెటిఆర్ చూసుకుని సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న కొందరు బిఆర్ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెప్తాం అని హెచ్చరించారు.నువ్వు చేసిన తప్పులను, తప్పుడు టీడీఆర్ లను బయటపెట్టి నీ అవినీతి, చీకటి పనులను బట్టబయలు చేస్తాం అని హెచ్చరించారు.తెలంగాణ కోసం కెసిఆర్ చేసింది ఏమి లేదు, ప్రజా పోరాటం తోనే తెలంగాణ వచ్చింది.తెలంగాణ అమరవీరులను అవమానించిన చరిత్ర కెసిఆర్‌ది.కెటిఆర్ భేషరతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి క్షమాపణలు చెప్పాలి.కౌశిక్ రెడ్డి లాంటి నేతలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలే బట్టలు ఊడదీసి కొడతారు.చట్టానికి ఎవరూ అతీతులు కారు, ఎవరైనా కమిషన్ ముందు హాజరు కావాల్సిందే అని ఆయన అన్నారు.

# కెసిఆర్ కుటుంబాన్ని చూసి ఘోషిస్తున్న అమరవీరుల ఆత్మలు

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:** కెసిఆర్ కుటుంబాన్ని చూసి అమర వీరుల ఆత్మలు ఘోషిస్తున్నాయని,అక్రమంగా సంపాదించిన అవినీతి డబ్బు బలుపుతో కెటిఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ సాఫ్ట్ వేర్ సంస్కారం ఇదేనా? నీ అయ్య నేర్పిన సంస్కారం ఇదేనా?! అని నిలదీశారు. కెటిఆర్ నీ అయ్య ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా? కల్వకుంట్ల కుటుంబం కంటే స్టువర్ట్ పురం దొంగలు నయం అని తీవ్ర పదజాలంతో విమర్శలు చేశారు. కెటిఆర్‌ను తిట్టాలంటే మాకు సంస్కారం అడ్డు వస్తోందని అన్నారు. ఏ శాఖను వదిలిపెట్టకుండా కల్వకుంట్ల కుటుంబం అడ్డదిడ్డంగా దోచుకుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయమని ఆరోపణలు చేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సిగ్గులేకుండా కేసీఆర్ వెంట తిరుగుతున్నాడని దుయ్యబట్టారు .వరంగల్ లో కబ్జా చేసి బిఆర్ఎస్ ఆఫీసు కట్టుకున్నారని ఆరోపించారు. నా పైన బిఆర్ఎస్ ప్రభుత్వం 36 కేసులు పెట్టి వేధించిందని అయన గుర్తుచేసుకున్నారు. ఇన్ని అక్రమాలు చేసిన కల్వకుంట్ల కుటుంబం ఇంకా జైలుకు వెళ్లడం లేదనే బాధ మాకుందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కక్ష సాధింపు చర్యలు వద్దు ఓపిక గా ఉండాలని మా సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారని ఆయన తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి మంచితనం వల్లనే కల్వకుంట్ల కుటుంబం ఇప్పటి వరకు జైలుకు వెళ్లలేదని ఆయన అన్నారు. ఏనాటికైనా కల్వకుంట్ల కుటుంబం ఊచలు లెక్క పెట్టాల్సిందే..ఆంధ్ర ప్రదేశ్ లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జైళ్లకు పంపిస్తున్నారు.గుర్తు పెట్టుకోండి తిన్నది కక్కించడానికే కెసిఆర్ ను కాళేశ్వరం కమిషన్ విచారణకు పిలిచింది. తప్పు చేసిన వారు కమిషన్ ముందుకు వెళ్లాల్సిందే అని ఆయన అన్నారు.

# 'మెగా157' రెండవ షెడ్యూల్

మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగా157తో అలరించబోతున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటిస్తోంది. హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్‌ను ఇప్పటికే ముగించింది టీమ్. ఈ షెడ్యూల్ లో చిరంజీవి పాల్గొన్నారు. రషెస్ అద్భుతంగా ఉన్నాయి. 1990, 2000లలో చిరంజీవి గోల్డెన్ ఎరాలో కనిపించిన వింటేజ్ మెగాస్టార్ కామెడీ టైమింగ్‌ను ఈసారి మళ్లీ చూపించ



బోతున్నారు. ఇది అభిమానులకు ఒక విజువల్ ట్రీట్. మెగా157 రెండవ షెడ్యూల్ ముస్సోరీలోని బ్యూటీఫుల్ హిల్ స్టేషన్‌లో ప్రారంభమవుతుంది. ఈ10 రోజుల షెడ్యూల్‌లో మెగాస్టార్ చిరంజీవి, నయనతార, వీటీవీ గణేష్, తదితరులు ప్రధాన తారాగణం పాల్గొంటారు. చిత్ర బృందం కొన్ని కీలకమైన, వినోదాత్మక సన్నివేశాలను చిత్రీకరిస్తుంది. సైరా నరసింహారెడ్డి, గాడ్‌ఫాదర్ తర్వాత నయనతార చిరుతో కలిసి మూడోసారి నటించనుంది. మెగాస్టార్ చిరంజీవి ఒక స్కూల్ గ్రౌండ్‌లో టేబుల్ మీద కూర్చొని వుండగా, పిల్లలు తనవైపు పరుగెత్తుకుంటూ వస్తుండగా ఆయన థంబ్స్ అప్ ఇస్తూ ప్రజెంట్ చేసిన ఒక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ విజువల్ చాలా ప్లజెంట్‌గా వుంది. భీమ్స్ సిసిరోలియో అద్భుతమైన సంగీతం మరింత జాయ్‌ని యాడ్ చేసింది. ఈ వీడియోలో చిరంజీవి చరిస్మాటిక్ ప్రజెన్స్ కట్టిపడేసింది. ఇటీవల వచ్చిన ఫెస్టివల్ ఎంటర్‌టైనర్ సంక్రాంతికి వస్తున్నాంతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి, తన ట్రేడ్‌మార్క్, క్రియేట్ ప్రమోషన్స్‌తో మెగా157పై ఇప్పటికే ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు.

# 'బ్రిస్బేన్‌లో ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో ఎన్నారై టిడిపీ, స్థానిక తెలుగు సంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం, తెలుగుదేశం మినిమహానాడు, సిబిఎన్ 75వ జన్మదినం వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక తెలుగు దేశం పార్టీ అభిమానులతో పాటు ఇండియా నుండి శ్రీ నారా రోహిత్, మాజీ మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎన్టీఆర్ తనయులు శ్రీ నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, టిటిడి బోర్డు సభ్యులు శ్రీ నన్నూరి నర్సిరెడ్డి, శ్రీ అశ్విన్ అట్లూరి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ మరియు తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ టి.డి.జనార్ధన్ పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్‌కు పూలదండ, కేక్ కట్టింగ్, ఎన్టీఆర్, శ్రీ నారాచంద్రబాబు నాయుడు గార్లపై ఇటీవల వెలువడిన పుస్తకాల ఆవిష్కరణ మొదలైన కార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేక అతిథి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ నందమూరి తారకరామారావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన రాజకీయ ప్రస్థానంలో వివిధ సందర్భాలలో అన్నగారితో తను మాట్లాడిన సంఘటనలను చెబుతూ ఎన్టీఆర్ వ్యక్తిత్వంలోని గొప్పదనం తెలియజేశారు. శ్రీనన్నూరి నర్సిరెడ్డి తనదైన శైలిలో అనర్గళంగా ఎన్టీఆర్, చంద్రబాబు గురించి ప్రస్తావించారు. శ్రీ అశ్విన్ అట్లూరి, శ్రీ నారా రోహిత్‌లు ప్రసంగించారు. చివరిగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ శ్రీ టి.డి.జనార్ధన్ మాట్లాడుతూ 2023లో ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా తాము ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల్లోనే కాక ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు వున్న ప్రతిచోట శ్రీ ఎన్.టి. రామారావుకు సంబంధించిన పలు కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని, ఆ సందర్భంగా ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవితానికి సంబంధించిన పలు గ్రంథాలను వెలువరిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు తొలుత విజయవాడలో, ఆ తర్వాత హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తాము చేస్తున్న ఈ కార్యక్రమాలకు శ్రీ నారాచంద్రబాబు నాయుడు, శ్రీ నారా లోకేష్, శ్రీ బాలకృష్ణ, తెలుగు



దేశం నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు సహకరిస్తున్నట్లు శ్రీ జనార్ధన్ తెలిపారు. గత ఏడాది కాలంగా ఎన్టీఆర్ 75 ఏళ్ల సినీరంగ ప్రస్థానాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్ని నిర్వహిస్తున్నామని, అయితే గల్ఫ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలోని వివిధ నగరాలలో వున్న ఎన్నారై తెలుగుదేశం విభాగాలు, అక్కడున్న తెలుగు సంఘాలు... ఈ ఉత్సవాల్ని తమ వద్ద కూడా నిర్వహించాలని ఆహ్వానించడంతో వారందరితో కలిసి ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఈ బృహత్తర కార్యక్రమాల్ని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు.



# 'వార్ 2' డబ్బింగ్ షురూ

అయాన్ ముఖర్జీ దర్శకత్వంతో యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం వార్ 2. ఈ మూవీని ఆగస్ట్14న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇక ఈ ఏడాదిలో అందరూ ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌ల్లో వార్ 2 మొదటి స్థానంలో నిలుస్తుంది. ఈ భారీ పాన్‌ఇండియా యాక్షన్ దృశ్యాన్ని చూసేందుకు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన వార్ 2 టీజర్ దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ టీజర్ ఒక్కసారిగా సినిమా మీద అంచనాల్ని పెంచేసింది. ఇక తాజాగా వార్ 2 డబ్బింగ్ పనుల్ని షురూ చేశారు.ప్రస్తుతం ఎన్టీఆర్ ఈ మూవీ కోసం డబ్బింగ్ చెప్పేస్తున్నారు. ఈ మేరకు రిలీజ్ చేసిన వీడియో అందరినీ ఆకట్టుకుంటోంది. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ వార్ 2 వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో ఆరవ భాగంగా రాబోతోంది. వార్ 2లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీలు ప్రధాన పాత్రలను పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో అడ్రినలిన్‌పంపింగ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వబోతోన్నారు. ఈ చిత్రం ఆగస్టు 14, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# 'మిత్ర మండలి' టీజర్ రిలీజ్

బన్నీ వాస్ నూతన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం మిత్ర మండలి. అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్‌కు విశేష స్పందన లభించింది. ఈ చిత్రం అపరిమిత వినోదాన్ని అందించనుందనే నమ్మకాన్ని పోస్టర్ కలిగించింది. తాజాగా మిత్ర మండలి టీజర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జూన్ 12 ఉదయం హైదరాబాద్‌లోని ఏఏఏ సినిమాస్‌లో జరిగింది. ఈ వేడుకకు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్వరలో థియేటర్ల లో నవ్వుల పండుగ రాబోతుందని చాటిచెప్పేలా మిత్ర మండలి టీజర్ ఉంది. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా పోటాపోటీగా టీజర్‌లో నవ్వులు పంచారు. క్రికెట్ తరహా కామెంటరీతో టీజర్ ను వినోదభరితంగా మలిచిన తీరు ఆకట్టుకుంది. బ్యాట్ లేకుండా క్రికెట్ ఆడతారు.. బోర్డు లేకుండా క్యారమ్స్ ఆడతారు.. రోజూ ఎవరో ఒకర్ని ఎర్రిపప్పని చేస్తారు అంటూ ప్రధాన పాత్రధారులు ఎలాంటి హాస్యాన్ని పంచబోతున్నారో చెప్పకనే చెప్పేశారు. ఇక టీజర్‌లో



వెన్నెల కిషోర్, సత్య మధ్య కామెడీ డైలాగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆద్యంతం నవ్వులు పంచుతున్న ఈ ఖిమిత్ర మండలిఖి టీజర్.. నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీజర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, బన్నీ వాసు సమర్పిస్తున్న మొదటి సినిమాగా, నా మిత్రులందరూ కలిసి తీసిన ఈ మిత్ర మండలి టీజర్‌ను లాంచ్ చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. నేను యంగ్ స్టర్స్‌తో ఎక్కువగా టైం స్పెండ్ చేస్తుంటాడు. దాని వల్ల స్క్రిప్ట్ ఎంపిక వంటి విషయాల్లో ఎంతో హెల్ప్ జరుగుతుంటుంది. ఒకసారి వాసు ఈ కథ వినమని దర్శకుడిని నా దగ్గరకు పంపించాడు. కానీ, మీ ముందు కథ చెప్పలేకపోతున్నాను అని దర్శకుడు వెళ్ళిపోయాడు. నేను కథ వినకుండానే, నేరుగా ఈ సినిమా చూడబోతున్నాం. వీరందరి మాటలు వింటుంటే.. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది. ప్రియదర్శి మాకు ఒక వెబ్ సిరీస్ చేశాడు. నిర్మాతలతో నాకు మంచి అనుబంధం ఉంది. టీజర్ చాలా బాగుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకంటూ, చిత్ర బృందానికి ఆల్‌ది బెస్ట్ అన్నారు. అతిథి, దర్శకుడు అనుదీప్ కె.వి. మాట్లాడుతూ, ఈ మిత్ర మండలి చిత్ర దర్శకుడు విజయ్ నాకు స్నేహితుడు. అవుట్ అండ్ అవుట్ కామెడీతో ఈ స్టోరీ రెడీ చేసుకున్నాడు. రైటింగ్ క్రేజీగా ఉంటుంది. సినిమా మొదటి నుంచి చివరి వరకు మీరు ఎంజాయ్ చేస్తూనే ఉంటారు.




# 'కుబేర' నుంచి 'పి పి డుమ్ డుమ్ సాంగ్

ధనుష్, నాగార్జున, శేఖర్ కమ్ముల కుబేర సినిమా ప్రమోషన్స్ పాన్‌ఇండియా స్థాయిలో జరుగుతున్నాయి. మూవీ టీం వివిధ నగరాల్లో పర్యటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రమోషన్లలో భాగంగా, ఈ సినిమా నుండి థర్డ్ సింగిల్ పీ పీ డుమ్ డుమ్ ముంబైలో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ ట్రాక్‌ను అఫీషియల్‌గా పబ్లిక్‌కి రిలీజ్ చేశారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ పెప్పీ బీట్స్‌తో ఈ ట్రాక్‌ను అద్భుతంగా కంపోజ్ చేశారు. ఈ కంపోజిషన్ సింగిల్ లైఫ్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఈ పాట రష్మిక మందన్న పాత్ర చుట్టూ చిత్రీకరించారు. ఆమె గర్ల్స్ హాస్టల్‌లో తన గ్యాంగ్‌తో కలిసి సింగిల్‌గా ఉండటమే హాయిగా జీవించడానికే మార్గం అనే సందేశాన్ని చెప్పడం అలరించింది. చైతన్య పింగళి రాసిన సాహిత్యం అద్భుతంగా వుంది. ఇంద్రావతి చౌహాన్ తన వాయిస్‌తో పాటకు జీవం పోసింది. రష్మిక తన పాత్రలో ఒదిగిపోయింది. పెళ్లికి ఒత్తిడి చేసేవారి మాటలతో ప్రభావితం కాకుండా ఉండే ప్రతి అమ్మాయి స్ఫూర్తిని ప్రజెంట్ చేసింది. కుబేరలో ప్రతి పాట డిఫరెంట్‌గా ఉంటూ కథ నేపథ్యాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. దేవీ శ్రీ ప్రసాద్ సూపర్ హిట్ ఆల్బం అందించారు. ఈ చిత్రానికి తగిన భావోద్వేగాలు, జోనర్‌కు తగ్గట్టు పాటలు రూపొందించి, కథను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లేలా చేశారు.



# '8 వసంతాలు' సెకండ్ సింగిల్

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 8 వసంతాలు ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్‌సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ అందమా అందమా చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. సెకండ్ సింగిల్ పరిచయమిలా సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. సోల్ ఫుల్ నెంబర్స్‌కి పాపులరైన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఒక బ్యూటీఫుల్ మెలోడీగా స్వరపరిచారు. వనమాలి రాసిన సాహిత్యం అద్భుతంగా వుంది. వెటరన్ సింగర్ కేఎస్ మెలోడీస్ వాయిస్ ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేసింది. ఆమె మాగ్నటిక్ వాయిస్‌తో సాంగ్ నెక్స్ట్‌కి వెళ్ళింది. సాంగ్‌లో విజువల్స్ చాలా ప్లజెంట్‌గా వున్నాయి. నవీన్ యెర్నేని,వై రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. అరవింద్ ములే ప్రొడక్షన్ డిజైన్‌ను, శశాంక్ మాలి ఎడిటింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. బాబాసాయి కుమార్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను అద్భుతమైన కథనంతో ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ్ విడుదల కానుంది. తారాగణం: అనంతిక సనిల్‌కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా, స్వరాజ్ రెబ్బాప్రగడ, సమీరా కిషోర్



సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి,
నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్
బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్
దినివీ: చెర్రీ, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్
డీఓపీ: విశ్వనాథ్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: అరవింద్ మ్యూల్, ఎడిటర్: శశాంక్ మాలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబాసాయి కుమార్ మామిడిపల్లి, యాక్షన్ కొరియోగ్రఫీ: వింగ్ చున్ అంజి
పీఆర్వో: వంశీ శేఖర్.

# ఎమోషన్స్ మూవీ 'కుబేర'

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర, పీపీ డమ్ డమ్ సాంగ్స్ చార్ట్ బస్టర్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**కుబేర ప్రాజెక్టు ఎలా మెటీరియలైజ్ అయింది?**

శేఖర్ కమ్ముల లవ్ స్టోరీ తర్వాత ఈ ఐడియాని మాకు చెప్పడం జరిగింది. ఈ కథకు ధనుష్ అయితే బాగుంటుందని ఆయన భావించారు. ఆయనకి ఈ కథని చెప్పారు. ధనుష్ కథ 20 నిమిషాలు విని వెంటనే సైన్ చేశారు. తర్వాత ప్రాజెక్ట్‌ని స్టార్ట్ చేశాము.

**శేఖర్ కమ్ముల ఫస్ట్ టైం ఇంత బిగ్ స్టార్ కాస్ట్‌తో సినిమా చేస్తున్నారు కదా? ఇది ఎంత డిఫరెంట్‌గా ఉండబోతుంది?**



శేఖర్‌కమ్ముల మాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. ఆయన లీడర్ సినిమా ఎప్పుడు చూసినా సరే చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. ఈసారి మరింత బిగ్గర్ స్టార్ కాస్ట్ తో తీశారు. కచ్చితంగా ఆడియన్స్‌కి చాలా న్యూ ఎక్స్పీరియన్స్ ఇవ్వబోతుంది. చాలా డిఫరెంట్ మూవీ ఇది.

**కుబేర కాన్సెప్ట్ ఏమిటి?**

మోస్ట్ రిచెస్ట్ మాన్ ఇన్ ద వరల్డ్, ది పూరెస్ట్ మ్యాన్ ఇన్ ది స్ట్రీట్స్ ఇది కాన్ఫ్లిక్ట్.

**కుబేర కథలో మిమ్మల్ని ఎక్సైజ్ చేసిన ఎలిమెంట్ ఏమిటి?**

శేఖర్ మంచి ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని టచ్ చేస్తూ ఫీల్ ఉండే సినిమాలను తీస్తారు. ఈ సినిమా కూడా అలాంటిదే. ఇందులో ఉండే ఎమోషన్స్ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతాయి.

**షూటింగ్‌లో ఎలాంటి ఛాలెంజస్ ఎదుర్కొన్నారు?**

రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయడం ఎప్పుడూ కూడా సవాల్‌తో కూడుకున్నదే. ఈ సినిమా కోసం అన్ని రియల్ లొకేషన్స్ లోనే షూట్ చేశాం. రియల్ స్లమ్స్, గార్బేజ్, డంపింగ్ యార్డ్స్‌లో తీసాము. బొంబాయిలో సినిమాని సూట్ చేయడం మరో ఛాలెంజ్. రియల్ వీధుల్లో సినిమాని సూట్ చేయడం జరిగింది. అది రియల్ ఛాలెంజ్.

# 'తమ్ముడు' ట్రైలర్ లాంచ్

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న తమ్ముడు సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో ఘనంగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ ప్రవీణ్ పూడి మాట్లాడుతూ, దిల్ రాజు బ్యానర్‌లో అద్భుతమైన చిత్రాలకు పనిచేసే అవకాశం లభించింది. తమ్ముడు చిత్రాన్ని శ్రీరామ్ వేణు చాలా కొత్తగా స్క్రీన్ మీద ప్రెజెంట్ చేశారు. హీరో నితిన్, ఇతర నటీనటుల పర్ ఫార్మెన్స్ చాలా బాగుంది. తమ్ముడు సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సినిమాటోగ్రాఫర్ కేవీ గుహన్ మాట్లాడుతూ, శ్రీరామ్ వేణుతో ఎంసీఏ, వకీల్ సాబ్ మూవీస్‌కు వర్క్ చేశాను. తమ్ముడు మూవీ ఒక సర్ ప్రైజింగ్ ఫిల్మ్. శ్రీరామ్ వేణు ఒక సర్ ప్రైజింగ్ సబ్జెక్ట్ ను మీకు చూపించబోతున్నాడు. ట్రైలర్ మీకు నచ్చిందని భావిస్తున్నా. తమ్ముడు సినిమా ప్రేక్షకులందరికీ రీచ్ కావాలి అన్నారు. బేబి దిత్య మాట్లాడుతూ, ఈ మూవీలో నా క్యారెక్టర్ పేరు దిత్య. సెట్‌లో వీళ్లందరితో కలిసి వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. అందరూ నన్ను బాగా చూసుకున్నారు. బాగా చూసుకోవడం అంటే చాక్లెట్స్ ఇవ్వడం కాదు. నాతో మాట్లాడటం, ఆడుకోవడం చేశారు. నితిన్ ఫన్‌గా ఉండేవారు అన్నారు. హీరోయిన్ సప్తమి గౌడ మాట్లాడుతూ, తమ్ముడు మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఈ చిత్రంలో ఫస్ట్ కాస్టింగ్ చేసింది నన్నే. తమ్ముడు మూవీలో రత్న అనే క్యారెక్టర్ చేశాను. నితిన్, లయ, వర్ష, స్వసిక..ఇలా వీళ్లందరూ బాగా పర్ ఫార్మ్ చేశారు. నాకు వాళ్లతో ఎక్కువగా సీన్స్ ఉండవు. ఎందుకు అనేది మూవీలో చూడండి. డానీ ఒక క్యారెక్టర్ నాతో పాటు ఉంటుంది. అజనీష్ లోకనాథ్ మ్యూజిక్‌లో నేను చేసిన థర్డ్ ఫిల్మ్ ఇది. ట్రైలర్‌లో మీరు బీజీఎం ఎంత బాగుందో విని ఉంటారు. తమ్ముడు మూవీ తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది. అన్నారు. నటి స్వసిక విజయన్ మాట్లాడుతూ, తమ్ముడు మూవీలో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఫీలవుతున్నాయి. నేను కెరీర్‌లో బిగినింగ్‌లో ఉన్నాను. ఇలాంటి టైమ్‌లో మంచి రోల్ దొరకడం సంతోషంగా ఉంది. అందుకు నిర్మాత దిల్ రాజుకి, డైరెక్టర్ శ్రీరామ్ వేణుకి థ్యాంక్స్ చెబుతున్నా. తమ్ముడు మూవీలో టాలెంటెడ్ కాస్టింగ్‌తో నటించడం మంచి ఎక్సీపీరియన్స్ ఇచ్చింది. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక విజువల్ ట్రీట్ లా ఉంటుంది. జూలై 4న తమ్ముడు మూవీని థియేటర్స్‌లో చూడండి అన్నారు.నటి లయ మాట్లాడుతూ, నేను సినిమా ఇండస్ట్రీ నుంచి విరామం తీసుకుని 20 ఏళ్లవుతోంది. తమ్ముడు మూవీతో తిరిగి నా నట ప్రయాణం మొదలుపెట్టాను. సొంతింటికి తిరిగి వచ్చిన అనుభూతి కలుగుతోంది. బ్రేక్ తర్వాత ఇండస్ట్రీకి రావాలనుకున్నప్పుడు సందేహాలు, భయాలు ఉండేవి. ఈ సినిమా టీమ్ నాలో ఆ భయాన్నిపోగొట్టి నమ్మకాన్ని కలిగించారు.



శ్రీరామ్ వేణు నాతో 2 రోజులు ఫొటో షూట్ చేయించి ఈ మూవీకి తీసుకున్నారు. అలాగే ఎంతోమంది ఆర్టిస్టులకు అవకాశాలు ఇస్తున్న దిల్ రాజు బ్యానర్‌తో నేను తిరిగి చిత్ర పరిశ్రమకు రావడం హ్యాపీగా ఉంది. మా ఆన్ స్క్రీన్ తమ్ముడు నితిన్‌తో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. నేను తిరిగి ఇండస్ట్రీకి వచ్చానంటే అందుకు నా భర్త, పిల్లల సహకారం ఎంతో ఉంది. నేను ఇప్పటిదాకా చేయాలనుకున్న పాత్రలు, సినిమాలు చేసే అవకాశం మరోసారి టాలీవుడ్ కల్పించింది. తమ్ముడు సినిమా తప్పకుండా విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం మా అందరిలో ఉంది అన్నారు.

# అరవడానికో దిండు !




**ఒక్కసారి 'ఛ ఈరోజే బాగాలేదు' అనిపిస్తుంది. అనవసరంగా ఆఫీసులో మాటలు పడట కాలేజీలో చీవాట్లు, అయినవాళ్లతో గొడవ...**
ఇలాంటప్పుడు కోపం, విసుగు వచ్చేస్తాయి కదా! ఆ సమయంలో గట్టిగా అరిచేయాలి అనిపిస్తుంది. ఎవరినో అరిస్తే ఎవరు ఊరుకుంటారండి? పోనీ ఎక్కడికైనా వెళ్లి అరుద్దామంటే చూసినవాళ్లంతా పిచ్చోళ్లు అనుకుంటారు. ఇంకేం చేస్తాం? ఆ కోపాన్నీ బాధనీ లోలోపలే అణచిపెడతాం. అదీ ఆరోగ్యానికి మంచిది కాదు అందుకే 'స్క్రీమింగ్ పిల్లో ట్రెండ్'ని అనుసరించండి. అంటే ఏమీలేదు. దిండులోకి ముఖాన్ని పెట్టి గట్టిగా అరిచేయడమే. దీనితో శబ్దం బయటికి రాదు, ఎవరో ఏదో అనుకుంటారన్న బెంగా ఉండదు. నిజానికి ఇలా అరవడం వల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. కోపం, ఆందోళన, బాధ... వంటి భావోద్వేగాలు మన మనసుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. వాటిని బయటికి పంపేయాలి. లేదంటే మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఒకసారి అరిచేసామో మనసే కాదు శరీరం నుంచీ టెన్షన్ పోతుంది. నెగెటివ్ ఆలోచనలన్నీ మెదడుకు విశ్రాంతి దొరుకుతుంది. పాతవాటికి తెరపడి సరికొత్త ఆలోచనలు మొదలవుతాయి. అన్నింటికీ మించి ఎవరిమీదా ఈ కోపం వెళ్లదు కాబట్టి, బంధాలు దూరమవ్వవు. ఎన్ని లాభలు కదా... ఇది గుర్తించాయి కాబట్టే సంస్థలూ ప్రత్యేకంగా స్క్రీమింగ్ పిల్లోలను మార్కెట్లోకి తెచ్చాయి. బాగుంది... ప్రయత్నించేద్దాం అనుకుంటున్నారా... పర్లేదు. అయితే దాని వద్దు అని అంటున్నారు మానసిక నిపుణులు. ఎప్పుడో ఒకసారి అయితే ప్రయత్నించొచ్చు. తరచూ దిండు వస్తోంటే నిపుణుల సలహాలు తీసుకోవడం, ధ్యానం, ఆర్ట్, మ్యూజిక్, వ్యాయామం వంటి థెరపీలను ప్రయత్నించడం మంచిది.

## తెలుసుకుందాం..



కమలా సోహోని.. సైంటిఫిక్ విభాగంలో పిహెచ్‌డి చేసిన మొదటి భారతీయ మహిళ. అప్పుడు ఐఐఎస్‌సీ డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ సివి రామన్ దగ్గర చదివిన మొదటి విద్యార్థిని కూడా ఈమేనట. కమలలోని ప్రతిభను మెచ్చి మరిన్ని పరిశోధనలు చేయడానికి ఆమెకు అనుమతి ఇచ్చారట. మొక్కల్లోని ప్రతి కణంలోనూ ఆక్సీకరణకు తోడ్పడే 'సైటోక్రోమ్-సి' అనే ఎంజైమ్ ఉంటుందని కనుగొన్నారీమె.

# సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సహిస్తూ..



**ఆమె చదివింది పీహెచ్.. ప్రముఖ ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా ఉద్యోగం.. నెల తిరిగేసరికి లక్షల కొద్దీ జీతం.. బంగారం లాంటి ఈ ఉద్యోగాన్ని ఎవరైనా వదులుకుంటారా? కానీ కామినీ సింగ్ వదులుకుంది. ఎందుకంటే ఉదయం నుండి సాయంత్రం నాలుగ్గోడల మధ్య ల్యాబ్‌లోనే గడపడం ఆమెకు సంతృప్తినివ్వలేదు. అందుకే ప్రయోగశాలను వదిలి పంట పొలాల్లోకి అడుగుపెట్టింది.**
ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేసి రైతులతో మమేకమైంది. ప్రస్తుతం ఓవైపు రైతులను సేంద్రీయ వ్యవసాయం దిశగా ప్రోత్సహిస్తూనే.. మరోవైపు మునగాకుతో ఆరోగ్యానికి మేలు చేసే ఉత్పత్తులెన్నో తయారుచేస్తోంది.. అందుకే అందరిలో ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. అసలు శాస్త్రవేత్తగా ఉన్న కామిని.. వ్యాపారవేత్తగా మారాలని ఎందుకనుకుంది? పిహెచ్‌డి చేస్తున్నప్పుడే..! ఈ రోజుల్లో ఎంతోమంది మహిళలు వ్యవసాయ రంగంలో కూడా అడుగుపెట్టి అద్భుతాలు సృష్టిస్తున్నారు. డాక్టర్ కామినీ సింగ్ ఇదే కోవకు చెందుతుంది. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఆమె.. వ్యవసాయ విద్యలో మాస్టర్స్ పూర్తిచేసింది. ఆపై లక్నోలోని ఫర్ సబ్ ట్రాపికల్ హార్టికల్చర్ (సిఐఎస్‌హెచ్) అనే ప్రభుత్వ రంగ పరిశోధనలో శాస్త్రవేత్తగా ఉద్యోగం సంపాదించింది. కొన్నేళ్ల తర్వాత అలహాబాద్ యూనివర్సిటీలో 'హార్టికల్చర్' పీహెచ్‌ఎలో చేరింది.

**ఓవైపు ఉద్యోగం చేస్తూనే..** మళ్లీ పీహెచ్‌ఎ చేశాను. ఇందులో భాగంగా కేంద్రీయ వ్యవసాయం, సాంకేతిక వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేశాను. ఈ సమయంలో స్థానిక రైతులను కలుసుకునే అవకాశం నాకొచ్చింది. ఇలా పంట పొలాలకు వెళ్లినప్పుడే జామ చెట్లు అంటుకట్టడం చూశాను. ఆ పంట మొత్తం అంటుక్టడంలో నేను, మా పిహెచ్‌డి బృందం రైతులకు సహాయం చేశాం. దీంతో పంట ఉత్పత్తి పెరిగి వారికి లాభాలొచ్చాయి. అయితే ప్రయోగశాలలకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక వ్యవసాయ పద్ధతుల గురించి.. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులకు ఏమాత్రం అవగాహన ఉండట్లేదన్న విషయం పిహెచ్‌డి పూర్తయ్యే సరికి నాకు అర్థమైంది. ఈ గ్యాప్ పూడ్చాలని, సరికొత్త వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్న నిర్ణయానికొచ్చా. అందుకే డాక్టరేట్ పట్టా పుచ్చుకోగానే ఉద్యోగానికి రాజీనామా చేసి.. పంట పొలాల్లోకి అడుగుపెట్టా.. అంటోంది కామిని.

**'నువ్వు తప్పు చేస్తున్నావ్' అన్నారు!** నెల తిరిగేసరికి లక్షల కొద్దీ జీతం వచ్చే ప్రభుత్వోద్యోగం వదులుకోవడమంటే మాటలు కాదు. ఆ తదనంతర పరిస్థితుల్ని ఎదుర్కొనే ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉండాలి. నా నిర్ణయం విని చాలామంది 'మంచి ఉద్యోగాన్ని వదులుకొని నువ్వు తప్పు చేస్తున్నావ్.. ఆ తర్వాత ఎదురయ్యే పరిస్థితులను తట్టుకోలేవు' అన్నారు. కానీ నాపై నాకు పూర్తి నమ్మకముంది.. అందుకే వెనక్కి తగ్గలేదు. ఆపై 'జైవిక్ వికాస్ కృషి సంస్థ' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించా. ఈ వేదికగా స్థానిక రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడం మొదలుపెట్టా. అయితే దీన్ని ఆచరణలో పెట్టాలంటే పంట ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల రైతులకు లాభసాటిగా అనిపించలేదు. దాంతో ఈ చిట్కాలను అనుసరించడానికి ఎవరూ ముందుకు రాలేదు. అలాగని నేను వాళ్లపై ఒత్తిడి తీసుకురాలేదు. కానీ తక్కువ ఖర్చుతో లాభాలు కురిపించే పంటను మాత్రం రైతులకు పరిచయం చేయాలనుకున్నా. ఈ కారణంగానే పీహెచీలో భాగంగా మునగ పంటపై పరిశోధనలు చేసి నేను సమర్పించిన థీసిస్ పేపర్లు గుర్తొచ్చాయి... దాంతో మరో ఆలోచన లేకుండా మునగ సాగు, ఈ పంట ద్వారా వచ్చే లాభాల గురించి రైతులకు



వివరించండి. ఈ పంట సాగుకు వాళ్ళు అంగీకరించడంతో నాలో ఉత్సాహం రెట్టించింది.. అని చెబుతోంది కామిని. మునగాకుతో.. 22 ఉత్పత్తులు! స్థానిక రైతుల సహకారంతో తక్కువ ఖర్చు, ఎక్కువ పంట ఉత్పత్తి ఉన్న మునగ సాగును ప్రారంభించిన కేంద్రం.. మునగాకుతో ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులను తయారుచేయాలన్న ఆలోచన చేసింది. ఇదే 2019లో 'డాక్టర్ మోరింగా' అనే సంస్థకు ఊపిరి పోసింది. మునగ పంటనే ఎందుకు ఎంచుకోవాలంటే. ఈ పంట సాగు కోసం ఎలాంటి రసాయనాల అవసరం ఉండదు. ఏ వాతావరణంలోనైనా తక్కువ ఖర్చుతో దీన్ని పండించచ్చు. పైగా ఇందులో ఆరోగ్యాన్నిచ్చే గుణలెన్నో ఉన్నాయి. మునగాకు, మునక్కాడలు, దీని బెరడు.. ఇలా ఈ చెట్టు అణువణువునా పోషకాలెన్నో నిండి ఉన్నాయి. అందుకే వీటిని వివిధ రకాల మందుల తయారీలో వాడుతుంటారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొనే నేను కూడా మునగాకుతో ఆరోగ్యాన్నిచ్చే వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయాలనుకున్నా. ఈ కోరనే రైతుల నుంచి మునగాకును సేకరించి.. ప్రత్యేక ఉత్పత్తులను ఎండబెట్టి, పొడిచేసి.. పలు రకాల ఉత్పత్తులను తయారుచేస్తున్నా.. అంటోన్న కామిని.. ప్రస్తుతం తన సంస్థ ద్వారా మునగాకు పొడితో పాటు మునగాకుతో సప్లిమెంట్లు, సబ్బులు, నొప్పి నివారణ నూనె, హెయిర్ ఆయిల్, కుసుమలు/బిస్కెట్లు.. సుమారు 22 రకాల ఉత్పత్తులను తయారుచేస్తున్నారు.

# మార్గదర్శకుడిగా నాన్న



**తండ్రులు పిల్లల పెంపకంలో చురుగ్గా పాలుపంచుకోవడం వల్ల వివిధ అంశాలలో తెలివితేటలతో వ్యవహరించడం, భావోద్వేగాల నియంత్రణ, విలువలు ఒంట పట్టించుకోవడం.. మొదలైన విషయాల్లో చిన్నతనం నుంచే పిల్లలు మరింత నేర్పరులుగా తయారయ్యే అవకాశం ఉంటుంది నిపుణులు**
చెబుతున్నారు. నాన్ననే మార్గదర్శకుడిగా చూస్తారు. వెంటతీసుకెళితే.. చాలామంది చిన్నతనంలో తండ్రి ఎక్కడికి వెళ్తే అక్కడికి తామూ వస్తామంటూ మారాం చేస్తుంటారు. అయితే అలాంటి సందర్భాలలో కొన్ని చోట్లకైనా పిల్లల్ని తీసుకెళ్లడం వల్ల సమాజంలో తమ తండ్రి ఎలా ప్రవర్తిస్తున్నారన్న విషయాన్ని పిల్లలు గ్రహించగలుగుతారు. దాన్నిబట్టి నలుగురిలో ఎలా మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో వారికి కూడా ఒక అవగాహన వస్తుంది. కాబట్టి పిల్లల్ని సాధ్యమైనంత వరకు తమ వెంట తీసుకెళ్లడం మంచిది. అలాగే వీలైనప్పుడల్లా పిల్లల్ని తండ్రి సంరక్షణలో వదిలేయడం మంచిదే. ఫలితంగా వారి నుంచి కొత్త కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం దొరుకుతుంది.

**పెరిగే అవగాహన..** సాధారణంగా తండ్రితో కూతురికి అనుబంధం కాస్త ఎక్కువగానే ఉంటుంది. అయితే అమ్మాయిలు తండ్రులతో ఎక్కువ క్లోజ్‌గా ఉండడం వల్ల వారు ఎదుర్కొనే భావోద్వేగాలు, ఒత్తిళ్లు.. వంటివి దగ్గర్నుంచి గమనించే అవకాశం ఉంటుంది. దీంతో వారికి ఇలాంటి విషయాలపై అవగాహన పెరుగుతుంది. తద్వారా జీవితంలో ఎప్పుడైనా ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు సులభంగా వాటిని అధిగమించగలుగుతారని దాంతో మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదని నిపుణులు చెబుతున్నారు.

**మార్గదర్శకుడిగా....**
తల్లి మాదిగానే తండ్రి పెంపకం వల్ల కూడా పిల్లలకు కష్టసుఖాలు, బరువు-బాధ్యతలు, ప్రేమానుబంధాలు.. మొదలైనవన్నీ చిన్నతనం నుంచి అలవడతాయి. ఎదుగుతున్న కొద్దీ వీటన్నింటిపై పిల్లలకు పూర్తి అవగాహన ఏర్పడే అవకాశం ఉంటుంది. చిన్నప్పట్నుంచీ ఇలాంటి ఎన్నో విషయాలను తండ్రులను చూసి నేర్చుకోవడం వల్ల క్రమంగా తండ్రులే వారికి మార్గ దర్శకులుగా మారే అవకాశం ఉంటుంది. ఫలితంగా కెరీర్‌లో, సమాజంలో మంచి గుర్తింపు సంపాదించుకో గలుగుతారు. తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చ గలుగుతారు. తద్వారా తండ్రికి తగ్గ పిల్లలుగా పేరు సంపాదించు కుంటారు.

# చిటికెలో బిస్కెట్లు ..



బిస్కెట్లలో **బోలెడన్ని రకాలుంటాయి కదూ!** తమ తమ ఇష్టాలను బట్టి నచ్చేవి కొనుక్కుంటారు. అంతే తప్ప బిస్కెట్లు మన తయారు చేసుకోవడం కొంచెం తక్కువ. ఈ గోధుమపిండితో చేసే డైజెస్టివ్ బిస్కెట్లు చాలా సులువుగా ఇంట్లోనే చేసుకోవచ్చు. దీని కోసం స్వచ్ఛమైన గోధుమపిండి అరకిలో, పలు, పంచదార, రవ్వ, ఎండు కొబ్బరి ఒక్కోటీ కప్పు చొప్పున, సోంపు ఒకటిన్నర స్పూన్, నెయ్యి 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి. ఒక పాత్రలో ఈ పదార్థాలు అన్నిటినీ వేసి బాగా కలపాలి. మెత్తటి ఈ పిండితో కొంచెం మందమైన రొట్టెలు చేయాలి. దాని ఈద గ్లాసు లేదా మూతతో నొక్కి గుండ్రటి ఆకృతులు వచ్చేలా కట్ చేయాలి. వాటి మీద ఫోర్క్‌తో గుచ్చి, రంధ్రాలు చేయాలి అన్నీ పూర్తయ్యాక. కాగుతున్న నూనెలో వేయించుకుంటే సరి. కరకరలాడే బిస్కెట్లు తయారైపోతాయి. ఇవెంతో రుచీ, ఆరోగ్యం కూడా. నిచ్చతే మీరూ చేసి చూడండి. పిల్లలూ పెద్దలూ అందరూ ఇష్టంగా తింటారు. ఇవి చాయ్‌లోకి మరింత బాగుంటాయి.

# నిమ్మను పెంచేయొచ్చు..

నిమ్మ రుచిలోనే కాదు.. ఆరోగ్య ప్రయోజనాలు అందించడంలోనూ మేటి. దీన్ని పెంచు కోవడమూ సులువే. **అదెలాగో తెలుసుకుందామా!** పరిమాణాలను బట్టి నిమ్మలో బోలెడు వెరైటీలు ఉన్నాయి ఇవి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాయి. 19వ శతాబ్దంలో విటమిన్ సి లోపం వల్ల వచ్చే స్కర్వీ వ్యాధిని నివారించడానికి బ్రిటిష్ నావికులకు రోజువారీ ఆహారంలో భాగంగా నిమ్మకాయలు ఇచ్చేవారట.



**ఎలా పెరుగుతుందంటే...**
నిమ్మ సాధారణంగా చిన్నగా గుబురుగానే కాదు... మధ్యస్థ ఎత్తు వరకూ ఎదుగుతుంది. సువాసన కలిగిన ఆకులు, తెల్లటి పువ్వులు, పసుపు పచ్చ రంగు కాయలతో నిండుగా కనిపిస్తాయి. ఇది వదులుగా ఉంటే సారవంతమైన ఇసుక కలిసిన మట్టి నేలల్లో దీన్ని నాటుకోవాలి, కుండీల్లో పెంచాలనుకుంటే మట్టిలో కాస్త కంపోస్ట్ కూడా కలపాలి. మొక్క చిన్నగా ఉన్న ప్పుడే సరైన మందులు అందించాలి. మూడు నెలలకోసారి సేంద్రియ ఎరువు ఎస్పీకేను అందించాలి. ఆకుల పచ్చదనం, పండ్ల పరిమాణం తగ్గినప్పుడు మైక్రో న్యూట్రియంట్స్ కూడా అందించాలి. వారంలో కనీసం ఐదారు సార్లైనా నీళ్ల పోయాలి. వేసవిలో ఈ అవసరం కాస్త ఎక్కువగా ఉంటుంది. అలాగని నీరు నిలిచే చోట నాటితే సరిగ్గా పెరగదు. దీనికి కనీసం ఆరేడు గంటల ప్రత్యక్ష సూర్యకాంతి, తగినంత గాలి ప్రసరణ అవసరం. నిమ్మ విత్తనాలు, అంటుకట్టడం ద్వారా ఈ మొక్కను సాగు చేయవచ్చు. లైమ్ మొక్కలను తెల్లపురుగు, బూడిద తెగులు ఎండుగడ్డి ఇబ్బంది పెడతాయి. వీటిని అరికట్టడానికి వేపనూనె పిచికారీ చేయాలి. బయోపెస్టిసైడ్లు వాడొచ్చు. ఒకటి కంటే ఎక్కువ మొక్కలు నాటితే వాటి మధ్య గ్యాప్ ఉండేలా చూసుకోవాలి.

**చెలి చిట్కా**
ప్రతిగింజలను దంచి రెండు చెంచాల పొడిలో **2 గ్లాసుల చొప్పున పాలలో త్రాగితే బాలింతలకు పాలు వృద్ధి చెందును.**

# జుట్టు సమస్యలకు కాకర !



**కాకరతో చేసిన వంటకాలు తినాలంటే అబ్బా.. చేదు అనుకోకుండా ఉండలేం. అయితే కాకరకాయ వల్ల మనకు ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్న విషయం తెలిసిందే. కాకర వల్ల కేవలం ఆరోగ్యానికే కాదు..**
మన కురుల అందానికీ ఎంతో మేలు జరుగుతుంది. కాకర రసం తరచూ పట్టించడం వల్ల జుట్టు రాలే సమస్య తగ్గుముఖం పడుతుంది. అలాగే కుదుళ్ల దృఢంగా, కురులు ఒత్తుగా తయారవుతాయి. అలాగే దీనిలో ఉండే కుదుళ్ల దృఢంగా, కురులు ఒత్తుగా తయారవుతాయి. అలాగే దీనిలో ఉండే యాంటీమైక్రోబియల్ గుణాల వల్ల చుండ్రు, తలలో వచ్చే ఇతర ఇన్ఫెక్షన్లు దరి చేరకుండా ఉంటాయి. ఈ ప్రయోజనాలను పొందాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..

**జుట్టు రాలే సమస్యకు...** ఈ రోజుల్లోనఎంతోమంది ఎదుర్కొనే సమస్య జుట్టు రాలిపోవడం. ఈ క్రమంలో కాకర రసాన్ని ఉపయోగిస్తే ఈ సమస్య నుంచి బయటపడచ్చు. దీనికోసం అరకప్పుకాకర రసాన్ని తీసుకొని దానిలో చెంచా కొబ్బరి నూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు మొత్తానికి పట్టించాలి. మాడుకు కూడా రాసి ఐదు నుంచి పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఆ తర్వాత ముప్పై నుంచి నలభై నిమిషాల పాటు ఆరనివ్వాలి. అనంతరం గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఈ మిశ్రమాన్ని వారంలో రెండుసార్లు అప్లై చేసుకోవడం ద్వారా జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది.

**చివర్లు చిట్లితే...** మన ఉపయోగించే హెయిర్‌కేర్ ఉత్పత్తుల్లోని రసాయనాలు, బయట కాలుష్యం ప్రభావం కారణంగా జుట్టు చివర్లు చిట్లడం సాధారణ సమస్యగా మారిపోయింది. దీనిపై మనం తలస్నానం చేసే విధానం కూడా ప్రభావం చూపుతుంది. దీన్ని నివారించడానికి సరిపడినంత కాకరకాయ రసాన్ని తీసుకొని కురులకు పట్టించాలి. 40 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చొప్పున చేస్తే.. మూడు వారాల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.



**చుండ్రు తగ్గించడానికి ....**
కురుల విషయంలో తగినంత శ్రద్ధ వహించక పోవడం, పోషకాహారం తీసుకోక పోవడం, కాలుష్యం తదితర కారణాల వల్ల చుండ్రు సమస్య ఎదురవుతుంది. దీనికోసం కొద్దిగా జీలకర్ర తీసుకొని మెత్తటి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని కాకర రసంలో కలిపి దాన్ని మాడుకు అప్లై చేసుకోవాలి. కొంతసేపు ఆరనిచ్చి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు నుంచి మూడుసార్లు చేయడం ద్వారా చుండ్రు సమస్య నుంచి విముక్తి కలుగుతుంది.

**తెల్లజుట్టు సమస్యకు...** వివిధ కారణాల వల్ల కొంతమందిలో కుదుళ్ల వద్ద మెలనిన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా చిన్నవయసులోనే జుట్టు తెల్లగా మారిపోతుంది. ఇలాంటి వారు తెల్ల వెంట్రుకలు కనపడకుండా చేయడానికి హెయిర్‌డైని వేసుకుంటూ ఉంటారు. వీటిలోని రసాయనాల వల్ల జుట్టు పాడయ్యే అవకాశం ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే కాకరను ఉపయోగించడం మంచిది. దీనికోసం సరిపడినంత కాకర రసాన్ని తీసుకొని దాన్ని వెంట్రుకల కుదుళ్ల నుంచి చివరి దాకా పట్టించి గంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా కొన్ని రోజులపాటు చేయడం వల్ల తెల్లజుట్టు తగ్గుముఖం పడుతుంది.

**పొడిబారిన జుట్టుకు..** కాకర రసం, పెరుగు అరకప్పు చొప్పున తీసుకోవాలి. వీటికి రెండు చెంచాల నిమ్మరసం జత చేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో కొంత భాగాన్ని మాడుకు పట్టించి కాసేపు మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. మిగిలిన భాగాన్ని వెంట్రుకలకు మొత్తం పట్టించి ముప్పై నిమిషాల పాటు అరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

# శాంతి బాట

మనుషుల మధ్య, దేశాల మధ్య సఖ్యత ఉండాలి కాని వైరం కాదు. మనం మాట్లాడే మాటలు ఎప్పుడు శాంతిగానే ఉండాలి. పరుషంగా ఉంటే లేని పోని అనర్థాలు వస్తాయి. అవే చిలికి చిలికి గాలి వానగా మారతాయి. అందుకే మాటలలో సౌమ్యం ఉండాలి అంటారు. ఇక దేశాలు కూడా అంతే మాటలు హద్దు మీరితే వాటికే నష్టం. "మీ రక్తం పారిస్తాం "అని ఒక దేశం అనడం ఎంత వరకు సమంజసం. అంటే వాళ్ళల్లో ఇంకా వైరం ఉంది అనేగా. కురు, పాండవుల మధ్య వైరం కూడదని శ్రీకృష్ణుడు చెప్పినశాంతి వచనాలు ఎందుకు కొరగకుండా పోయాయి. ధర్మరాజు సమ్మతించిన రారాజు దుర్యోధనుడు ససేమిరా అన్నాడు. శ్రీకృష్ణుడు నవ్వుతూ 'యుద్ధమే జరుగుగాక' అనే మాట నిజమైంది. అలా శాంతి బాట పట్టాల్సిన చోట యుద్ధం నెలకొంది. యుద్ధ భూమిలో తన బంధు, మిత్రులను చూచి పార్థుడు విచార వదనంతో ఉండగా శ్రీకృష్ణుడు బోధించిన భగవత్ గీత అర్జునుడిలో మార్పు తెచ్చింది. అల శాంతి మార్గం పట్టాల్సిన దాయాదులు వైరం తెచ్చుకున్నారు. ఫలితం కౌరవుల ఓటమి, పాండవుల విజయం జరిగింది. మనం ఇరుగు పొరుగు వారితో కూడా సౌమ్యంగానే మాట్లాడాలి. మనల్ని చూసి వాళ్ళు నేర్చుకోవాలి. పట్టు విడుపులు ఉండాలి. లేకపోతే రష్యా, ఉక్రైన్ యుద్ధం మాదిరి శాంతి లేక అశాంతి ఉంటుంది. ముఖ్యంగా మనకు రోజు వారి వైరం అత్తలతోనే ఉంటుంది. అత్త తన పెద్దరికం నిలుపుకోవాలి అని చూస్తే, కోడలు తన మాటే నెగ్గాలి అంటుంది. ఇద్దరి మధ్య మాటలు తార స్థాయికి చేరి ఒక చిన్న పాటి యుద్ధమే జరుగుతుంది. ఫలితంగా గృహాలలో శాంతి లేకుండా పోతుంది. ఒక దశలో అత్తలు కూడా, కోడలు మాట్లాడినా కూడా గంభీరంగా ఉంటారు. అది ఈ రోజులలో పని చేయదు. ఇద్దరి మధ్య ఎన్ని అభిప్రాయ బేధాలు ఉన్నా వాటిని తిరగదోసుకోకూడదు. కలసి, మెలసి ఉంటేనే అశాంతి పోయి శాంతి నెలకొంటుంది. శాంతి బాట మనకు, విశ్వం లోని అన్ని దేశాలకు ముఖ్యం. అందుకే " సర్వే జన సుఖి నో భ వంతు "అన్నారు.

– **కనుమ ఎల్లారెడ్డి**

ఆధ్యాత్మికం

# ఒకే బోర్డు ఎన్నో పనులు !





**కాయగూరలు కట్ చేయాలంటే చాపింగ్ బోర్డుతో పాటు చాకు,** స్లైసర్, వాటిని అమర్చుకోవ డానికి వేర్వేరు గిన్నెలు.. ఇవన్నీ అవసరమే! ఈ వస్తువులన్నీ ఒక్కోక్కటి ఒక్కో చోట అమర్చడం వల్ల కొన్నిసార్లు అవి దొరక్కపోవచ్చు. అలాకాకుండా అన్నీ ఒకే చోట అమర్చుకునే అవకాశం ఉంటే.. అదెలా సాధ్యమవుతుంది అనుకుంటున్నారా?



**మల్టీఫంక్షనల్ చాపింగ్ బోర్డుతో..**
ఫొటోలో చూపినట్లుగా బాక్స్ మాదిరిగా ఉంటుందీ బోర్డు. పైన కాయగూరలు కట్ చేసుకోవడానికి వీలుగా చాపింగ్ బోర్డులా, బాక్స్ ఓపెన్ చేస్తే.. అందులో చాకులు, వివిధ రకాల స్లైసర్స్ అమర్చునేందుకు ప్రత్యేక అరలుంటాయి. ఇక ఈ బోర్డుకు మధ్య భాగంలో ఉన్న అటాచ్‌మెంట్‌ని తొలగించి..దాని స్థానంలో వివిధ రకాల స్లైసర్స్‌ని అమర్చుకొని.. ఉపయోగించుకోవచ్చు. ఇక బాక్స్ అడుగుబాగంలో జాలీ తరహా ఫోల్డబుల్ బాక్స్ ఒకటి చాపర్‌కు అనుసంధానమై ఉంటుంది. కట్ చేసిన కాయగూరల్ని ఇందులో వేసుకొని శుభ్రం చేసుకోవచ్చు. ఇలా ఒక చాపింగ్ బోర్డుతో ఎన్నో రకాల పనులు చేసుకోవచ్చు.




**SHOWROOM: ANDHRA PRADESH:** RENAULT **VIJAYAWADA** Ph: 9667333486.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.